VICTORY

విక్టరీ

# 'చే' గెవారా



బయోగ్రఫీ సిరీస్

# చే గెవారా

✍

సి.వి.యస్.రాజు


విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 29-2-34,
రామమందిరం వీధి,
ఏలూర్ రోడ్,
విజయవాడ- 520 002.
ఫోన్ : 0866 - 2444156

డోర్. నెం. 2-4-1085, ప్లాట్ నెం. 3,
సాయిలక్ష్మినికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురు వీధి,
నింబోలి అడ్డా, హైదరాబాద్ 500027
సెల్ : 98481 22879

చే గెవారా

©Ln. **I. Ramakumar,** PMJF
Vijayawada.

ప్రథమ ముద్రణ – 2017

***Visit us:***
**www.victorypublishers .in**

**Also available at :**

**www.newshunt.com**
**www.kinige.com**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : ఆంధ్రప్రదేశ్**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ – 520 003.
**ఫోన్ : (0866) 2570192**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : హైదరాబాద్**

**బుక్ సెలక్షన్ సెంటర్**
కె.డి. హౌస్, 3-5-121/ఇ/1/2,
షాలిమార్ ఫంక్షన్ హాల్ దగ్గర,
రామకోటి, హైదరాబాద్.
**ఫోన్ : (040) 23446841, 23446843**
**(ఇ-మెయిల్) bschydin@gmail.com.**

**బుక్ సెలక్షన్ సెంటర్**
తిరుమల కమర్షియల్ కాంప్లెక్స్,
కామత్ హోటల్ ఎదురు, ఎస్.డి.రోడ్,
సికింద్రాబాద్. **ఫోన్ : (040) 23446849**


**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏమైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయుగలం. ఏ విషయమైన **ramakumarimmadisetty @gmail.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 31712393082** సాయి వేంకటేశ్వర బుక్ డిపో, **విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :*** **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# విషయానుక్రమాణిక


1. బాల్యం ........................................ 5
2. సైకిలు యాత్ర ........................................ 10
3. బొలీవియాలో ........................................ 13
4. చే – హిల్డా – ఫిదెల్ ........................................ 20
5. గ్రాన్ మాలో క్యూబాకు ........................................ 24
6. సియెర్రా పర్వతాలలో ........................................ 31
7. జనపోరాటం ........................................ 36
8. విప్లవ మార్గంలో తొలి అడుగులు ........................................ 41
9. నిరంతర సంఘర్షణ ........................................ 48
10. కాంగో అనుభవాలు ........................................ 58
11. మరోసారి బొలీవియాకి ........................................ 65
12. బొలీవియా యుద్ధం ........................................ 71
13. విప్లవమే శాశ్వతం! ........................................ 79
14. జ్ఞాపకాలు ........................................ 84



# చే గెవారా

# 1. బాల్యం

చేగెవారా తండ్రి పేరు ఎర్నెస్తో గెవారాలించ్. తల్లి సెలియాదలాసెర్నా. చే గెవారా, తండ్రి పూర్వీకులు ఐర్లాండు నుండి అర్జెంటినాకి వలస వచ్చారు. అతని తాత రాబెర్తో గెవారా ప్రభుత్వ సర్వేయర్‌గా పనిచేసేవాడు. వారిది సంపన్న కుటుంబం, అతని ఆరవ సంతానం ఎర్నెస్తో గెవారా లించ్. అతడు ఆర్కిటెక్చర్ కోర్సు చదివాడు.

అర్జెంటినా లోని రొజారియో అనే పట్టణంలో 1928, జూన్ 14 న చేగెవారా పుట్టాడు. వారి సాంప్రదాయం ప్రకారం మొదటి అబ్బాయికి తండ్రి పేరు, మొదటి ఆడ పిల్లకు తల్లిపేరు పెడతారు. తండ్రిపేరు ఎర్నెస్తో, తండ్రి యింటిపేరు గెవారా. తల్లి వంశం పేరు దలాసెర్నా కలిపి ఎర్నెస్తో గెవారా దలాసెర్నా అని అతనికి పేరు పెట్టారు.

సెలియా దలా సెర్నా పూర్వీకులు స్పెయిన్ నుండి అర్జెంటినాకి వచ్చి స్థిరపడ్డారు. ఈ కుటుంబం కాథలిక్ నియమాల్ని పాటించేది. కాని సెలియాకి వీటి మీద నమ్మకం లేదు. ఆమె చదువులో చురుకుగా ఉండేది. సాహిత్యం మీదా, రాజకీయాల మీదా అభిరుచి కలిగింది. సాంప్రదాయం ప్రకారం చిన్నప్పుడే ఆమెకి పెళ్లి చేద్దామనుకున్నారు. కాని ఆమె వ్యతిరేకించి మేనత్త యింటికి వెళ్లింది. అక్కడ ఫెమినిస్ట్ ఉద్యమ సంస్థతో కలిసి పని చెయ్యడం ప్రారంభించింది. స్త్రీలకు ఓటు హక్కు కోసం జరిగిన ఉద్యమాలలో పనిచేసింది. అబ్బాయిలాగా జుట్టుకత్తిరించుకుని కారు నడుపుతూ వెళ్లిన మొదటి మహిళ యీమెయే అని అర్జెంటినాలో చెప్పుకుంటారు. తన పేరిట బ్యాంకు ఖాతా ఉంచుకోవడం, అందరితోనూ నిర్భయంగా మాట్లాడడం అంతా అప్పటి సంచలన వార్తలే.


ఎర్నెస్తో గెవారాలించ్ అప్పుడు ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సెలియా యొక్క ఆత్మగౌరవం, ఆమెయొక్క ప్రవృత్తీ అతనికి బాగా నచ్చాయి. వారు పెళ్లి చేసుకునేటప్పుడే పేద ప్రజలకు సహాయం చేయాలనీ, చర్చికి వెళ్లకూడదనీ నిర్ణయాలు తీసుకున్నారు.

కాని అతని ఇంజనీరింగ్ పనులు సక్రమంగా సాగడం లేకపోవడం వల్ల వ్యవసాయం చేద్దామనుకున్నాడు.



మిషియోనెస్ పట్టణానికి దగ్గర్లో వాళ్లకి తేయాకు పండించే పొలాలున్నాయి. యజమానులకు ఆ తోటల వల్ల చాలా ఆదాయం వచ్చేది. కూలీలకు తక్కువ జీతాలు యివ్వడం, వారిని కొట్టడం చేసేవారు. ఎర్నెస్తో గెవారా లించ్ తన తోటల్ని ఆదర్శ వంతంగా తీర్చి దిద్దాలనుకున్నాడు. కూలీలకు జీతాలు పెంచారు. చుట్టు ప్రక్కల యాజ మాన్యాల వారు ఆందోళన మొదలు పెట్టారు. వారు కమ్యూనిస్టులంటూ ప్రచారం చేశారు. పోలీసులు వారిని బాధలు పెట్టడం ప్రారంభించారు. ఆ వేధింపులు భరించలేక వారు రొజారియోకి వచ్చేశారు. అక్కడే ఎర్నెస్తో – చే గెవారా పుట్టాడు. అక్కడ టీ పొడి తయారు చేసే ఫ్యాక్టరీ పెట్టారు. అక్కడ కూడా నష్టమే వచ్చింది. మళ్లీ మిషియోనెస్‌కి వెళ్లారు. అక్కడే రెండవ సంతానం 1929 లో సెలియా పుట్టింది.

ఎర్నెస్తో (గెవారా)కి రెండేళ్లు వచ్చాయి. అతనిని తీసుకుని తల్లిదండ్రులు స్విమ్మింగ్




పూల్‌కి వచ్చారు. నీళ్లలో దిగిన వెంటనే ఎర్నెస్తోకి దగ్గు మొదలయింది. దగ్గుతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. డాక్టరు దానిని అస్తమాగా నిర్ధారణ చేసి మందులిచ్చాడు. ఆ జబ్బు అతనిని జీవితాంతం బాధించింది. రాత్రింబగళ్లు తల్లి దండ్రులకు అతనిని కనిపెట్టుకుని ఉండడంతోనే సరిపోయేది. వాతావరణం మార్పు కోసం అతనిని బ్యూనస్ ఐరిస్‌కి తీసుకుని వెళ్లారు. సెలియాకి అక్కడ రాబర్తో అనే కుమారుడు కలిగాడు. అది ఎర్నెస్తో గెవారాలించ్ యొక్క తండ్రిపేరు. ఎర్నెస్తో ఆరోగ్యంలో మార్పు కనపడలేదు. వేడిగా ఉండే కొండ ప్రాంతానికి



అతనిని మార్చమన్నారు. ఆల్తాగ్రాసియా అనే చిన్న పట్టణానికి మారారు. ఆరోగ్యం కొంత మెరుగయింది. అనారోగ్య కారణాల వల్ల అతనిని స్కూలుకి పంపలేదు. ఇంట్లోనే అతనికి తల్లి చదువు చెప్పింది. కొందరు స్నేహితులు కూడా ఏర్పడ్డారు. వారిలో అతనికి వైద్యం చేసే డాక్టరు కొడుకు కార్లోస్ ఫెర్ర్ ఒకరు. 1938 లో ఎర్నెస్తోకి చెల్లెలు అనామారియా పుట్టింది. 1936 లో ఎర్నెస్తోని ఒక పబ్లిక్ స్కూలులో చేర్పించారు. కాని అనారోగ్యం వల్ల సక్రమంగా బడికి వెళ్లలేకపోయే వాడు. ఏ మాత్రం ఆరోగ్యంగా ఉన్నా పిల్లలతో కలిసి ఆడేవాడు.



ఎర్నెస్తో ఆరోగ్యంగా ఉండడానికి ఎవరు ఏమి చెబితే అలా చేసేవారు తల్లిదండ్రులు. పిల్లవాడు పడుకునే పరుపులో పిల్లిని దూర్చి ఒక రాత్రంతా ఉంచితే తగ్గుతుందంటే అలాగే చేశారు. కాని అతనికి దగ్గు ఎక్కువయింది, పిల్లి చనిపోయింది. ఎక్కువ కాలం మంచంలో ఉండడం కూడా ఒక బాధే, దానిని కూడా ప్రయోజనకరంగా మార్చుకుందామనుకున్నాడు ఎర్నెస్తో. తల్లిదండ్రు లిద్దరికీ సాహిత్యం మీద అభిలాష ఉంది కాబట్టి తాను కూడా యింట్లో ఉన్న పుస్తకాలు చదవడం ప్రారంభించాడు.



రాత్రివేళల్లో భోజనాలు చేసేటప్పుడు ఎర్నెస్టో తల్లిదండ్రులు కథలూ, తమ పూర్వీకులను గురించి చెబుతూ ఉండేవారు. స్పెయిన్‌లో జరిగిన అంతర్యుద్ధం గురించి చెప్పినప్పుడు అది అతని మనస్సులో నాటుకునిపోయింది. వార్తా పత్రికల ద్వారా, రేడియోల ద్వారా వార్తలు తెలుసుకునేవాడు. యుద్ధం ఆట ఆడేవాడు. ఆ ఆటల్లో కాలు దెబ్బతిన్నా లక్ష్య పెట్టలేదు. ఎప్పుడూ ఆస్తమాతో పోరాడడంతో అతనికి మొండితనం అలవాటయింది. తనను అందరూ సానుభూతితో చూడడం అతనికి యిష్టం ఉండేది కాదు. అటువంటి సమయాలలో కూడా తట్టుకుని నిలబడడానికే ప్రయత్నించేవాడు. పిస్టల్‌తో షూటింగ్ నేర్చుకున్నాడు. సాహసవంతమైన పనులు చేస్తూ ఉండేవాడు.



అప్పుడు ఎర్నెస్టో పదకొండేళ్లవాడు. కుటుంబం ఆ గ్రామంలోనే యింకో యింటికి మారింది. అక్కడ ఒక డాక్టరు కుటుంబంతో పరిచయం అయింది. వారింట్లో సిగ్మండ్ ఫ్రాయిడ్ పుస్తకాలున్నాయి. వాటిని చదివి వ్యాఖ్యానించేవాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీలకు వ్యతిరేక కూటమి ఏర్పాటయింది. ఎర్నెస్టో నాజీలకు వ్యతిరేకంగా ప్రచారం చేసేవాడు.



ఎర్నెస్తో ఆరోగ్యం బాగుపడలేదు. కాని దానిని భరించడం అతనికి అలవాటయింది. ఆటల మీద ఆసక్తి పెరిగింది. ఏ ఆటలోనైనా అతడే గెలవాలి. ఆటలో ఊపిరి అందకపోతే ఇన్‌హేలర్ పీల్చి గెలిచేవరకు ఆడేవాడు. ఏ మాత్రం సమయం దొరికినా ఏదో పుస్తకం చదువుతూనే ఉండేవాడు.

1943 కుటుంబం కార్డొబాకి మారింది. ఎర్నెస్తో తండ్రి అక్కడ ఒకరితో కలిసి వ్యాపారం చేశాడు. ఆ ఏడాది మే 18 న ఎర్నెస్తోకి చిన్నతమ్ముడు జువాన్ మార్టిన్ పుట్టాడు. అది సెలియా తండ్రిపేరు. ఎర్నెస్తోకి పుస్తకాలు చదవడం బాగా అలవాటయింది. అప్పుడే గాంధీరచనలు కూడా చదివాడు. గాంధీ మీద అతనికి ఆరాధనా భావం ఏర్ప డింది. కొన్ని విషయాలలో అతడు దురుసుగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాడు. కాని కొన్ని విషయాలలో సున్నితంగా ఉంటాడు. జంతువులపైనా అతనికి సానుభూతి ఉంది. అతడు ఒక కుక్కని పెంచాడు. దాన్ని ఎవరో విషం పెట్టి చంపేశారు. అతడు చాలాబాధపడి దానికి అంత్యక్రియలు కూడా చేశాడు.

లాటిన్ అమెరికా దేశాలలో సైనిక నియంతల పాలన సాగుతూంది. వారు ప్రజల మీద పెత్తనం సాగిస్తున్నారు. ఎర్నెస్తోలో తీవ్ర అశాంతి మొదలైంది. “ఈ మిలిటరీ ప్రభుత్వాలు ప్రజల్ని అజ్ఞానంలోనే ఉంచాలనుకుంటున్నాయి. ప్రజలు చదువుకుని జ్ఞానవంతులైతే ఆ పెత్తనాన్ని సహించరు” అనేవాడు. సైనికుల నిరంకుశ పాలనకి వ్యతిరేకంగా విద్యార్థులు సమ్మె చేశారు. పోలీసులు వారిని జైలులో పెట్టారు. అరెస్టయిన వారిలో ఎర్నెస్తో మిత్రుడు కూడా ఉన్నాడు. అతనిని చూడడానికి ఎర్నెస్తో వెళ్తే నిరసన ప్రదర్శనలు నిర్వహించమని ఆ మిత్రుడు ఎర్నెస్తోని కోరాడు.

1946 లో ఎర్నెస్తో ఇంజనీరింగ్ చదవాలనుకున్నాడు. బ్యూనస్ ఐరిస్‌లో యూనివర్శిటీలో చేరాడు. ఏదైనా ఉద్యోగంలో చేరాలని లాబరేటరీ టెక్నీషియన్ పరీక్షరాశాడు. ఉద్యోగం వచ్చింది. దానిలో కొనసాగుతూ ఇంజనీరింగ్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా పూర్తి చేయాలనుకున్నాడు. అదే సమయంలో గాంధీ హత్యచేయబడ్డాడు. ఎర్నెస్తో చాలా బాధపడ్డాడు. అంతలో అతని అమ్మమ్మ అనాకు మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి, పక్షవాతం వచ్చి చనిపోయింది. ఎర్నెస్తో ఇంజనీరింగ్ మాని వేసి మెడిసిన్‌లో చేరాడు.

# 2. సైకిలు యాత్ర



ఎర్నెస్టో బ్యూనస్ ఐరిస్ యూనివర్శిటీలో వైద్యవిద్యార్థిగా చేరాడు. డాక్టర్రై పేద ప్రజలకి సేవ చెయ్యాలని అతని కోరిక. అందువల్ల రాజకీయాల జోలికి పోకుండా చదువు మీద కేంద్రీకరించాడు. అతని తండ్రి కూడా అక్కడే ఒక చిన్న యిల్లు అద్దెకు తీసుకుని తన సివిల్ ఇంజనీరింగ్ ఆఫీసు ప్రారంభించాడు.

ఎర్నెస్టోకి చదరంగం, ఫుట్‌బాల్ యిష్టమైన ఆటలు వాటిలో నైపుణ్యం ఉన్నందువల్ల ఒక స్పోర్ట్స్ పత్రికకి సంపాదకుడై "చాంగ్ చో" అనే కలం పేరుతో ఆటల మీద వ్యాసాలు రాసేవాడు. ఆ రోజుల్లో కమ్యూనిస్ట్ యువజన విభాగానికి చెందిన తితిఫెర్రర్ అనే విద్యార్థితో పరిచయం అయింది. ఎర్నెస్టోకి కమ్యూనిస్టుల మీద గురి కలగలేదు.

సైకిల్ ప్రయాణాలంటే ఎర్నెస్టోకి ఆసక్తి కలిగింది. ఎంత దూరమైనా సైకిలు మిదే వెళ్లేవాడు. మైక్రాన్ బైసికిల్స్ కంపెనీ తయారు చేసిన మోపెడ్ మీద 1950 జనవరి 1న యింటి నుండి బయలు దేరాడు. అతని ప్రయాణం గురించి అతని ఫోటోతో సహా పత్రికలలో ప్రచురించబడింది. తన మోపెడ్ మీద రిపబ్లిక్ అంతా పర్యటిస్తున్నాడు అనే వార్త పడింది.

జనవరి 29 న చనార్‌లో ఉన్న కుష్టువ్యాధి ఆస్పత్రి దగ్గరకు వచ్చాడు. అక్కడ తన మిత్రుడు పని చేస్తున్నాడు. కుష్ఠురోగికి స్పర్శ జ్ఞానం ఉందోలేదోనని సూదులతో గుచ్చుతున్నాడు. అలా గుచ్చడం ఎర్నెస్టోకి బాధకలిగించింది. ఇంకా సున్నితమైన పద్ధతిలో పరీక్ష చేయమని చెప్పాడు.

తన యాత్రా విశేషాల్ని ఎప్పటికప్పుడు డైరీలో రాయడం అలవాటు చేసుకున్నాడు ఎర్నెస్టో, మొత్తం మీద 2800 మైళ్లకు పైగా ప్రయాణం చేశాడు. బాగా అలసి పోయినా కొత్త విషయాలు తెలుసుకున్నాననే సంతృప్తి అతనికి కలిగింది. మళ్లీ తన చదువు మీద కేంద్రీకరించాడు.

ఒకసారి కార్డోబాలో ఉండే తన మిత్రుని వివాహానికి ఎర్నెస్టోవెళ్లాడు. అక్కడ ఒక అందమైన అమ్మాయిని చూశాడు. అందరూ ఆమెను చిన్‌చినా అని పిలుస్తారు. ఎర్నెస్టో ఆమెతో ప్రేమలో పడ్డాడు. కాని వారి మధ్య చాలా అంతరం ఉంది. ఆమె బాగా సంపన్నురాలు, రాజవంశీయురాలు. ఎర్నెస్టో మధ్యతరగతికి చెందిన వాడు. పైగా అతని దుస్తులు చాలా సామాన్యమైనవి. వారానికొకసారి ఉతుక్కుని వేసుకునేవాడు. అందుకే మిత్రులు అతనికి "వీక్లీ" అని పేరు పెట్టారు. ఎర్నెస్టో చిన్‌చినా యింటి చుట్టూ తిరగడం మొదలు పెట్టాడు. ఒకసారి ఆమె అతనిని తన యింటికి రమ్మని పిలిచింది. వారిది రాజభవనం. తన సాధారణ దుస్తులతోనే వారి యింటికి వెళ్లాడు. అతని ఆకారం చూసి అందరూ నవ్వుకున్నారు. కాని తత్వశాస్త్రం గురించీ, సాహిత్యం గురించీ అతడు అనర్గళంగా మాట్లాడడంతో వారు మాట్లాడలేకపోయారు.

అప్పుడప్పుడు ఎర్నెస్టో చిన్‌చినాకు ఉత్తరాలు రాసేవాడు. పెళ్లి చేసుకుందామనీ, హనీమూన్‌కి అమెరికాకి వెళ్దామనీ రాసేవాడు. ఆ ఉత్తరాల్ని ఆమె తల్లిదండ్రులు చూసి, అతనిని దూరంగా ఉంచమని చెప్పారు. ఆమె కూడా అతనిని దూరంగా ఉంచింది.

తండ్రిమీద ఆధారపడకుండా ఉండడానికి ఏ పని చేయడానికైనా వెనుకాడలేదు. కొన్నాళ్లకి యాంత్రిక జీవనం విసుగుపుట్టింది. కుష్టు ఆస్పత్రిలో పని చేసే తన మిత్రుడైన గ్రనాడోతో కలిసి ఉత్తర అమెరికా వెళ్లాలనుకున్నాడు. అతడు కూడా అంగీకరించాడు. ఎర్నెస్టో తన తల్లి దండ్రుల వద్దా చిన్‌చినా వద్ద సెలవు తీసుకున్నాడు. చిన్‌చినాకి "కమ్‌బాక్" అనే కుక్క పిల్లను బహూకరించాడు. ఆమె కూడా అతనికి 15 డాలర్లు యిచ్చి స్విమ్ సూటు కొనుక్కోమని చెప్పింది.

జనవరి 16 కి ఎర్నెస్టో, గ్రనాడోలు మోటార్ సైకిల్ మీద బహియా బ్లాంకాకు చేరారు. పట్టణం శివార్లలో ఎర్నెస్టో బైకు మీద నుంచి జారిపడ్డాడు. గాయం అయింది. అయినా ప్రయాణం చేసి బెంజమిన్ జొరిల్లా అనే పట్టణానికి వచ్చారు. గాయం వల్ల ఎర్నెస్టోకి జ్వరం వచ్చింది. జ్వరం తగ్గిన తరువాత మళ్లీ బయలుదేరి ఫిబ్రవరి 14 నాటికి చిలీ చేరారు. ఆ సమయంలో బైకు పట్టుతప్పి పడిపోయింది. స్నేహితులిద్దరికీ దెబ్బలు తగిలాయి. బండిని రిపేరు చేయించి, బయలు దేరారు. అంతటి కష్టమైనా అలాతిరగడంలో ఎర్నెస్టో ఉద్దేశం రైతులు, ఇండియన్ తెగలవారి జీవన పరిస్థితుల్ని తెలుసుకోవడం బండి మళ్లీ మొరాయించడంతో రిపేరు చేయించి, రాగి గనులున్న ప్రాంతానికి చేరారు. ఆ గనులు బ్రిటిష్ వారి అధీనంలో ఉన్నాయి. అక్కడ పనిచేసే కార్మికులు దారిద్ర్యంలో ఉన్నారు.



అక్కడనుండి పెరూనగరం చేరుకున్నారు. అప్పటికి బాగా అలసిపోయి ఉన్నారు. అర్ధరాత్రి ఒక యింటి తలుపుతట్టారు. అది ఒక రైతు కుటుంబం, తాము డాక్టర్లమని పరిచయం చేసుకున్నారు. ఆ రైతు కుటుంబం వీరిని ఆదరించింది. అక్కడి నుండి మళ్లీ ప్రయాణం సాగించారు. బండి మధ్యలో పాడవుతూనే ఉంది. కజ్‌కో ప్రాంతం చేరుకున్నారు. ఆ ప్రాంతం ఎర్నెస్టోకి బాగా నచ్చింది. తరువాత వారు హెూ ఆంబో పట్టణంలో ఉన్న కుష్టువ్యాధి చికిత్సా కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఎర్నెస్టోకి ఆస్తమా వచ్చింది. అక్కడ ఇంజక్షన్లు తీసుకున్నాడు. అక్కడ నుండి బయలుదేరి లీమా నగరం చేరారు. చేతిలో ఉన్న డబ్బు అయిపోయింది. లీమాలో పెస్చే అనే డాక్టరు కుష్ఠువ్యాధి చికిత్సలో నిపుణుడు. అతని యింట్లో వారు పదిరోజులున్నారు. తరువాత అమెజాన్ ప్రాంతాలకు పడవలో వెళ్లారు. ఆ పడవలో ఒక అందమైన అమ్మాయి ఉంది. ఆ అమ్మాయితో గ్రనాడో కబుర్లలో మునిగిపోయాడు. ఆమె ప్రవర్తన ఎర్నెస్టోకి నచ్చలేదు. ఆ అమ్మాయిని తిట్టాడు. నైతిక విలువల్ని కాపాడ వలసిన బాధ్యత స్త్రీలదే అని చెప్పాడు.

మిత్రులిద్దరూ సన్‌పాబ్లోలో ఉన్న కుష్ఠువ్యాధి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడున్న డాక్టర్లకు సహాయం చేశారు. అక్కడ రోగులతో ఆటలు ఆడుతూ కొన్నాళ్లున్నారు. జూన్ 14 ఎర్నెస్టో పుట్టిన రోజు. అప్పటికి అతనికి 24 ఏళ్లునిండాయి. ఆ రోజు అమెజాన్ నదిలో యీతకు వెళ్లాడు. ప్రవాహం ఎక్కువగా ఉంది. అయినా మొండిగా రెండున్నర మైళ్లు యీదాడు. అతనికి ఆస్తమా వస్తుందేమేనని భయపడ్డాడు గ్రనాదో.

తరువాత వారు కొలంబియా చేరారు. అక్కడ వెతీషియా పట్టణంలో బస చేశారు. ప్రయాణానికి డబ్బులు లేవు. ఆ పట్టణంలో ఒక ఫుట్‌బాల్ క్లబ్బు ఉంది. ఆ క్లబ్బు మేనేజర్ని కలిసి కోచ్‌లుగా ఉద్యోగం సంపాదించారు. కొంత డబ్బు సంపాదించాక బొగోతా చేరారు. అప్పుడు కొలంబియా అధ్యక్షుడు లొరియానో గోమెజ్. అక్కడ రైతుల మీద, కార్మికుల మీద హింసలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా సాయుధ పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ప్రభుత్వానికి ఎదురు తిరిగే ప్రసక్తేలేదు. జైళ్లన్నీ రాజకీయ నేరస్తులతో నిండిపోయాయి. కొత్తవాళ్లమీద నిఘా ఉంది. విద్యార్థుల హాస్టల్ ఆశ్రయం సంపాదించారు.

అంతలో పోలీసులు వచ్చి వారిని అరెస్టు చేశారు. దేశం నుండి వెళ్లిపోతామంటే విడిచి పెట్టారు. విద్యార్థులు కొంత సొమ్ముపోగుచేసి మిత్రులకు యిచ్చారు. వారు వెనిజులా చేరారు.

అక్కడి వాతావరణం ఎర్నెస్తోకి పడలేదు. మళ్లీ ఆస్తమా వచ్చింది. గ్రనాడోకి ఒక కుష్టువ్యాధి కేంద్రంలో ఉద్యోగం దొరికింది. అతడు అక్కడే కొన్నాళ్లు ఉండి పోదామను కున్నాడు.  కాని ఎర్నెస్తో ఆర్జెంటినాకు వెళ్లిపోదామనుకున్నాడు. ఆ ఊళ్లోనే తమకి దూరపు బంధువైన ఒక గుర్రాల వ్యాపారిని కలుసుకున్నాడు. అతడు కార్గో విమానంలో ఎర్నెస్తోని బ్యూనస్ ఐరిస్‌కి పంపుతానన్నాడు. కాని ఎర్నెస్తో ఎక్కిన విమానం మియామి వరకూ వచ్చి చెడిపోయింది. అక్కడ విమానం బాగు అయ్యే వరకూ ఉండిపోవలసి వచ్చింది. జేబులో ఒక్కడాలర్ మాత్రమే మిగిలింది. అక్కడ హోటల్‌లో ఒక గది సంపాదించాడు. అర్జెంటినా వెళ్లి డబ్బు పంపిస్తానని ఒప్పించాడు. 20 రోజుల తరువాత విమానం బాగు పడింది.

1952 ఆగస్టులో ఎర్నెస్తో బ్యూనస్ ఐరిస్‌కి తిరిగివచ్చాడు. ఎర్నెస్తో విప్లవ కారుడుగా మారడానికి అతని పర్యటనే కారణం. కార్మికుల, రైతుల కష్టాలు ప్రత్యక్షంగా చూశాడు. ఉన్నత వర్గాల వారు, విద్యావంతులూ దళారీలుగా మారి దోపిడీ వర్గాలకు పరిచర్యలు చేస్తున్నారు. అవన్నీ చూసి చలించి పోయాడు ఎర్నెస్తో. ఈ పర్యటన తరువాత లాటిన్ అమెరికాలోని రాజకీయ పరిణామాల్ని అధ్యయనం చేయడం మొదలుపెట్టాడు.

చేగెవారా వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసింది అతని చెల్లెలు సిలియా. ఎర్నెస్తోకి రెండేళ్ళు వయస్సు ఉండగా ఆస్తమా మొదలై జీవితాంతం అతనికి సమస్యగా మారింది. చిన్నప్పుడే తండ్రి దగ్గర గుర్రపు స్వారీ నేర్చుకున్నాడు.

# 3. బొలీవియాలో

ఎర్నెస్తో పరీక్షలకు తయారవుతున్నాడు. 1953లో అతడు చివరిసారిగా చిన్చినాను కలిశాడు. తరువాత వారిద్దరి మధ్య ఎటువంటి సంబంధాలు లేవు. పరీక్షలు బాగా రాశాడు. ఖచ్చితంగా ప్యాసవుతానన్నాడు. “డాక్టర్ గెవారాను మాట్లాడుతున్నాను” అని తండ్రికి ఫోన్ చేశాడు కూడా.

తాను వెనిజుయెలాలో గ్రనాదో బాటు కుష్టురోగుల హాస్పిటల్‌లో పనిచేస్తానని చెప్పాడు. అంత దూరంలో ఉంటే అతని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంటుందో అని భయపడ్డారు.



తల్లిదండ్రులు. అయినా అతడు పట్టువదలలేదు. తనతో పాటు తన మిత్రుడైన కలికా ఫెర్రర్‌ని కూడా తీసుకునివెళ్లాడు. రెతిరో రైల్వే స్టేషన్లో వారికి కుటుంబ సభ్యులంతా వీడ్కోలు చెప్పారు. అప్పుడతడు,"అమెరికా పోరాట యోధుడు మీకు వీడ్కోలు చెబుతున్నాడు" అన్నాడు. అతని ఉద్దేశం ఏమిటో అప్పుడు ఎవరూ అర్థం చేసుకోలేక పోయారు.

గ్రనాదోతో కలిసి పని చేస్తానని చెప్పాడు. కాని అతడు బొలీవియాకి బయలుదేరాడు. లాటిన్ అమెరికా ప్రజల కష్టాలు అతన్ని కలవరపెడుతున్నాయి. నిస్వార్థంగా పనిచేసే డాక్టర్లు ఉన్నంత మాత్రం చేత యీ సమస్యతీరదు. రాజకీయ వ్యవస్థ మొత్తం యు.యస్. ప్రభుత్వం చేతిలో ఉంది అయితే స్థానిక ప్రభుత్వాలు ఏ మాత్రం వ్యతిరేకించినా వారి ప్రభుత్వం పడిపోతుంది. అందుకే ప్రభుత్వం సాయుధ గొరిల్లాలను సిద్ధం చేసింది.

అప్పుడప్పుడు లాటిన్ అమెరికా దేశాల అధ్యక్షులు స్వంత నిర్ణయాలతో సంస్కరణలు చేపట్టారు. గొరిల్లాదళాలు వాళ్లమీద బెదిరింపులకు దిగాయి. వారు కొంతమంది అధ్యక్షుల్ని హత్య చేశారు కూడా. ఇటువంటి విషయాలన్నింటినీ ఎర్నెస్టో తన పర్యటనలో తెలుసుకున్నాడు.

అయితే బొలీవియాలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. అక్కడి రాజకీయ చరిత్ర గురించి ఎర్నెస్టో అధ్యయనం చేశాడు. బొలీవియాలో సహజ వనరులు చాలా ఉన్నాయి. చమురు, తగరం, బంగారం ఎక్కువగా లభిస్తుంది. ఆ గనుల మీద ఆధిపత్యం విదేశీ కంపెనీలదే. స్థానికులు ఆ గనులలో కార్మికులుగా దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. పైగా వ్యసనాలకు బానిసలవుతున్నారు. శిశుమరణాల రేటు బొలీవియాలో ఎక్కువే.




బొలీవియాలో గనుల మీద ఆధిపత్యం కోసం వలస దారులు వస్తారు. ఇతర దేశాల వారు రారు. రైతుల్నీ కార్మికుల్నీ సంఘటితం చేయడానికి ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. కాని అవన్నీ అణగ ద్రొక్కబడ్డాయి. వారి నందర్నీ సంఘటితం చేయడం కష్టమైన పనే. దేశరాజధాని లాపాజ్. రాజధానిలో పరిస్థితులు ఎప్పుడూ ఉద్రిక్తంగానే ఉంటాయి. ఒక ప్రక్క నిరసనలు, యింకొక ప్రక్క సైనిక కవాతులు, భయంగొలిపే పోరాటాలు. అయితే కార్మికులు తమడి మాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడానికి వెళ్లేటప్పుడు జేబులో డైనమెట్లు పెట్టుకుని వెళ్లేవారు. అదొక్కటే వారి ఆత్మ రక్షణకి మార్గం. కార్మికులు ప్రభుత్వ అధికారుల్ని చంపిన సంఘటనలు కూడా ఉన్నాయి.

1952, ఏప్రిల్ 9న బొలీలియోలో ఒక తిరుగుబాటు జరిగింది. అప్పుడు రైతులు, కార్మికులు సుసంఘటితంగా, వ్యూహాత్మకంగా, క్రమశిక్షణతో తిరుగుబాటు చేశారు. దానిని నేషనల్ రివల్యూషనరీ మూవ్‌మెంట్ అన్నారు. ఉద్యమనాయకులలో ఒకరైన విక్టర్‌పాజ్ ఎస్తెన్‌సోరో బొలీవియాకి అధ్యక్షుడయ్యాడు. ఈ పరిణామం ఉద్యమకారులకు ఉత్సాహాన్ని కలగజేసింది.

కొత్త ప్రభుత్వం కొన్ని ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశ పెట్టింది. తగరపు గనుల్ని జాతీయీకరణ చేశారు. అయితే విదేశీ కంపెనీలకు భారీ నష్టపరిహారం చెల్లించవలసి వచ్చింది. వ్యవసాయరంగంలోను కొన్ని సంస్కరణలు చేశారు. ప్రపంచంలో ఉన్న ఉద్యమనాయకులు తమ మద్దతుని ప్రకటించారు. ఈ పరిస్థితుల్ని అధ్యయనం చేసినందు వల్ల ఎర్నెస్తోని బొలీవియా ఆకర్షించింది.

మిత్రులిద్దరూ రెండవ తరగతి కంపార్టుమెంటులో ప్రయాణం చేశారు. ఫ్యాక్టరీలలో పనిచేసే ఇండియన్ కార్మికులతో రైలు నిండి ఉంది. ఆ రైలు ద్వారా పాలు సరఫరా అవుతాయి. కాబట్టి రైలు ప్రతిస్టేషన్లోను ఆగుతుంది. పైగా కార్మికులతో కలిసి ప్రయాణించడం వల్ల వారికి మరికొన్ని విషయాలు తెలుస్తాయి.



లాపాజ్ చేరాక వారు ఒక చిన్న గది అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రతినిధుల్ని కలిసి తాము దేశ ప్రజలకు తమ సహకారాన్ని అందిస్తామని చెప్పాడు. సమాచార - సాంస్కృతిక శాఖలోను, వ్యవసాయ శాఖలోను పనిచేశాడు. అక్కడ ప్రాచీన ఇండియన్ల సాంస్కృతిక అవశేషాల్ని చూసి ఆకర్షితుడయ్యాడు. అంతగొప్ప సంస్కృతి గలవారు అక్కడ పరాయి వారిగా జీవిస్తున్నారు. అతడు పరిశోధక వ్యాసాలు రాస్తూ, "లాటిన్ అమెరికా ప్రజలు వాళ్ల గత వైభవాన్ని మళ్లీ సాధించుకుంటారు." అని రాశాడు. కొత్త ప్రభుత్వం స్థిరంగా కొనసాగలేదని పించింది.

కొత్త ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంస్కరణల్ని అడ్డుకోడానికి యు.యస్. పెట్టుబడి దారులు ప్రజల మీద దాడికి దిగారు. అయితే నేషనల్ రివల్యూషనరీ మూవ్‌మెంట్ ఉద్యమం చేస్తుందని ఎర్నెస్టో ఎదురుచూశాడు. కాని అది అనుకున్నంత సులభం కాదు.

ఎమ్.ఎన్.ఆర్. అనే సంస్థలో మూడు గ్రూపులున్నాయి. ఒకటి హెర్నల్ సిలెస్ సొవాజో నాయకత్వం లోని మితవాద గ్రూపు విక్టర్ పాజ్ ఎస్తెన్సోరా నాయకుడు. మూడవది హువాన్ వెచిన్ గ్రూపు. వీరు వామ పక్షవాదులమని చెప్పుకుంటారు. వాళ్లమధ్య సైద్ధాంతిక పరమైన అవగాహనలేదు. ట్రేడ్ యూనియన్లు అవినీతి పరులైన రాజకీయ నాయకుల పెత్తనంలో ఉన్నాయి.

ఇటువంటి పరిస్థితుల్లో కూడా ప్రజలు సాయుధ దళాలుగా ఏర్పడుతున్నారు. కమ్యూనిస్టులు వారిని సంఘటితం చేస్తూంది. కాని వారికి కార్మికుల మీద పట్టులేదు. బొలీవియాలోని కమ్యూనిస్టు ఉద్యమం వెలుపలి దాడుల్ని తట్టుకోగలదేమోకాని, లోపలి ఉద్యమకారుల్ని తట్టుకుని నిలబడగలదనేది సందేహం.

ఎర్నెస్తోకి రికార్డొరోజో అనే యువలాయరు పరిచయమయ్యాడు. అతడు అర్జెంటినాకు చెందిన వాడు. అతనికి తిరుగుబాటు ఉద్యమాలతో సంబంధం ఉందనే అనుమానంతో పోలీసులు అతనిని వెంటాడుతున్నారు. అతడు గ్వాతిమాలారాయబార కార్యాలయంలో తలదాచుకుంటున్నాడు. గ్యాతిమాలా అధ్యక్షుడు జాకొబా అర్బెంజ్ గజ్‌మన్ అమెరికన్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. ఎర్నెస్తోని అక్కడికి వెళ్లమని ఆ లాయరు చెప్పాడు.

ఎర్నెస్తో గ్వాతిమాలాకువెళ్లాలని నిశ్చయించుకున్నాడు. మిత్రులిద్దరూ తితికా సరస్సుని దాటుతూ ఉండగా. కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. తనిఖీ చేసి విడిచిపెట్టారు. తరువాత వారు లీమా పట్టణం చేరారు. అక్కడ రోబో వాళ్లనికలిసి తాను గ్వాతిమాలా వెళ్తున్నట్లు చెప్పి, వాళ్లని కూడా తనతో రమ్మన్నాడు.

పెరూలో పరిస్థితులు యింకా దారుణంగా ఉన్నాయి. అక్కడ ఓఢ్రియా అనే సైనిక నియంత అధ్యక్షుడుగా ఉన్నాడు. అతడు యు.యస్. ప్రభుత్వానికి దళారిగా ఉన్నాడు. ప్రజలను అనేక విధాలుగా హింసిస్తున్నాడు. జైళ్లన్నీ రాజకీయ ఖైదీలతో నిండిపోయి ఉన్నాయి. ఎర్నెస్తో, కలికా, రోజోలు కొలంబియాకి చేరారు.

ఆ రోజుల్లోనే కొలంబియాలో తిరుగుబాటు జరిగింది. గోమెజ్ అనే నియంత స్థానంలో జనరల్ రోజాస్ పినిల్లా అధ్యక్షుడయ్యాడు. ఎర్నెస్తో, కలికాలు గుయాక్విల్ చేరారు. చేతిలో డబ్బులేదు. పెరూలో పరిచయమైన గుయాలో గార్షియా అక్కడకనపడ్డాడు. అతని ద్వారా లాయర్ సల్వదార్ అయెందే పరిచయమయ్యాడు. ఆయన యిచ్చిన సిఫార్సు ద్వారా యునైటెడ్ ఫ్రూట్ కంపెనీకి చెందిన స్టీమర్లో చోటు దొరికింది. ఎర్నెస్తో, కలికా, గార్షియాలు పనామాకి బయలుదేరారు.

పనామా చేరారు కాని డబ్బు సమస్య ఉంది. ఒక విద్యార్థి నాయకుడు రోమ్యులో ఎస్కోబార్ పరిచయం అయ్యాడు. తన గదిలో వారికి ఆశ్రయం యిచ్చాడు. ఆ విద్యార్థి మీద కూడా పోలీసు దాడులు జరుగుతూ ఉన్నాయి. డబ్బులేక ఎర్నెస్తోకి, మిత్రులకి తమ పుస్తకాల్ని బట్టల్ని అమ్ముకోవలసి వచ్చింది. పనామాలోని మాచు పిచ్చూ ప్రాంతంలోని చారిత్రక విశేషాలను గురించీ, దాని సంస్కృతి గురించీ వ్యాసాలు రాశాడు. ఆ వచ్చిన డబ్బుని పోగుచేసి కోస్తారికాకు బయలు దేరారు.

వారు కోస్తారికారాజధాని సన్‌హొసేకు చేరుకున్నారు. ఫిగ్యూరెస్ దానికి అధ్యక్షుడు. గతంలో అతడు కాఫీ తోటలయజమాని. అప్పటి అధ్యక్షుడు లియోదొరొ పికాబోకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అధ్యక్షుడయ్యాడు. అనేక దేశాల ఉద్యమకారులకు మద్దతుయిస్తాడు. విప్లవ కారులు చాలామంది సన్‌హొసేలోనే ఉన్నారు.

సన్‌హొసేలో సోడాఫ్యాలెస్ అనే హోటల్లో కొంతమంది మిత్రులు పరిచయం అయ్యారు. వారు ప్రవాసంలోఉన్న క్యూబాకి చెందిన యువకులు. వారి అధ్యక్షుడైన బతిస్తాకి వ్యతిరేకంగా పనిచేసినందుకు వారిని దేశం నుండి బహిష్కరించారు.

చక్కెర ఉత్పత్తికి క్యూబా ప్రసిద్ధి. ఆ చక్కెర పరిశ్రమ మీద అమెరికా పెత్తనం చెలాయిస్తుంది. ఫిడెల్ కాస్ట్రో అనే యువన్యాయవాది అధ్యక్షుడైన బతిస్తా మీద సాయుధ

పోరాటం చేశాడు. మన్మాదా సైనిక స్థావరం మీద దాడి చేశాడు. అది విఫలమయింది. పోలీసు కాల్పుల్లో కొందరు కార్యకర్తలు చనిపోగా, ఫిడెల్‌ని, అతని తమ్ముడు రావుల్‌ని జైలులో పెట్టారు. ఈ విషయాలు తెలుసుకున్న ఎర్నెస్తో పెట్టుబడిదారీ భూతాన్ని అంతం చేస్తానని స్టాలిన్ స్మృతి మీద ప్రమాణం చేశాడు. సన్‌హౌస్‌లో ఎర్నెస్తోకి డొమినికన్‌కి చెందిన రచయిత హువాన్ బోష్ పరిచయం అయ్యాడు.

గ్వాతిమాలాలో విప్లవ ప్రభుత్వం ఉందని తెలుసుకుని ఎర్నెస్తో కొందరు మిత్రులతో కలిసి గ్వాటిమాలా చేరాడు. ఆ నగరం అతనికి చాలా నచ్చింది. ఆ ఊళ్లో హిల్డా అనే కమ్యూనిస్టు అమ్మాయి ఉందని తెలిసి ఆమెను కలుసుకోడానికి వెళ్లాడు. ఆమె పెరూలో పుట్టి పెరిగింది. వామపక్ష సంస్థలో సభ్యురాలు. నియంతృత్వ ప్రభుత్వం ఆ సంస్థని నిషేదించింది. అందువల్ల ఆమె గ్వాటిమాలా వచ్చి అక్కడ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూంది.

హిల్డా సహాయంతో వారు ఒకగది సంపాదించారు. ఎర్నెస్తో తీవ్రంగా ఆస్తమావచ్చింది. కొంతవరకు డబ్బు సహాయం హిల్డాయిచ్చింది కాని వారి పరిస్థితి చాలా కష్టంగానే ఉంది. అక్కడ మరి కొంతమంది ప్రవాసులు పరిచయం అయ్యారు. ఎర్నెస్తో సాయుధ విప్లవమే మార్గం అనేవాడు. కాని హిల్డా సామాజిక సంస్కరణల ద్వారా సాధించవచ్చునని వాదించేది.

గ్వాతి మాలాలో యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ ఉంది. అది యు.యస్.కి చెందినది. లక్షలాది ఎకరాలమీద యీ కంపెనీ పెత్తనం చెలాయిస్తుంది. భూ ఆక్రమణలూ, దోపిడీలూ చేస్తుంది. 1944లో సైనికులు తిరుగుబాటు చేశారు. హువాన్ హొసే అరీవలో అధ్యక్షుడయ్యాడు. ఈ ప్రభుత్వం సంస్కరణలు చేయాలని సంకల్పించింది. 1950 లో జరిగిన ఎన్నికలలో ఆర్బెంజ్ అధ్యక్షుడయ్యాడు. అతడు వ్యవసాయ రంగంలో సంస్కరణలు ప్రారంభించాడు. యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ ఆధీనంలో ఉన్న భూముల్ని జాతీయా కరించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దానితో కలకలం మొదలైంది. ఆర్బెంజ్‌ని పదవి నుండి దింపాలనే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆర్బెంజ్‌ని కమ్యూనిస్టుగా చిత్రీకరిం చారు. సరిగా యిటువంటి సమయంలో ఎర్నెస్తో గ్వాతిమాలా వచ్చాడు. ఆర్బెంజ్‌కి సహాయం చేయాలనుకున్నాడు. అతడు ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి తన అభిప్రాయాన్ని తెలియ జేశాడు. ఆ విధంగా అతడు స్వచ్ఛంద కార్యకర్తగా పనిచేశాడు.

రాను రాను యు.యస్. ఆర్బెంజ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. హొండ్యూరాస్ అధ్యక్షుడు కూడా వాళ్లతో చేతులు కలిపాడు. ఆర్బెంజ్ మీద కిరాయి

సేనలను దాడికి పంపాలనుకున్నారు. వీటిని ప్రజాస్వామిక శక్తులు ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయాయి. కారణం వారి మధ్య ఐకమత్యత లేకపోవడమే.

ఈ పరిస్థితిని మార్చడానికి ఎర్నెస్తో కొందరు మిత్రులతో కలిసి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. మేయర్‌నీ, కార్మికుల పార్టీ ఉపాధ్యక్షుడినీ కలిశాడు. కాని వారి నుండి సరియైన స్పందన రాలేదు. ఈ లోగా ఎర్నెస్తోకి హిల్డాతో సాన్నిహిత్యం ఎక్కువయింది. ఆమెకు యిష్టమైతే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఆమెకు కూడా యిష్టమే కాని యిద్దరి భావాలు వేరు వేరుగా ఉన్నాయి. పైగా అతనికి ప్రయాణాలంటే పిచ్చి, అందువల్ల ఆమె ఒక నిశ్చయానికి రాలేకపోయింది.

1954లో కారకాస్ పట్టణం ఇంటర్ అమెరికన్ సమావేశం జరిగింది. దానిలో ఆర్బెంజ్‌ని కమ్యూనిస్టుగా చిత్రీకరించి లాటిన్ అమెరికా దేశాలు అతనితో పొత్తుపెట్టుకో రాదని తీర్మానం చేసింది. తరువాత అమెరికా తన సాయుధసేనల్ని పంపి గ్వాతిమాలా మీద దాడులు జరిపించింది. ప్రజలు కొందరు మరణించారు. దానితో ప్రజలంతా కలిసికట్టుగా ఆర్బెంజ్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. ఎర్నెస్తో చాలా సంతోషించాడు.

అమెరికా వామ పక్ష కూటమితో ఎర్నెస్తో సంబంధాలు సాగించాడు. గ్వాతిమాలా రక్షణ కోసం తాను కూడా పనిచేస్తానని బ్రిగేడియర్ రొమెరోతో చెబితే అతడు ఎర్నెస్తోకి ఒక రైఫిల్ యిచ్చాడు. యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రజలు చాలామంది చనిపోతు న్నారు. ప్రజల్ని సాయుధుల్ని చేసి ఎదురుకుంటే ప్రయోజనం ఉంటుందనుకున్నాడు ఎర్నెస్తో. కాని ఆర్బెంజ్ శాంతియుతంగా దాడుల్ని ఆపడానికి ప్రయత్నిస్తున్నాడు. యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. పైగా అమెరికా రెచ్చిపోయింది. ప్రభుత్వం అసమర్థంగా ఉందని ప్రజలు నిరసనలు ప్రదర్శించారు. తమకు ఆయుధాలు యిమ్మని ప్రజలు కోరారు. ఆర్బెంజ్ ప్రభుత్వంలోని మిలిటరీ అధికారులు లంచాలకు లొంగి ఆర్బెంజ్ మీద తిరుగుబాటు చేశారు. 1954, జూన్ 27న ఆర్బెంజ్ రాజీనామా చేశాడు. అతనిని బంధించి రాయబార కార్యాలయంలో ఉంచారు. కల్నల్ కొస్త్రిల్లో ఆర్మాస్‌ని యు.యస్. గ్వాటిమాలాకు అధ్యక్షుడిని చేసింది.

కమ్యూనిష్టుల మీద దాడులు పెరిగాయి. అయినా ఆ సమయంలో కూడా ఎర్నెస్తో ఉద్యమాన్ని ఆపడానికి సమ్మతించలేదు. ప్రజలు అతడిని ఒక పిచ్చివాడుగా చూశారు. కమ్యూనిస్టుల జాబితాలో ఎర్నెస్తోపేరుకూడా ఉంది. ఎర్నెస్తో తన గదిని ఖాళీ చేసి అర్జెంటినా రాయబార కార్యాలయంలోకి మారాడు. అక్కడ కొంతమంది కమ్యూనిస్టులు పరిచయం అయ్యారు. హిల్డా కూడా యిల్లు ఖాళీ చేసి యింకొక చోటికి వెళ్లింది. అయినా పోలీసులు

ఆమెను వెంటాడి అరెస్టు చేశారు. ఆమెను ఎర్నెస్తో వివరాలు అడిగారు. ఆమె చెప్పలేదు. ఆమెను జైలులో పెట్టారు. తరువాత ఆమెను విడుదల చేశారు. ఎర్నెస్తోను తల్లి దండ్రులు యింటికి తిరిగి రమ్మన్నా అతడు వెళ్లలేదు.

ఎర్నెస్తో రహస్యంగా హిల్డాని కలుస్తూనే ఉన్నాడు. ఇద్దరూ మెక్సికో వెళ్లాలనుకున్నారు. అతడు పెళ్లి విషయం ఎత్తినా ఆమె వాయిదా వేస్తూనే ఉంది. అతనితో సంసారం సజావుగా సాగుతుందనే నమ్మకం ఆమెకు కలగడం లేదు. ముందుగా ఎర్నెస్తో మెక్సికో వెళ్లాడు. తరువాత వచ్చి కలుస్తానని హిల్డా అతనికి మాటయిచ్చింది.


# 4. చే - హిల్డా - ఫిదెల్

మెక్సికోకు రైల్లో వెళ్తూన్నప్పుడు ఎర్నెస్తోకి జూలియో రాచెర్తో కరకాస్ వల్లే అనే యువజర్నలిస్టు పరిచయం అయ్యాడు. అందరూ అతనిని పాతోజో అని పిలుస్తారు. (పొట్టివాడు). ఇద్దరూ మెక్సికో చేరారు. ఇంటికోసం వెదకడం మొదలు పెట్టారు. ఆ నగరంలో ఒక ప్రక్క చక్కని భవనాలున్నాయి. ఇంకో ప్రక్క పూరి గుడిసెలున్నాయి, మురికి వాడలున్నాయి. ప్రభుత్వం వేటినీ పట్టించుకున్నట్లు కనిపించలేదు. గ్వాతిమాలాలో భయంకర దాడులు జరుగుతున్నా మెక్సికోలో కదలిక కనిపించలేదు. అప్పటి అధ్యక్షుడు అదాల్ఫో రూయిజ్ కార్డినోస్. ప్రజల మీద జరుగుతూన్న దోపిడీని అతడు అభివృద్ధిగా చిత్రీకరిస్తున్నాడు.

గది కోసం వెతుకుతూన్న ఎర్నెస్తో, అతని మిత్రులకి జువాన్ జర్బే అనే వ్యక్తి ఆశ్రయంయిచ్చాడు. అతడు పోర్తోరికోకు చెందిన వాడు, నేషనలిస్ట్ పార్టీ నాయకుల్లో ఒకడు. ఈ పార్టీని పోర్తోరికోలోను, యు.యస్.లోను నిషేదించారు. మళ్లీ ఉద్యమాన్ని తయారు చేయడానికి జర్బే మెక్సికోకి వచ్చాడు. ఎర్నెస్తోకి మిత్రులకి ఆశ్రయం దొరికింది కాని నిత్యావసరాలకి డబ్బులు లేవు. కాస్తిల్లో బేనా అనే వ్యక్తి ఫోటో స్టూడియో నడుపుతున్నాడు. అతడు వీరికి ఒక కెమేరాయిచ్చాడు. ఇంటింటికీ తిరిగి ఫోటోలు తీసేవారు. అక్కడ చాలామంది ప్రవాసులతో ఎర్నెస్తోకి పరిచయాలు ఏర్పాడ్డాయి. కొన్నాళ్లకి హిల్డా కూడా మెక్సికోకి వచ్చింది. రాగానే పెళ్లి చేసుకుందామా అని అడిగాడు. స్థిరమైన ఉద్యోగం వచ్చే వరకు పెళ్లి చేసుకోనని చెప్పింది.

కొన్నాళ్లకు ఎర్నెస్తోకి అర్జెంటినా ప్రభుత్వ వార్తా సంస్థలో ప్రెస్ ఫోటోగ్రాఫరుగా ఉద్యోగం దొరికింది. పాతోజోకి కూడా ఒక పుస్తకాల షాపులో నైట్‌వాచ్‌మెన్‌గా ఉద్యోగం

దొరికింది. హిల్డా ఎర్నెస్తోని, పోతోజోని విందుకి రెండుసార్లు పిలిచింది. రెండు సార్లు అతడు ఆలస్యంగా వెళ్లాడు. ఆమెకి కోపం వచ్చింది. నూతన సంవత్సర కానుకగా ఆమెకి ఒక పుస్తకాన్ని యిచ్చాడు. త్వరలోనే పెళ్లి చేసుకుందామని మాటయిచ్చింది. కాని ఒక రోజు ఎర్నెస్తో తనకిచ్చిన పుస్తకాన్ని తెరిచి చూస్తే ఒక అందమైన అమ్మాయి ఫోటో కనిపించింది. ఆమెకు అసూయ కలిగింది. అది ఒక సినీ నిర్మాత కుమార్తెదనీ, ఆమె ఫోటో తీయమంటేనే తీశానని నచ్చ చెప్పినా ఆమె వినలేదు.




చివరకు అనుమానాలతో ఉన్న హిల్డాను పెళ్లిచేసుకోనని చెప్పేశాడు. అయితే కొన్నాళ్లకు ఆమెకి జ్వరం వచ్చింది. "డాక్టర్‌గెవారా" (ఎర్నెస్తో)కి కబురు చేసింది. అతడు చికిత్స చేసి రోగాన్ని నయంచేశాడు. మళ్లీ యిద్దరూ కలిసిపోయారు. పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

ఎర్నెస్తోకి కార్డియాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చి అసిస్టెంటుగా ఉద్యోగం దొరికింది. అక్కడే భోజనం, వసతి, ఏర్పాటయ్యాయి. ఎలర్జీలను గురించి కొన్ని పరిశోధనలు చేశాడు. తరుచు తల్లిదండ్రులకీ, స్నేహితులకీ ఉత్తరాలు రాసేవాడు. హిల్డాకి కూడా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం దొరికింది. ఇద్దరూ పెళ్లి చేసుకోడానికి లైసెన్సు కోసం అధికారుల చుట్టూ తిరిగినా వారు నిరాకరించారు. చివరికి ఎర్నెస్తో తన మకాంని హిల్డా గదికి మార్చేశాడు. మేడే రోజున యిద్దరూ పెరేడ్ చూడడానికి వెళ్లారు. కాని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కార్మిక సంఘాలు మాత్రమే పెరేడ్‌లో పాల్గొన్నాయి. ఎర్నెస్తోకి విషయం అర్థమయింది.

నికోలోపెజ్ ఎర్నెస్తోను అతడు పనిచేస్తూన్న హాస్పిటల్‌లో కలిసి కాస్ట్రోకూడా మెక్సికోవచ్చాడని చెప్పాడం ఎర్నెస్తో ఫిడెల్ కాస్ట్రోని కలిసి లాటిన్ అమెరికా ప్రజల స్థితిగతుల్ని గురించి చర్చించారు. హిల్డా కూడా వారితో కలిసి పనిచేస్తానని చెప్పింది. ఎర్నెస్తో, హిల్డా ఉన్న గదిలో చోరీజరిగింది. హిల్డా టైపు రైటరూ, ఎర్నెస్తో కెమేరా

దొంగిలించబడ్డాయి. ఆ పని చేసింది పోలీసులని తెలిసి, వారు పోలీసులకి ఫిర్యాదు చేయలేదు.

మెక్సికోనగరం దగ్గరలో హిల్డా, ఎర్నెస్తోలు పెళ్లి చేసుకున్నారు. ఎర్నెస్తో తన తల్లిదండ్రులకు ఆ విషయాన్ని తెలియజేశాడు. ఫిదెల్‌కాస్ట్రో విప్లవ ఉద్యమాన్ని తయారు చేయడానికి విరాళాల కోసం యు.యస్.కి వెళ్లాడు. తిరిగి వచ్చిన తరువాత తనకు మద్దతు యిచ్చే విప్లవకారులు ఎంత మంది ఉన్నారో అంచనావేశాడు. చాలామంది యిస్తారనే నమ్మకం కలిగింది. క్యూబా స్వాతంత్ర్య పోరాటాన్ని ఓరియంతే ప్రాంతం నుండి ప్రారంభించాలని ఫిదేల్ ఆలోచన. సాయుధ పోరాటానికి, గెరిల్లాల రక్షణ ప్రాంతం సియోర్రా మాస్ట్రాన్‌గా ఎంపిక చేశాడు. అయితే గెరిల్లాలకి శిక్షణ యిచ్చే వ్యక్తి కావాలి. ఆర్సాషియో వెనెగాస్ అరోయో అనే మెక్సికన్ కార్యకర్తల్ని పట్టణానికి దూరంగా ఉన్న పర్వత ప్రాంతానికి తీసుకుని వెళ్లి జూడోలో శిక్షణ యిచ్చాడు.

మెక్సికోలో ఫర్నిచర్ ఫ్యాక్టరీ ఒకటి ఉంది. దాని యజమాని ఆల్బర్తొబాయో. అతడు సైనికాధికారిగా పనిచేశాడు. స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరిగింది. అతడు ఉద్యోగాన్ని వదిలేసి ప్రజల పక్షాన పోరాడాడు. యుద్ధం అయిపోయిన తరువాత మెక్సికోలో వ్యాపారం చేస్తున్నాడు. ఫిదెల్ అతనిని తన కార్యకర్తలకు శిక్షణ యివ్వవలసిందిగా కోరాడు. అతడు వెంటనే అంగీకరించాడు. ఉచితంగా శిక్షణ యివ్వడమే కాకుండా ఉద్యమం కోసం తన ఫ్యాక్టరీనే అమ్మేసి ఖర్చుపెట్టాడు.

1956 ఫిబ్రవరి 15 న హిల్డాకు కూతురు పుట్టింది. తన ఆస్తమాజబ్బు కూతురికి ఎక్కడ వస్తుందో అని ఎర్నెస్తో భయపడేవాడు. అతనిలో సున్నితత్వం వచ్చింది. కూతురికి హిల్డాబియా ట్రిజ్ అనిపేరు పెట్టారు. ముద్దుగా హిల్దితా అని పిలిచేవారు.

బాయో గెరిల్లా శిక్షణ యిస్తున్నాడు. క్రమ శిక్షణతో చాలా కఠినమైన శిక్షణ యిస్తున్నాడు. తుపాకుల్ని ఉపయోగించడం, మ్యాపుల్ని చూసి లక్ష్యాలుగుర్తించడం మారు వేషాలతో రహస్యంగా తిరగడం, మందుగుండు సామాగ్రి తయారు చేయడం, బరువైన ఆయుధాల తోను బ్యాగులతోను ఎత్తు పల్లాల్లో వేగంగా నడపడం మొదలైనవి నేర్పాడు. ఎర్నెస్తో క్రమ శిక్షణతో నేర్చుకున్నాడు. అంతే కాక వైద్యంలో మిగిలిన కార్యకర్తలకు శిక్షణ యివ్వడం మొదలైనవి చేసేవాడు. మార్క్సిస్టు సిద్ధాంతాల్ని కూడా బోధించేవాడు. సాంతా రోజాక్యాంపుకి బాయోమిలిటరీ అధ్యక్షుడిగాను, ఎర్నెస్తో సర్వసైన్యాధ్యక్షుడిగాను వ్యవహరిస్తున్నారు. కొంతమంది క్యూబా కార్యకర్తలు విదేశీయుడైన ఎర్నెస్తోని నియమించడం యెడల

అసంతృప్తిని తెలియజేశారు. ఒక విదేశీయుడు మన దేశం కోసం రక్తాన్ని చిందిస్తున్నాడంటే అంతకంటే నిజాయితీ ఏముంటుందని ఫిదెల్ వారికి ఘాటుగా సమాధానం యిచ్చాడు. ఎల్‌క్యుతే అనే వ్యక్తి గెరిల్లాలకు తుపాకులు సప్లయి చేసేవాడు. అతనికి తుపాకుల ఫ్యాక్టరీ ఉంది.

కార్యకర్తలలో చాలా రకాల నేపథ్యాలు గలవారున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. వారినందరినీ సంఘటితపరిచే బాధ్యత తీసుకున్నాడు ఫిదెల్. గెరిల్లా శిక్షణ కార్యక్రమంలోనే ఎర్నెస్టో గెవారా "చే"గా మారాడు. "చే" అంటే పలకరింపుకి గుర్తు. మెక్సికోలోని వారు "ఓంబ్రే" అని పలకరిస్తారు. ఎవరితోనైనా ఎర్నెస్టో మాట్లాడేటప్పుడు 'చే'తో మొదలుపెడతాడు. అందరూ అతనిని "చే" అని పిలవడంతో ఆ పేరు స్థిరమైపోయింది.

క్యూబాలో బతిస్తా చేసే అరాచకాలు పెరుగుతున్నాయి. ఎవరికీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం లేదు. అలా సాహసం చేస్తే, వారిని పంపి, శవాల్ని వీధులో వ్రేలాడదీస్తున్నారు. బతిస్తా పైకి చెప్పేది అభివృద్ధి. కాని అంతర్గతంగా చేసేది అరాచకాలు. అతనికి వ్యతిరేకత ఎక్కువయింది. ఉద్యమాలు మొదలయ్యాయి. ఫిదెల్ బృందం కూడా అతనిపై పోరాటానికి సిద్ధంగా ఉంది.

బతిస్తా గూఢచారి గెరిల్లా కార్యకర్తగా చేరి రహస్యాల్ని ప్రభుత్వానికి తెలియజేశాడు. వారి స్థావరం మీద దాడులు జరిగాయి. ఫిదెల్‌ని అరెస్టు చేశారు. కొంతమంది కార్యకర్తల్నీ, 'చే'నూ పట్టుకున్నారు. వారిని జైలులో పెట్టారు. ఉద్యమకారుల అసమర్థతే దీనికి కారణం అని సానుభూతిపరులన్నారు. ఉద్యమకారుల విడుదల కోసం నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. తనకి యింత వ్యతిరేకత ఉందని బతిస్తా ఊహించలేదు. "చే", కలిక్స్‌టో గార్సియాలను తప్ప మిగతా వాళ్లని ప్రభుత్వం వదలిపెట్టింది. వాళ్లిద్దరూ చట్టవిరుద్ధంగా మెక్సికోలో ప్రవేశించారన్న కారణం చేత వాళ్లని వదలిపెట్టలేదు.

ఫిదెల్ మళ్లీ తన కార్యక్రమంలో మునిగిపోయాడు. కార్యకర్తల్ని చిన్న గ్రూపులుగా విడగొట్టి సాయుధశిక్షణ యిస్తున్నాడు. ఫిదెల్ క్యూబాకు బయలుదేరాలనుకున్నాడు. వెళ్లడానికి ఒక నావ కావాలి. ఎరిక్‌సన్ అనే అమెరికన్ వద్ద ఒక చిన్న నావ ఉంది. దానికి అతడు తన నాయనమ్మ జ్ఞాపకార్థం "గ్రాన్‌మా" అని పేరు పెట్టుకున్నాడు. ఫిదెల్ దానిని పన్నెండు వేల డాలర్లకు కొని, అన్ని వసతులు దానిలో ఏర్పాటు చేశాడు. ఫిదెల్ కాస్ట్రోల ప్రయత్నాల ఫలితంగా 'చే', గార్సియాలను విడుదల చేశారు.

జైలు నుండి బయటికి వచ్చిన తరువాత 'చే' మూడు రోజులు యింట్లోనే ఉండి కూతురితో ఆడుకున్నాడు. తరువాత అన్నీ సర్దుకుని బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. కాని చేతిలో డబ్బు లేదు. ఆ సమయంలో విప్లవకారుడు ఫ్రాంక్‌పైజ్ అతనికి కొంత డబ్బు యిచ్చాడు. "ఇన్‌హేలర్ మరచిపోకుండా తీసుకుని వెళ్లు" అని హిల్డా హెచ్చరించింది. చివరికి ఇన్‌హేలర్ మరచిపోయే వెళ్లాడు.

# 5. గ్రాన్‌మాలో క్యూబాకు

అది 1956 వ సంవత్సరం, నవంబరు 25వ తేదీ, వర్షం కుంభవృష్టిగా కురుస్తూంది. ఇంకాపూర్తిగా తెల్లవారలేదు. గెరిల్లా ఉద్యమకారులందరూ టక్స్‌పన్ రేవుకి చేరుకున్నారు. గ్రాన్‌మా నావ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఫిదెల్ అక్కడికి వచ్చిన ఉద్యమకారుల నుండి సమర్థులనుకున్నవారిని ఎంపిక చేశాడు. నావలో ఇరవైమంది కూర్చోడానికే చోటు ఉంది. కాని 82 మంది సర్దుకుని కూర్చున్నారు. వారితోపాటు వారి తుపాకులు, బట్టలు, ఆహారపదార్థాలు మొదలైన వాటిని కూడా నావలో సర్దిపెట్టారు. చీకట్లోనే నావ బయలుదేరింది.

ఒకరి తరువాత ఒకరుగా "సీ సిక్‌నెస్"తో వాంతులు చేసుకుంటున్నారు. "చే"కు ఆస్తమా మొదలయింది. తెల్లవారేలోగా మెక్సికో సరిహద్దుల్ని దాటాలని వారి ప్రయత్నం. "చే"వద్ద ఇన్‌హేలర్ కూడా లేదు. అయినప్పటికీ మిగిలినవారికి సేవ చేయడం ప్రారంభించాడు. తుపాకులు సరిగా పనిచేస్తున్నాయో లేదో సరిచేస్తున్నాడు ఫిదెల్.






తెచ్చుకున్న ఆహారపదార్థాలు చాలావరకు అయిపోయాయి. నావలో చోటు లేకపోవడం వల్ల కొంత ఆహారాన్ని వదలిపెట్టేశారు. ఇంతలో నావ ఇంజన్లలో ఒకటి సరిగా పని చేయడం లేదు. కాబట్టి వేగాన్ని తగ్గించమని ఇంజనీరు చెప్పాడు. బాయిలర్ కూడా సరిగా పనిచేయడం లేదు. నావదాని యిష్టం వచ్చినట్లు వెళ్తూంది. సన్ ఆంతోనియో తీరం వైపు వెళ్తున్నామనుకున్నారు. కాని క్యూబాలో వీరికోసం సాయుధ బలగాలు, టాంకులు సిద్ధంగా ఉన్నాయి. రెండు రోజుల తరువాత వర్షం తగ్గింది. వాతావరణం కూడా కొంత వరకు బాగానే ఉంది. మరునాడు ఉదయం కొంత దూరంలో కొన్ని పడవలు కనపడ్డాయి. ఫిదెల్ తుపాకులతో సిద్ధంగా ఉండమని చెప్పాడు. అంతకు ముందు నుంచే ప్రభుత్వం తీరమంతటా వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. వైమానిక దళాలూ గాలిస్తున్నాయి. సంతియాగో తీరంలో సైన్యం ఉంది. సంతియాగోలోను, క్యూబాలోని కొన్ని నగరాల్లోను కూడా తిరుగుబాట్లు జరిగినట్లుగా తెలిసింది. వారికి సహాయంగా వెళ్లలేకపోయామని నావలోని వారంతా బాధపడ్డారు. కొంత సేపటికి ఆందోళనలు తగ్గాయనీ, ఆందోళన కారుల్ని అరెస్టు చేశారనీ వార్తలు తెలిశాయి.

ఫిదెల్ లాస్ కొలరాదో తీరంలో ఆగడం మంచిదనుకున్నాడు. అక్కడ నుండి ట్రక్కుల్లో బయలుదేరి దగ్గర్లో ఉన్న పట్టణాల్ని ముట్టడించి చివరకి సియెర్రా మాస్త్రాకు చేరుకోవాలని నిర్ణయించుకున్నాడు. మెక్సికోలో ఉన్న యిన్‌ఫార్మర్ల ద్వారా బతిస్తా ప్రభుత్వానికి వీరి కదలికలు ముందే తెలిసిపోయాయి. క్యూబాలోని అన్ని రేవులలోను సాయుధ దళాల్ని పెట్టింది. వీరికి నావలో ఆహారం అయిపోయింది. ఇంధనం కూడా అయిపోవచ్చింది. విపరీతమైన గాలులతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. లియో నార్దొలోకే డెక్‌మీద నుండి టెలిస్కోపులో తీరం యెక్కడుందో చూస్తూ ఉండగా సముద్రంలో పడిపోయాడు.

ఫిదెల్‌గొంతు వినిపించే సరికి అటుగా యీదుకుంటూ నావ వద్దకు వచ్చాడు. అతనిని నావ మీదకు లాగారు. డాక్టర్ చే, డాక్టర్‌ఫాస్టి నో పెరెజ్‌లు అతనికి కృత్రిమ శ్వాస కల్పించి, సేవచేశారు.

మూడు రోజుల్లో తీరానికి చేరుకుంటాననుకున్నవారు వారం రోజులకి చేరుకున్నారు. కాని ఎక్కువ బురదగా ఉండడం వల్ల 2000 గజాల దూరంలో నావ ఆగిపోయింది. అది బెలిక్‌తీరంగా గుర్తించారు. అక్కడనుండి మైలున్నర నడిస్తేనే కాని లాస్ కొలరాదో చేరలేరు. వారు నావ దిగి, బురదలో అతి కష్టం మీద తరువాత కొబ్బరి చెట్లతో ఉన్న పొడినేల కనిపించింది. 'చే'కు ఆస్తమా మళ్లీ వచ్చింది. కాని కొంత దూరంలో ఒక యుద్ధనౌక కనపడింది. ఫిదెల్ బృందాన్ని చూసి, ఆ నౌకలోని వారు కాల్పులు మొదలు పెట్టారు. విమానాలు బాంబు దాడి చేస్తున్నాయి. వాటిని తప్పించుకుంటూ ముందుకి సాగారు. వీరు కొండ ప్రాంతంలో నడుస్తూ ఉండగా లూయీ క్రెస్పో తప్పి పోయాడు. ఈ గెరిల్లాలు రెండు దళాలుగా మారింది. ఒకటి ఫిదెల్ నాయకత్వంలో ఉంది. రెండవది హువాన్ మాన్యుయెల్ మార్క్వెజ్ నాయకత్వంలో ఉంది.

అందరికీ బాగా ఆకలివేస్తుంది, నడవగా, నడవగా అలెగ్రియాదిపియో ప్రాంతానికి చేరారు. అక్కడ ఒక చెరుకు తోట కనపడింది. చెరుకుగడలతో కడుపు నింపుకుని, మూడు గంటలు అక్కడ విశ్రాంతి తీసుకున్నారు. చెరుకు పిప్పిని అక్కడే వదిలి వేయడంతో అది శత్రువులకు ఒక ఆధారం దొరికినట్లేకదా? అది పోలీసులకు ఉపయోగపడింది. సాయుధసైనికులు(వీరి కోసం గాలించడంమొదలు పెట్టారు. నడిచి, నడిచి, గెరిల్లాలపాదాలు పుళ్లుపడ్డాయి. ఇక నడవలేని స్థితిలో) ఒక చెరుకుతోటలో విశ్రాంతి తీసుకున్నారు. "చే" వారికి వైద్యం చేస్తున్నాడు. అకస్మాత్తుగా వారిపై బుల్లెట్ల వర్షం కురిసింది. విమానాలు పైన తిరుగుతూ కనిపించాయి. తుపాకులున్న పెట్టెను పట్టుకుని 'చే' పరుగెత్తాడు. అతనికి దగ్గర్లో ఉన్న ఆల్బెంతోజా బుల్లెట్ తగిలి పడిపోయాడు. అయినా శత్రువులపై బుల్లెట్లు కురిపిస్తున్నాడు. ఎవరెక్కడున్నారో తెలియని పరిస్థితి. గెరిల్లాలను లొంగిపోమ్మని మైకులనుండి కేకలు వినిపిస్తున్నాయి. అయినా వారు లొంగిపోకుండా చీకట్లో ముందుకి సాగుతున్నారు. 'చే' భుజానికి గాయమయింది. శత్రువులకాల్పులు ఆగాయని తెలిశాక, పొదలమాటునుండి బయటికి వచ్చి అలాగే నిద్రపోయారు.

మర్నాడు లేచి చూస్తే వారు ఎక్కడ ఉన్నారో తెలియలేదు. అయినా పగటివేళల్లో కొండ గుహల్లో తలదాచుకుని, రాత్రిళ్లు ప్రయాణం చేయాలని నిశ్చయించుకున్నారు. ఎవరైనా పట్టుబడితే ప్రాణాలకు తెగించి పోరాడాలి కాని శత్రువులకు లొంగ కూడదను

కున్నారు. మరునాడు రాత్రి నడుస్తూ ఉండగా ఒక గుడిసె కనపడింది. లోపల ఉన్నవారు యూనిఫాంలో ఉన్నారు. వాళ్లని చుట్టుముట్టి లొంగిపొమ్మన్నారు. వారు బయటికి వచ్చారు. వారెవరో కాదు, చనిపోయారనుకున్నవారి మిత్రులే. వారి ఆనందానికి అవధులు లేవు.

చెరుకు తోటలో ఉండగా జరిగిన దాడిలో తొమ్మిదిమంది గెరిల్లాలను శత్రువులు పట్టుకున్నారు. ప్రభుత్వ సైనికాధికారి వారిలో ఎనిమిది మందిని చంపేశాడు. చనిపోయిన వారిలో నికోలోపెజ్ కూడా ఉన్నాడు. తరువాత ఒక జాలరి యిల్లు కనపడింది. దానిలో ఉన్న ఆల్‌ఫ్రెదో గొంజాలే కూడా ఉద్యమకారుడే, అతడు వీరికి స్వాగతం పలికాడు. అదే సమయంలో ఉద్యమానికి సానుభూతి పరులైన కొందరు రైతులు భోజనం తీసుకుని వచ్చారు. భోజనం చేసిన వారందరికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఆ రైతులు భోజనంలో విషం కలిపారు. అంటే ఆ రైతులు మోనాగాళ్లన్నమాట.

గెరిల్లాలు రెండు గ్రూపులయ్యారు. ఒక గ్రూపుకి “చే” నాయకుడు. రెండవదానికి ఆల్మైదా. బతిస్తాసేనలు తమను గాలిస్తున్నాయని తెలుసుకుని తమ ఆయుధాల్ని ఒక రైతు యింట్లో ఉంచి బయలుదేరారు. వారు ఒక చెరుకుతోట వద్దకు చేరే సరికి ఫిదెల్ కొంతమందితో వారి కోసం ఎదురు చూస్తున్నాడు. ఆయుధాలు శత్రువులవశమయ్యాయని తెలిసి ఫిదెల్ వారిని కోప్పడ్డాడు. తరువాత చేయవలసిన పనిని గురించి ఆలోచించారు.

82మంది గెరిల్లాలు బయలుదేరితే చివరికి పన్నెండు మంది మిగిలారు. ధైర్యసాహసాలు గల కార్యకర్తలు చనిపోయారు. దీనిని బట్టి యింకా గెరిల్లా యుద్ధంలో వీరికి యింకా నైపుణ్యం రాలేదని అనుకున్నారు. రైతులతోను, ఆదివాసీలతోను మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. కొందరు రైతులు ఉద్యమంలో చేరారు కూడా. ఫిదెల్ ఆశావాది. తప్పక గెలుస్తామని అతనికి నమ్మకం ఉంది. పోరాటానికి ప్రణాళికలు సిద్ధంచేసుకున్నారు.

గెరిల్లాలు సాయుధ శిక్షణతీసుకున్నారు. మొదటగా లాప్లాతాలోని సైనిక శిబిరం మీద దాడి చేయాలనుకున్నాడు ఫిదెల్. మళ్లీ ప్రయాణం సాగించారు. రైతులనుండి సహకారం లభిస్తుంది. గెరిల్లాలసంఖ్య యిరవై ఏడుకి పెరిగింది. వారిలో సగం మంది స్థానికరైతులే.

తిరుగుబాట్లు అణచివేశామనీ, ఫిదెల్‌ని కూడా చంపేశామనీ ప్రభుత్వం ప్రకటించడం మొదలు పెట్టింది. కొత్తగా చేరిన రైతులకి ఫైరింగ్ లో శిక్షణ యిచ్చాడు ఫిదెల్. వారు లాప్లాతాన దిని దాటి వచ్చారు. సైనిక స్థావరం యొక్క పరిసరాల్ని గమనించారు. అంతలో చికో ఒసారియో అనే వ్యక్తి వచ్చాడు. అతడు ఒక యిన్‌ఫార్మర్. యూనివర్సో శాంచెజ్

అతని వద్దకు వెళ్లి తాను గ్రామరక్షక దళం యొక్క సభ్యుడినని పరిచయం చేసుకున్నాడు. ఒసారియో తాగిన మైకంలో ఉన్నాడు. కాబట్టి గెరిల్లాలు అతనినుండి కావలసిన సమాచారాన్ని రాబట్టారు. వాళ్లంతా బతిస్తా సైనికులే అనుకున్నాడు ఒసారియో.

శత్రుస్థావరం మీద గెరిల్లాలు కాల్పులు జరిపి లోపల ఉన్న వారిని లొంగిపొమ్మని హెచ్చరించారు. అంతకుముందే ఒకసారియోని కాల్చి చంపేశారు. 'చే' మరికొందరు శత్రుస్థావరంపై గ్రెనేడ్లు విసిరారు. అవి పేలలేదు. శిబిరాలకు నిప్పు అంటించమని చెప్పాడు ఫిదెల్. యూనివర్సో ఒక శిబిరానికి నిప్పు అంటించాడు. మిగిలిన శిబిరాలు కూడా అంటుకున్నాయి. శత్రుసైనికులు శిబిరాల నుండి పారిపోవాలనుకున్నారు. కొంతమంది గెరిల్లాల తూటాలకి బలి అయ్యారు. కొంతమంది లొంగిపోతున్నామంటూ కేకలు వేశారు. ఫిదెల్ శత్రుస్థావరంలోని ఆయుధాల్ని, ఆహార పదార్థాల్ని స్వాధీనం చేసుకున్నాడు.

కాల్పులు ఆగిన తరువాత "చే" శత్రుసైనికు చికిత్స చేశాడు. ఇది గెరిల్లాల విజయం, వారికి కొత్త ఉత్సాహం కలిగింది. గెరిల్లాల విజయం గురించి ప్రభుత్వానికి తెలిసింది. అంతకు ముందు తిరుగుబాట్లు అణచివేశామని ప్రచారం చేసుకుంది ప్రభుత్వం. వెంటనే సియెర్రా ప్రాంతమంతా గాలించడం ప్రారంభించింది. శత్రువులు తమపై దాడి చేయవచ్చునని ముందే ఊహించాడు ఫిదెల్. దానికి సిద్ధమయ్యాడు. ఆయుధాల్ని సిద్ధం చేసుకున్నారు.

బతిస్తా సైన్యం గెరిల్లాలున్న ప్రాంతంలో గాలింపులు జరిపింది. ఫిదెల్, చే లు ముందుగా కాల్పులు మొదలు పెట్టారు. బతిస్తా సైనికులు పారిపోయారు. శత్రువులనుండి మరికొన్ని ఆయుధాల్ని సేకరించలేకపోయామని ఫిదెల్ బాధపడ్డాడు, తరువాత గెరిల్లాలు కరకాస్ ప్రాంతానికి చేరుకున్నారు. రైతులతో స్నేహ సంబంధాలు ఏర్పడడం వల్ల కొత్త వారు సభ్యులుగా చేరుతున్నారు. కాని ఎవరు ఎలాంటివారో తెలియదుకదా? కొంతమందికి లంచాలిచ్చి, భయపెట్టి తమ వైపు తిప్పుకుంటున్నారు. అలాంటి సంఘటన ఒకటి జరిగింది. ఒక రైతు కుటుంబంలోని యువకుడు గెరిల్లా ఉద్యమంలో చేరాడు. ఒకసారి అతడు యింటికి వస్తూ ఉండగా సైనికులు పట్టుకున్నారు. ఫిదెల్‌ని చంపితే చాలా డబ్బిస్తామని, ఉద్యోగం యిస్తామని ఆశపెట్టారు. అతడు అంగీకరించాడు.

అప్పటి నుండి ఉద్యమం గురించిన సమాచారాన్ని సైన్యానికి అందిస్తున్నాడు. సైనికులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఒకనాడు ఆయువకుడు ఫిదెల్ దగ్గరకు వచ్చి తన దుప్పటి కనిపించడం లేదని చెప్పాడు. ఫిదెల్ తన దుప్పటిలోనే అతనిని పడుకోమన్నాడు. ఆయువకుని వద్ద ఒక పిస్టలూ, రెండు గ్రెనేడ్లు ఉన్నాయి. ఫిదెల్‌ని

చంపగలడు. కాని గెరిల్లాలనుండి తప్పించుకోలేనని భయపడ్డాడు. మరునాడు తన తల్లికి జబ్బుగా ఉంది, యింటికి వెళ్తానన్నాడు. ఫిదెల్ కొంత డబ్బు కూడా యిచ్చి పంపాడు. అతడు నేరుగా బతిస్తా సైనికులవద్దకు వెళ్లి గెరిల్లా స్థావరాన్ని చూపిస్తాననీ, అప్పుడు దాడి చేస్తే ఫిదెల్‌తో పాటు గెరిల్లాలందరూ చనిపోతారనీ చెప్పాడు.

బతిస్తా సైనికులు మెషీన్‌గన్‌లతోను, బాంబులతోను దాడికి దిగారు. ఆ శబ్దానికి గెరిల్లాలకు మెలకువ వచ్చింది. వారు స్థావరాన్ని ఖాళీచేసి, హ్యూమోలోయ ప్రాంతానికి వెళ్లారు. కొత్తగా చేరిన ఆ యువకుని మీద వారికి అనుమానం కలిగింది. ఫిదెల్‌కు కూడా అనుమానం కలగడంతో అతనిని పంపివేశాడు.

అంతకు ముందు ఉద్యమాల్లో పాల్గొన్న కార్యకర్తలు ఫిదెల్‌ని కలిశారు. వారి కృషి ఫలితంగా హవానా, సంతియాగో మొదలైన పట్టణాలలో బతిస్తాకి వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు కూడా సంఘాలుగా ఏర్పడి ఉద్యమాలు చేశారు. కాని చాలా మంది సైనికుల చేతిలో మరణించారు. స్త్రీలు కూడా ఉద్యమాలు చేపట్టారు.

ఒక సమావేశంలో గెరిల్లా ఉద్యమం, పట్టణ ప్రాంతాలలోని ఉద్యమం కలిశాయి. ప్రణాళికలు తయారయ్యాయి. ఈ సమావేశంలో “చే” కు ఎక్కువ ప్రాధాన్యత లేదు. అతడు డాక్టరుగా బాధ్యతలు చేపట్టాలా, సాయుధ సైనికునిగా పని చేయాలా అనేది తేలలేదు. గెరిల్లాల ఉనికి తెలియకుండా ఉండేటందుకు ప్రసార సాధనాలకి సమాచారం యివ్వకుండా ఆపింది. ఫిదెల్ గెరిల్లా ఉద్యమం గురించి ప్రజలకు తెలియజెయ్యాలనే ఉద్దేశంతో ఒక సీనియర్ జర్నలిస్ట్ మాథ్యూస్‌ని పిలిపించాడు. అతడు ఫిదెల్‌ని యింటర్‌వ్యూ చేశాడు. ఆ యింటర్‌వ్యూ సందర్భంలో తమ గెరిల్లాల కవాతు ప్రదర్శింపజేశాడు. దానిని మాథ్యూస్ ఫోటో తీశాడు. ఉన్నవారందరూ “హైకమాండ్” సభ్యులని చెప్పాడు. ఆ మాటలలో యింకా చాలామంది సాధారణ సభ్యులున్నట్లు స్ఫురించింది.

మాథ్యూస్ న్యూయార్క్ టైమ్స్ సంచికలో ఫిదెల్ చనిపోలేదనీ, క్రమశిక్షణతో ఉన్న గెరిల్లా ఉద్యమానికి నాయకుడై సియెర్రా ప్రాంతాలలో ఉన్నాడనీ, ఫోటోలతో సహా ఒక వ్యాసం రాసి, బతిస్తా ప్రభుత్వానికి వణుకు పుట్టించాడు. ప్రసార సాధనాలన్నీ తమ అదుపులో ఉన్నాయని నమ్మిన ప్రభుత్వం వాటిపై ఆంక్ష తొలగించింది. మాథ్యూస్ రాసిన వ్యాసం అన్ని మాధ్యమాలలో వచ్చేసింది. అయినా ప్రభుత్వం అది కట్టుకథ అని కొట్టిపారేసింది.

ఇంటర్‌వ్యూ ద్వారా తమ ఉనికి తెలియడంతో గెరిల్లాలు తమ స్థావరాల్ని మార్చాల్సిన అవసరం వచ్చింది. వారు అలా తిరుగుతూండగా ఫిదెల్‌ని చంపడానికి అంగీకరించిన యువకుడు కనపడ్డాడు. ఇంకా అతడు సమాచారాన్ని చేరవేస్తూనే ఉన్నాడు. వారు అతనిని

పట్టుకుని స్థావరానికి తీసుకుని వచ్చారు. అతడు తన నేరాన్ని అంగీకరించాడు. ఫిదెల్ ఆదేశంతో 'చే', యూనివర్సోలు అతనిని కాల్చివేశారు. అయినా ప్రభుత్వానికి అతడు యిచ్చిన సమాచారం వల్ల సైనికులు రైతుల్ని చిత్ర హింసలు పెట్టడం ప్రారంభించారు.

గెరిల్లాలు స్థావరాన్ని ఖాళీచేసి కొండకనుమల గుండా ప్రయాణం సాగిస్తున్నారు. 'చే'కి ఆస్తమా మొదలయింది. నడవలేక అందరూ ఒక గుడిసెలో విశ్రాంతి తీసుకుంటు న్నారు.అదే సమయంలో గుడిసెమీద బుల్లెట్ల వర్షం కురిసింది.వారంతా బయటికి వచ్చి పరుగెత్తసాగారు. 'చే' పరుగెత్త లేకపోతే క్రెస్పో అతనిని మోసుకుని పరుగెత్తాడు. చివరికి వారు ఒక రైతు గుడిసెకు చేరుకున్నారు. 'చే'కు తోడుగా ఒక సభ్యుని గుడిసెలో ఉంచి, మిగిలిన వాళ్లు బయలుదేరారు. బయలు దేరేముందు 'చే' తనను ఎక్కడ కలవాలో చెప్పాడు.

ఒక సానుభూతిపరుడు 'చే' కి యింజక్షన్ తెచ్చి యిచ్చాడు. ఆ యింజక్షన్‌తో అతడు కోలుకున్నాడు. తనకి తోడుగా ఉన్న వ్యక్తిని పంపివేసి, తుపాకి చేతపట్టుకుని ఒంటరిగా ఫిదెల్‌ని కలవడానికి బయలుదేరాడు. ఒక్కరోజులో చేరవలసిన దూరాన్ని పదిరోజులకు చేరాడు. కొత్త కార్యకర్తలు వచ్చి చేరారు. వాళ్లని ఫిదెల్ వద్దకు చేర్చే బాధ్యత 'చే' ది. కాని ఆ కార్యకర్తలకు నాయకుడైన సోతస్‌కి 'చే' మీద అయిష్టత కలిగింది. "చే" విదేశీయుడు కావడమే కారణం. ఫిదెల్‌వద్దకు తాము నేరుగా వెళ్లగలమనీ, ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని సోతస్ అన్నాడు. 'చే' బాధపడ్డాడు. వచ్చిన కార్యకర్తలకు గెరిల్లా కొత్తది. సోతస్ క్రమశిక్షణ లేని వ్యక్తి. దురుసుగా ప్రవర్తించినా ఉద్యమ ప్రయోజనాలే ముఖ్యమని తలచి ఓర్పు వహించాడు 'చే'.

కొత్త వాళ్లతో కలిపి మొత్తం ఎనభై మంది కార్యకర్తలయ్యారు. కార్యకర్తలందర్నీ మూడు దళాలుగా విభజించాడు ఫిదెల్. 'చే' సైన్యానికి అధికారిక డాక్టరు, పైగా ఫిదెల్ ఆంతరంగిక సలహాదారుడు కూడా. కొత్తగా వచ్చిన గెరిల్లాలకు నెలరోజులు శిక్షణ యిచ్చారు. సియెర్రాలోని గెరిల్లాలనందరినీ చంపేశామని బతిస్తా ప్రభుత్వం తన పాత పాటని మొదలుపెట్టింది. అది అబద్ధం అని ఋజువు చేయడానికి ఒక అమెరికన్ జర్నలిస్టుని తీసుకునివచ్చారు. గెరిల్లాలతో యింటర్వ్యూ టెలివిజన్ లో ప్రసారమయింది. సియెర్రా ప్రాంతంలోని ప్రజల్ని తమ సానుభూతి పరులుగా చేయడంలో 'చే' పాత్ర గొప్పది.

గెరిల్లాల సంఖ్య 127 కు పెరిగింది. వారికి ఆయుధాలు కూడా సరఫరా అయ్యాయి. మిలిటరీ స్థావరాల మీద దాడి చేస్తే ప్రభుత్వం యొక్క స్థైర్యం దెబ్బతింటుందని ఫిదెల్ ఆలోచన, దానికి చేగెవారా వంతపలికాడు. దానిని అమలు చేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

# 6.సియెర్రా పర్వతాలలో

ఎల్‌ఉవేరోవోని సైనిక శిబిరం మీద దాడి చేయడానికి చే ఫిదెల్‌లు ప్రణాళిక తయారు చేశారు. ప్రభుత్వ సైనిక శిబిరాలు గెరిల్లా స్థావరం నుండి పదిమైళ్ల దూరంలో ఉంది. గెరిల్లాలను సైనిక శిబిరం వైపు నడిపించాడు. ఫిదెల్. అతడు ఒక కొండ మీద నిలబడి ఆదేశాలు యిస్తున్నాడు. నాలుగు వైపులనుండి సైనిక శిబిరాల్ని చుట్టు ముట్టేటట్లు ప్రణాళిక వేశాడు. 'చే' మెషీన్ గన్‌తో కామిలో దళంలో నడుస్తున్నాడు. ఫిదెల్ మొదటగా కాల్పులు జరిపాడు. శత్రువులు కూడా కాల్పులు మొదలుపెట్టారు. శత్రుసైన్యం ఎక్కువగా ఉండడంతో గెరిల్లాలు చనిపోతున్నారు. గెరిల్లాల వద్ద బుల్లెట్లు కూడా అయిపోవచ్చాయి.

అయినా గెరిల్లాలందరూ కలిసికట్టుగా సైనికుల ఆయుధాగారంలోకి చొచ్చుకుని వెళ్లారు. ఇరువురి మధ్యా పోరాటం జరిగింది. చివరికి గెరిల్లాలు విజయం సాధించారు. ఆయుధాగారం వశమయింది. శత్రుసైనికులు చాలామంది గాయపడ్డారు. సైనికుల డాక్టరున్నా అతడు భయంతో ఏమీ చేయలేకపోయాడు. 'చే' శత్రువులకి కూడా వైద్యం చేశాడు. ఏడుగురు గెరిల్లాలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 'చే'కి అప్పగించి, శత్రు ఆయుధాలను స్వాధీనం చేసుకుని గెరిల్లాలు ముందుకు సాగారు.

అదే సమయంలో మైదాన ప్రాంత విభాగం నావికాదళ శిబిరం మీద దాడి చేసింది. కాని వారిలో కొంతమంది కార్యకర్తలు బతిస్తా సైన్యానికి దొరికిపోయారు. సైన్యం వాళ్లని చంపేసింది. అయితే హవానాలోని నావికా దళ శిబిరం మీద జరిగిన దాడి విజయవంత మయింది. గాయపడిన గెరిల్లాలతో పాటు 'చే', అతని సహచరులు ఉండడాన్ని శత్రువులు చూశారు. వారిపై బాంబు దాడిచేశారు. గాయపడిన వారిని దాడి నుండి తప్పిస్తూ 'చే' ముందుకి సాగాడు. గెరిల్లాలకు సానుభూతిపరుడైన పార్డో యింట్లో నెల రోజులున్నారు. 'చే' ఆరోగ్య పరిస్థితి దిగజారింది. అక్కడ ఉన్న రైతులు చూపించిన ఒక మందు మొక్క ఆకులతో చుట్టలు తయారుచేసుకుని కాల్చాడు. ఉబ్బసం కొంత నెమ్మదించింది. అక్కడ మరి కొంతమంది యువకులు గెరిల్లాదళంలో చేరారు. అందరూ ఫిదెల్ దగ్గరకు వెళ్లారు.

క్యూబాలోని ప్రతి పక్షనాయకులు ఫిదెల్‌ని కలిశారు. అందరూ కలిసి పోరాటానికి ఒక ప్రణాళికను తయారు చేశారు. ఈ ఐక్యవేదిక పేరు "రివల్యూషనరీ ఫ్రంట్". తమ ప్రణాళికను ప్రజలకు తెలియజేశారు. 'చే'కి ప్రతిపక్షనాయకుల మీద నమ్మకం కుదరలేదు. ఎందుకంటే సాయుధపోరాటాన్ని వారు బలపరచడం లేదు. పైగా కొంత మంది ప్రతిపక్ష నాయకులకి యు.యస్. కంపెనీలలో వాటాలున్నాయి. ఫిదెల్‌కి కూడా ఒక ప్రక్క సందేహంగానే ఉంది.

ఈనాటికి ఒక శక్తివంతమైన, సుశిక్షితమైన గెరిల్లా సైన్యాన్ని తయారు చేసుకోగలిగామని సెలియా సాంచెజ్‌కి ఉత్తరం రాశాడు ఫిదెల్. ఆ విధంగా తయారు చేసిన గెరిల్లా దళానికి ఎవరు నాయకత్వం వహిస్తారు? ఫిదెల్ 'చే' పేరును చెప్పాడు. కాని అంత వరకు వైద్యం మాత్రమే చేస్తూన్న 'చే'కి యిది ఒక సవాలే. పైగా అతడు క్యూబా దేశీయుడు కూడా కాడు. అయినా అతని నాయకత్వ లక్షణాల్ని ఫిదెల్ గుర్తించాడు. అతడు 2వ నెంబరు దళానికి కమాండరుగా నియమించబడ్డాడు. ఈ దళంలో 75 మంది సభ్యులున్నారు వారిని మూడు ప్లాటూన్లుగా విభజించి, వాటికి కెప్టెన్లను నియమించాడు. సభ్యులు పెరుగుతున్నారు కాని తగినన్ని ఆయుధాలులేవు. అయితే శత్రువుల వద్దనుండి స్వాధీనం చేసుకున్నవాటిలో కొన్ని శక్తివంతమైనవి ఉన్నాయి.

ఎల్‌తర్బ్రినో ప్రాంతంలో 'చే' ఉద్యమం చేపట్టాలి. తాను తీసుకునే నిర్ణయాల్ని ఎప్పటికప్పుడు ఫిదెల్‌కి తెలియజేస్తున్నాడు. అర్బన్‌లో ఉద్యమం చేస్తున్న ఫ్రాంక్ పైజ్‌ని పోలీసులు చంపేశారు. ప్రభుత్వం కొత్త ప్రచారాన్ని మొదలు పెట్టింది. ఎర్నెస్టో గెవారా అనే వ్యక్తి అర్జెంటినా నుండి సియెర్రాకి వచ్చి బందిపోట్ల ముఠాని నడుపుతున్నాడనే వదంతిని ప్రచారం చేసింది. బందిపోట్లంటే సియెర్రా ప్రజలకి భయం. 19వ శతాబ్దంలో చైనా నుండి చాలామంది కూలి పనులకోసం క్యూబా వచ్చారు. అక్కడ కూడా సరియైన, జీవనోపాధి దొరకలేదు. వారిలో కొంతమంది బందిపోటు దొంగలుగా మారారు. బతిస్తా ప్రభుత్వం వారిని చేరదీసి ప్రజల మీద దాడులు చేయించింది. ఆ బందిపోట్లు తాము గెరిల్లాలమని చెప్పుకుంటున్నారు. ప్రజలకి గెరిల్లాలు ఎవరో, బందిపోట్లు ఎవరో అర్థం కాలేదు. 'చే' దళం ఆ బందిపోట్లను పట్టుకుని శిక్షలు వేసింది. వారిలో కొంతమంది గెరిల్లా దళంలో చేరారు.

ఫిదెల్ నాయకత్వంలోని దళం బతిస్తా ప్రభుత్వానికి కునుకు లేకుండా చేస్తూంది. సియెర్రాలోని సాయుధపోరాటాన్ని, సంతియాగో గోలోని సామాజిక ఉద్యమాల్నీ, హవానాలోని రాడికల్ యువజనోద్యమాన్నీ సమన్వయంతో నడిపించిన రాజనీతిజ్ఞుడు ఫిదెల్. ఒక ప్రక్క 'చే' పోరాటాలలో కీలక పాత్రపోషిస్తుండడంలో అతని పేరు ప్రసార సాధనాలలో మారుమోగుతుంది. అతడు అంతర్జాతీయ మూలాలున్న కమ్యూనిస్టనీ, అమాయికుల్ని హత్య చేస్తున్నాడనీ ప్రభుత్వం ప్రచారం చేసింది. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకత ఏర్పడింది. అంతగా ప్రచారం చేస్తూన్న వ్యక్తి మీద ఆసక్తి ప్రజలకి ఏర్పడింది. విద్యార్థులు అతి కష్టంతో సియెర్రా వెళ్లి 'చే' ని కలుస్తున్నారు. తాము కూడా దళంలో చేరుతామన్నారు. వయస్సు చిన్నదవడంతో 'చే' అంగీకరించలేదు. చివరికి వారు పట్టు పట్టడంతో అంగీకరించక తప్పలేదు.

ఒనీరియా గ్యుతిరెజ్ అనే పదిహేడేళ్ల అమ్మాయి గెరిల్లా దళంలో చేరింది. ఆమెను కూతురిలా చూసుకునేవాడు 'చే'. 'చే' దళంలోని వారి బాగోగులుచూసేవాడు. వారికి సరియైన శిక్షణ యిచ్చేవాడు. వారిదగ్గర కూడా నేర్చుకునేవాడు.

ఎల్‌హాంబ్రితో ప్రాంతంలో 'చే' దళానికీ, బతిస్తా సైన్యానికి ఎదురు కాల్పులు జరిగాయి. శత్రువులకి ఆయుధాలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల తన దళాన్ని వెనక్కి తగ్గమన్నాడు. దళంలోని అందరూ సురక్షితంగా ఉండాలనేదే 'చే' ఆకాంక్ష. దళంలో సభ్యులు పెరిగినా సరిపడా ఆయుధాలు లేవు. శత్రువుల ఆయుధాగారాల మీద దాడిచేసి ఆయుధాల్ని సేకరించాడు. బతిస్తా ప్రభుత్వం ప్రజల మీద కక్ష తీర్చుకోవడంతో చాలా మంది ప్రజలు పోరాటాల్లోకి వస్తున్నారు. అంతే కాదు, తమ నావికా దళం కూడా తిరుగుబాటు చేసింది. కాని సైన్యం పెద్ద యెత్తున దాడిచేసి, తిరుగుబాటు అణిచివేసింది. అంతేకాక గెరిల్లాలను పట్టి యిచ్చినా, వారున్న ప్రదేశాన్ని తెలియజేసినా, తలకు 5000 పెసోలు యిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటనల వల్ల ప్రజలకి గెరిల్లాల మీద సానుభూతి యింకా ఎక్కువయింది. గెరిల్లాలు కూడా తమ స్థావరాల్ని పెంచాయి.

పట్టణ ప్రాంతాలలో ఉద్యమకారులకు సరియైన శిక్షణ లేకపోవడంతో చాలామంది అమాయకులు బలిఅవుతున్నారు. రివల్యూషనరీ ఫ్రంట్‌లోని ప్రతిపక్షనాయకుల మీద 'చే'కి నమ్మకం లేదు. వారు గెరిల్లాలతో ఒక ప్రక్క చర్చలు జరుపుతూనే సి.ఐ.ఏ తో కూడా సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ విషయం తెలియగానే ఫిదెల్ ఆఫ్రంట్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నాడు.

ఎల్‌హాంబ్రితో ప్రాంతంలో బలమైన గెరిల్లా స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి 'చే' ప్రయత్నిస్తున్నాడు. అక్కడ ఉన్న ప్రజలకు వైద్యం చేయడం, వ్యవసాయపనులలో సహాయం చేయడం, ఒక స్కూలుని స్థాపించడం మొదలైన పనులు చేయడంతో వారితో 'చే' కి మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. జియోనెల్ రోడ్రిగ్, రికార్డోమెదినా అనే విద్యార్థులు యీ దళంలో చేరారు. వారు ఒక స్టెన్సిల్ యంత్రాన్ని తీసుకుని దానితో "ఎల్‌క్యూబనోలిబ్రే" అని పత్రికని ప్రారంభించారు.

---

సాంబెజ్ మాస్క్వెరా అనే సైనికాధికారి సియెర్రా ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాడు. రైతుల్ని హింసించడం, స్త్రీలపై అత్యాచారాలు మొదలైనవి చేయిస్తున్నాడు.

మళ్లీ ఎల్‌హాంబ్రితో గెరిల్లాలకు, బతిస్తా సేనకు ఎదురుకాల్పులు జరిగాయి. కొన్ని గంటలసేపు పోరాటం జరిగింది. బతిస్తా సైన్యం పారిపోయింది. ముగ్గురు సైనికులు దొరికి పోయారు. వారిద్వారా సాంచెజ్ గాలిస్తున్నాడని తెలుసుకుని గెరిల్లాలు యింకొక దిశకు మరలివెళ్లారు. బతిస్తా సైన్యం, గెరిల్లా దళాలు ఒకరినొకరు తప్పించుకుని తిరుగుతున్నాయి. ఒకరి బలాన్ని యింకొకరు అంచనా వేయలేకపోవడమే కారణం.

'చే' దళం 'లామెసా' అనే ప్రాంతానికి చేరింది. చుట్టూ కొండలు ఉండడంతో అక్కడే బలమైన స్థావరాన్నీ, దానికి కావలసిన వస్తువుల్ని తయారు చేసే కేంద్రాన్నీ ఏర్పాటు చేశారు. లామెసాలో ఉన్న ప్రజలకీ 'చే' దళం సహాయం చేస్తూంది. అక్కడ ఒక స్కూలు కూడా ఏర్పాటు చేసింది. పంటలు పండించే ఏర్పాటు కూడా చేసింది. మళ్లీ "లిబ్రే" పత్రికను మొదలుపెట్టారు. అతడు మార్క్స్ రచనలు చదవడం వల్ల కమ్యూనిస్టుల ద్వారానే పీడితులకు పరిష్కారం దొరుకుతుందని విశ్వాసం ఏర్పడింది.

పట్టణ ప్రాంతంలోని నాయకుడైన రామోస్ లాతూర్‌కి, 'చే' కి సిద్ధాంత పరంగా వివాదాలు జరిగాయి. పట్టణ ప్రాంత నాయకుల్లో ఒకరైన ఆర్మందో హార్త్ తమకూ 'చే' కూ మధ్య గల అభిప్రాయ భేదాల్ని గురించి చర్చించడానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో బతిస్తా సైనికులకి దొరికిపోయాడు. అతని దగ్గర ఉన్న ఉత్తరాల్ని బట్టి పట్టణ ప్రాంత ఉద్యమకారులకీ, పర్వత ప్రాంత ఉద్యమకారులకీ మధ్య సమన్వయం లేదని బతిస్తా ప్రభుత్వం ప్రచారం సాగించింది.

సియెర్రాలో రేడియోస్టేషన్ ఏర్పాటుకి ప్రయత్నం చేస్తున్నాడు. 'చే' ఎడ్వర్డో అనే మెకానిక్ సహాయంతో రేడియో స్టేషన్ ఏర్పాటయింది. అలాగే ఆయుధ తయారీ కేంద్రం కూడా ఏర్పాటయింది. స్పుత్నిక్ బాంబుల్ని తయారు చేసి, పినోడెల్ అగుబాలోని సైనిక శిబిరం మీదదాడిచేసి, ముగ్గుర్ని బందీలుగా పట్టుకుని ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నారు. 1958, ఫిబ్రవరి 24 న సియెర్రాలోని "రేడియో రెబల్" కేంద్రం నుండి ప్రసారాలు మొదలయ్యాయి. ముందుగా ఉద్యమగీతాన్ని ప్రసారం చేశారు. తరువాత ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుండి 9 వరకూ 20 మీటర్ల మీద క్యూబాలో అందరూ వినవచ్చు అనే ప్రకటన వెలువడింది. అయితే మాటలు దగ్గరగా ఉన్న వాళ్లకి వినబడలేదు. దూరప్రాంతాల వారు విన్నారు.

1958 మార్చి 12 న ఫిదెల్ పేరిట ఒక ప్రకటన వచ్చింది. దానిలో బతిస్తా నియంతృత్వానికి వ్యతిరేకంగా సహాయనిరాకరణ ప్రకటించమని ప్రజలకి ఫిదెల్ పిలుపుయిచ్చాడు. ప్రభుత్వానికి పన్నులు కట్టవద్దనీ, సైన్యంలో చేరవద్దనీ, జరగబోయే సమ్మెను విజయవంతం చేయమనీ కోరాడు. అయితే సమ్మె ప్రణాళికా బద్ధంగా జరగలేదు. ప్రజల్ని సమ్మెకు సిద్ధం చేయలేకపోయారు.

ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి దానిలో లోపాలు, పరిష్కారాలు చర్చించారు. సియెర్రాలోని గెరిల్లా నిర్మాణాన్ని కేంద్రంగా చేసి, మిగతా బలాలు దానికి అనుగుణంగా పని చెయ్యాలనీ, మైదాన ప్రాంత నిర్మాణాలు నగరాలను మాత్రమే చూసుకోవాలని తీర్మానించారు. ఫిదెల్ మొత్తం ఉద్యమాన్ని పర్యవేక్షించాలి. సియెర్రా ప్రాంతంలోని ఉద్యమాలకు రక్షణ శాఖ 'చే'కి అప్పగించబడింది. ఈ రెండు ప్రాంతాల వారి మధ్య ఉన్న అపోహలు తొలగిపోయాయి.

బతిస్తా వైమానికదళాలు గెరిల్లాలమీద భయంకరంగా దాడికి దిగింది. గెరిల్లాలు కూడా సిద్ధంగానే ఉన్నారు. మే 19 న సియెర్రా ప్రాంతంలోని లాస్‌మెర్సిదస్ ప్రాంతాన్ని బతిస్తా సైన్యం ఆక్రమించింది. గెరిల్లాలు బతిస్తా సైనిక శిబిరానికి అన్ని ప్రక్కలా చుట్టుముట్టి కాల్పులు ప్రారంభించారు. అయినా బాంబు దాడులు చేస్తూ ముందుకు సాగుతున్నాయి. శత్రువలయాన్ని ఛేదించమని మైదాన ప్రాంత గెరిల్లా సాయుధ దళాలను ఆదేశించాడు ఫిదెల్. దానికి ఒక ప్రణాళికని సిద్ధం చేశాడు. బతిస్తా సేనలు సియెర్రా ప్రాంతాల లోతట్టు ప్రాంతాలలో ముందుకు సాగుతూఉండగా, గెరిల్లాలు దాడి చేశారు. బతిస్తా సైన్యం వైమానిక దళాలకు సంకేతాలు పంపింది. కాని గెరిల్లాలు దారిమళ్లడంతో ఆ వైమానిక దళాలు తమ సైన్యం మీదనే బాంబుదాడి చేసింది. బతిస్తా సేనలు లొంగిపోయాయి. ఆయుధాలు యిచ్చేస్తే విడిచిపెడతామని ఫిదెల్ అన్నాడు. వారు ఆయుధాల్ని యిచ్చి వేశారు. సైనికుల్ని విడిపించుకున్నారు.

రెండున్నర నెలల పాటు జరిగిన యీ పోరాటంలో రెండు వేలకు పైగా బతిస్తా సైనికులు మరణించారు. చాలామంది గాయపడ్డారు. చాలా ఆయుధాలు గెరిల్లాలకి చిక్కాయి.

# 7. జన పోరాటం

క్యూబా వ్యవహారాలలో అమెరికా బతిస్తాకి అన్ని విధాలా సహాయం చేస్తూంది. అంతేకాదు, అదనుచూసి బతిస్తాని పదవి నుండి తొలగించి ఆ స్థానంలో తమకు అనుకూలుడిని పెట్టాలను కుంటూంది. 1958 లో క్యూబా అధ్యక్షస్థానానికి ఎన్నికలు జరగబోతున్నాయి. యు.యస్. ప్రభుత్వం దీనిని అవకాశంగా తీసుకోదలచుకుంది. జనానికి కూడా బతిస్తా ప్రభుత్వం మీద విరక్తి కలిగింది.

ఈ లోపున కాస్ట్రో నాయకత్వంలో గెరిల్లాలు ఓరియెంతేకు దగ్గర ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించారు. అక్కడ స్కూళ్లూ, ఆస్పత్రులూ నెలకొల్పారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు చేపట్టారు. రేడియో స్టేషనూ, వార్తా పత్రిక కూడా ఏర్పాటయ్యాయి. చాలా మంది సైనికులు గెరిల్లా దళాలలో చేరుతున్నారు. ప్రజల్లో అన్ని వర్గాల వారు గెరిల్లాలకు మద్దతిస్తున్నారు. ఆదివాసీలందరూ మద్దతిస్తున్నారు. ఓరియెంతే లోని సైనికాధికారి కాంతిల్లో ఫిదెల్ దగ్గరకి రాయబారిని పంపాడు. తనను అధ్యక్షుని చేస్తే, బతిస్తాని పదవి నుండి తొలగించడానికి సహాయం చేస్తానన్నాడు. ఫిదెల్‌మొదట అంగీకరించలేదు. 'చే' అభిప్రాయాన్ని కోరాడు. 'చే' ఆ ప్రతిపాదనని అంగీకరించలేదు. ఎందుకంటే బతిస్తాకి బదులు యింకొక నియంత అధ్యక్షుడు కావడం అతనికి యిష్టం లేదు. 'చే' అభిప్రాయం ప్రకారం ఫిదెల్ తాము ఆ ప్రతిపాదనకి అంగీకరించబోమని సమాధానం పంపాడు. కొంతమంది కమ్యూనిస్టు నాయకులు సియెర్రా వచ్చి 'చే' ని ఫిదెల్‌ని కలిసి ఉద్యమంలో పనిచేస్తా సియెర్రా వచ్చి 'చే'ని ఫిదెల్‌ని కలిసి ఉద్యమంలో పనిచేస్తామన్నారు. కాని నాయకులలో కొంతమందికి యిష్టం లేదు.

1958 లో బతిస్తా మీద పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి ప్రణాళిక సిద్ధమయింది. ప్రధాన నగరాలైన సంతియాగో, హవానా మొదలైన వాటిని స్వాధీనం చేసుకోడానికి సిద్ధమయ్యారు. ప్రణాళిక ప్రకారం యుద్ధం చేయడానికి 'చే' సిద్ధమయ్యాడు. లాస్ విల్లాస్‌కు గెరిల్లాలను చేరవేయడానికి అన్నీ సిద్ధంగా ఉన్నాయి. సియెర్రా నుండి మాంజనిల్లో అనే ప్రాంతానికి కాలినడకను గెరిల్లాలు చేరారు. బతిస్తా సైన్యానికి ఆ విషయం తెలిసింది. శత్రువులు కాల్పులు జరపడంతో ఆయుధాలు తెచ్చిన విమానాన్ని కాల్చివేయమని 'చే' ఆదేశించాడు. అక్కడ నుండి మూడు దళాలూ కాలినడకను బయలుదేరారు. ఆ రోజు



వాతావరణం బాగోలేదు. వర్షం కురుస్తూంది. తుఫాను సూచన కనిపిస్తూంది. మరునాడు రాత్రికి హైవేకి చేరారు. మూడు ట్రక్కులు దొరికాయి. కొంత మందిని వాటిలో ఎక్కించి, మిగిలిన వారు నడక ప్రారంభించారు. ట్రక్కులు బురదలో కూరుకుపోతే అందరూ నడిచి బయలుదేరారు. నదిదాటి అవతలి ఒడ్డుకి చేరారు. సానుభూతి పరులు వారికి భోజనాలు సమకూర్చారు.

ఆ రాత్రి మళ్లీ ప్రయాణం మొదలయింది. సెప్టెంబరు 7కి కెమాగ్వే ప్రాంతానికి చేరారు. అక్కడ వాళ్లందరితోను మాట్లాడి వ్యవసాయ యూనియన్‌ని ఏర్పాటు చేశాడు. ఆ ఎస్టేటు యజమాని అమెరికన్ అతనిని పిలిచి కూలీల రేట్లు పెంచమని అడిగాడు. గెరిల్లాలను మంచి చేసుకోడానికి ఆ యజమాని విందు యిచ్చాడు. కాని వారు ఆ విందుకు వెళ్లలేదు. కొన్ని లారీలను సంపాదించి, అక్కడ నుండి బయలుదేరారు. శత్రుసైనికుల కాల్పుల నుండి తప్పించుకుంటూ ప్రయాణం సాగించారు. తరువాత కామిలో దళం కలిసింది. గెరిల్లాదళాలలో చాలామంది ప్రజలు కలుస్తున్నారు.

అక్టోబరుకి గెరిల్లా దళాలు ఎస్కాంబ్రే ప్రాంతం వైపు ప్రయాణం చేస్తున్నాయి. దారిపొడవునా బతిస్తా సేనలున్నాయి. అందువల్ల గెరిల్లాలు దారిమార్చి సముద్రతీరం గుండా ప్రయాణం సాగించారు. కాని వారు బాగా అలసిపోయారు. అంతగా అలసిపోయినా 'చే' అందర్నీ హుషారుగా ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నాడు. తాను ఆస్తమాతో బాధపడుతున్నా, గాయాలైన వారికి చికిత్స చేస్తూనే ఉన్నాడు. సియెర్రా నుండి బయలుదేరి

అప్పటికి నలభై ఏడు రోజులయ్యాయి. ఒక్క పదిహేను రోజులు మాత్రమే వారికి భోజనం దొరికింది. అయినా శత్రుదాడులనుండి తప్పించుకుంటూ ఎల్‌ఫెద్రెదో గ్రామానికి చేరుకున్నారు. అక్కడ అలైదా అనే ఉద్యమకారిణి గెరిల్లా దళంలో చేరింది.

అక్టోబరు 16వ తేదీకల్లా గెరిల్లా దళాలు ఎస్కాంబ్రేలో ప్రవేశించాయి. అక్కడ ఒక కాఫీప్లాంటేషన్‌లో బసచేశారు. రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ ఉన్న ఉద్యమకారుల ఐక్యతకి కృషి చేశాడు. ఆ ప్రాంతంలో మూడు ఉద్యమ సంస్థలున్నాయి. వాటిలో ఒకటి కమ్యూనిస్టు సంస్థ. మిగిలిన రెండూ క్యూబా జాతీయవాద సంస్థలు. అయితే యీ సంస్థలలో ఐకమత్యత లేదు. ఆ సంస్థల్ని కలపడానికి 'చే' కృషిచేసి సఫలీకృతుడయ్యాడు.

సియెర్రా ప్రాంతంలోని రైతుల సంక్షేమం కోసం ఫిదెల్ ఒక వ్యవసాయ సంస్కరణల చట్టాన్ని రూపొందించాడు. ఆ చట్టంలో రైతులు సాగుచేస్తూన్న భూముల మీద రైతులకు చట్టబద్ధమైన అధికారం ఉండాలనేది ముఖ్యాంశం. లాస్‌విల్లాస్‌లోని ఎన్రిక్ ఓల్తు స్కీ కూడా 'చే' వద్దకు వచ్చాడు. అతనికి ఫిదెల్ చేసిన వ్యవసాయ సంస్కరణలు యిష్టం లేదు. ఆ విషయం గురించి 'చే'కి ఓల్తుస్కీకి వాదోపవాదాలయ్యాయి. అయినా 'చే' యొక్క నిజాయితీని అతడు మెచ్చుకున్నాడు. చివరికి మూడు ఉద్యమ సంస్థలూ ఒకే ఐక్యవేదికగా ఏర్పడ్డాయి.

1958 నవంబరు 3న బతిస్తా ప్రభుత్వం మునిసిపల్, అధ్యక్ష ఎన్నికలు జరపడానికి ఏర్పాట్లు చేసింది. అక్రమ పద్ధతుల్లో తమ పక్షానికి అందర్నీ తిప్పుకుని గెలవాలని ప్రభుత్వం యొక్క ఉద్దేశం. అప్పటికే గెరిల్లాలు ప్రభుత్వకార్యాలయాలమీద దాడికి దిగింది. రహదారుల్ని దిగ్బంధం చేశాయి. దానితో 30 శాతం ఓటర్లు కూడా ఎన్నికలలో పాల్గొనలేదు. కాని బతిస్తా ప్రభుత్వం తమ అభ్యర్థులే గెలిచినట్లు ప్రకటించుకుంది.

డిసెంబర్‌లో గెరిల్లాలు ఫామెంతోలోని సైనిక స్థావరాన్ని స్వాధీనం చేసుకోడానికి రెండు రోజులపాటు తీవ్రంగా యుద్ధం చేసింది. గెరిల్లా దళంలో యిద్దరు నాయకులకు బలమైన గాయాలయ్యాయి. అందర్నీ వైద్య శిబిరానికి చేర్చాడు 'చే' చివరికి బతిస్తా సైన్యంపై గెరిల్లాలు విజయాన్ని సాధించారు. శత్రుశిబిరాన్ని స్వాధీనం చేసుకుని వారిని కూడా వైద్య శిబిరాలకు పంపాడు. ప్రజలందరూ గెరిల్లాలను మెచ్చుకున్నారు. వారి ప్రేమాభిమానాలు గెరిల్లాలకు కొత్త ఉత్సాహాన్ని యిచ్చాయి.

ఫామెంతో నుండి బయలుదేరారు. కాని 'చే' కి ఆస్తమా ఎక్కువయింది. నడవలేక ఆయాసపడుతున్నాడు. 'చే'ని గుర్రం మీద ఎక్కించి, మిగిలిన వారు నడుస్తున్నారు. కొత్తగా దళంలో చేరిన సోతో అనే యువకుడు 'చే'ని ఆక్షేపించాడు. వెంటనే 'చే' గుర్రం దిగి నడవడం ప్రారంభించాడు. ఒక కాఫీ ప్లాంటేషన్ దగ్గరకు చేరగానే అక్కడ అందరూ విశ్రాంతి తీసుకున్నారు. 'చే' సోతోని పిలిపించి, తాను గుర్రం ఎక్కినందుకు క్షమాపణ కోరాడు. సోతో తన తొందరపాటుకి సిగ్గుపడ్డాడు.

డిసెంబరు మూడవ వారానికి నాలుగు ప్రాంతాలు బతిస్తా అధికారం నుండి విముక్తి పొందాయి. శ్రామిక సంఘాలు కొత్తనాయకుడిని ఎన్నుకుంటాయని ప్రకటించాడు. 'చే' గెరిల్లాలు యింకా ముందుకు సాగుతూ సైనిక స్థావరాల్ని వశం చేసుకుంటున్నారు. ఒక్క బుల్లెట్ కూడా ఉపయోగించ కుండా స్థావరాలు స్వాధీనం అవుతున్నాయి. మొత్తం మీద 'చే' నాయకత్వంలో పదిరోజుల్లో మూడు వేల చదరపు మైళ్ల భూ భాగాన్ని ఆక్రమించారు.

గెరిల్లాలు వెళ్లిన ప్రతీచోటా ప్రజలు 'చే' ని చూడడానికి వచ్చేవారు. ఇదంతా చూసి కామిలో 'చే'తో "మనం గెలిచాక నిన్ను ఏం చేస్తానో తెలుసా? ఒక బోనులో పెట్టి ఊరూరా తిప్పుతా. నిన్ను చూడాలనుకున్నవారంతా ఒక్క పెసోయిచ్చినా చాలు – నేను కోటీశ్వరుడిని అయిపోతా" అంటూ హాస్యమాడాడు.

సాంతాక్లారా పట్టణాన్ని ఆక్రమించడం 'చే' బృందానికి ఒక కీలక విజయం, గెరిల్లా సేనలకు ముందు అసీవిదో నాయకత్వంలోని అడ్వాన్స్ గార్డు దళం నడుస్తోంది. తరువాత రోద్రిగో నాయకత్వంలోని ఆత్మాహుతిదళం మిగిలిన వారంతా 'చే' తో కలిసి నడుస్తున్నారు. అలైదా జీపులో కూర్చుని అన్నీ వివరించి చెబుతూంది. ఆ ప్రదేశాలన్నీ ఆమెకు బాగా తెలుసు. అసీవిదో, పాచో దళాలు అటుగా వెళ్తున్న సైనిక వాహనాలపై దాడులు జరిపాయి. బతిస్తా సేనలు పర్వతం మీదనుండి కాల్పులు జరిపాయి. ఆరుగురు గెరిల్లాలు మరణించారు గెరిల్లాలు పట్టణం లోని రేడియోస్టేషన్ని స్వాధీనం చేసు కున్నారు. రేడియో ద్వారా 'చే' ప్రజలతో మాట్లాడాడు. సైనికులు లోపలికి రాకుండా రహదారుల్ని మూసివేయమని కోరాడు. ప్రజలు 'చే' చెప్పినట్లే చేశారు. ప్రజలు గెరిల్లాలకు బ్రహ్మరథం పట్టారు. ఆత్మాహుతిదళం పోలీస్‌స్టేషన్ని స్వాధీనం చేసుకుంది. కాని నాయకుడైన రాబర్తో రోద్రిగ్ మరణించాడు. సాంతాక్లారా గెరిల్లాల వశమయింది.

1959 జనవరి1వ తేదీన బతిస్తా మియామిలోని రహస్య స్థావరానికి పారిపోయాడు. క్యూబాలో సైనిక తిరుగుబాటు జరిగినట్లుగా ప్రకటించి, కొత్త అధ్యక్షుడిని నియమిస్తే పరిస్థితి చక్కబడుతుందని అమెరికా బతిస్తాకి సలహాయిచ్చింది. బతిస్తా తన వాళ్లని



నియమించి హవానా నుండి పారిపోయాడు. పరిస్థితులు చక్కబడితే తాను మళ్లీ అధికారం లోకి రావచ్చునని అతని అభిప్రాయం. ఈ కట్టుకథని ఫిదెల్ విన్నాడు. తన లక్ష్యం సంపూర్ణ విప్లవం అని ప్రకటించాడు.

సాంతాక్లారాలోని శిబిరాల్ని స్వాధీనం చేసుకుంటూ 'చే', కామిలోలు అర్ధరాత్రికి హవానా చేరుకున్నారు. ఆ వార్త ఫిదెల్‌కు తెలియజేశారు. బతిస్తా పారిపోయాడన్న వార్త వినగానే ప్రజలందరూ సంబరాలు చేసుకున్నారు. గెరిల్లాలు కూడా వారితో కలిశారు. జైళ్లలోని రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. ప్రభుత్వ ఆస్తుల్ని, అమెరికన్ కంపెనీలకు చెందిన ఆస్తుల్ని ప్రజలు ధ్వంసం చేశారు. సంతియాగోనగరం కూడా వశమయింది. ప్రజల మీద హింసలకు, అత్యాచారాలకు పాల్పడిన వారిని శిక్షించారు. క్యూబాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయిందనీ ఫిదెల్ రేడియో ద్వారా ప్రకటించాడు. సైనిక వ్యవహారాల అధికారులుగా గెరిల్లాలే ఉన్నారు.

ప్రభుత్వంలో స్థానం లభించనందుకు డైరెక్టోరియా సభ్యులకు కోపం వచ్చింది. 'చే'తో సంప్రదింపులు జరిపినా ఫలితం దక్కలేదు. ఫిదెల్ హవానాకు వచ్చాడు. ప్రజలంతా అతనిని ఘనంగా శ్లాఘించారు. ఫిదెల్ తన ఉపన్యాసంలో క్యూబా విప్లవోద్యమంలో 'చే' ని అసలైన హీరోగా వర్ణించాడు. 'చే' ఏ పదవి మీదా ఆసక్తి చూపలేదు. కాని అన్నిటా తానై పనిచేశాడు. విప్లవ ఆదర్శాలను కార్యరూపంలోకి తేవాలి ఆ కార్యక్రమాల రూపకల్పన జరిగింది.


క్యూబాలో బతిస్తా ఏర్పాటు చేసిన సైనిక, పోలీసువిభాగాల్ని రద్దు చేశారు. అమెరికన్లను వెనక్కి పంపేశారు. విద్య గురించి 'చే' ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. ఒక సాంస్కృతిక సంస్థ ఏర్పాటయింది. అతని ఉద్దేశం ముందుగా వ్యవసాయంలో విప్లవం, తరువాత నగరాలలో విప్లవం. భూస్వాములనుండి స్వాధీనం చేసుకున్న ఆవుల్ని స్థానిక ప్రజలకి పంచి పెట్టారు. ప్రజలు కోల్పోయిన అవకాశాలన్నీ తిరిగి వారికి చేరాలి. బతిస్తా పోలీసులు ప్రజల మీద చేసిన హింసలు అత్యాచారాలు బయటపడ్డాయి. వారిని బహిరంగ విచారణలో ప్రవేశపెట్టారు. ప్రజలకు వారిమీద పట్టలేని ఆగ్రహం కలిగింది. ప్రతి నేరస్తుడి గురించి ప్రజల అభిప్రాయాన్ని తీసుకుని, వారు నిర్ణయించిన శిక్షలనే అమలుజరిపారు.

తీవ్రనేరాలకు మరణశిక్ష విధించారు. కఠిన శిక్షలకు గురి అయిన వారిలో కొందరు సి.ఐ.ఏ. ఏజెంట్లు, అమెరికన్ అధికారులూ కూడా ఉన్నారు. అమెరికన్ ప్రసార సాధనాల్లో క్యూబన్ గెరిల్లాలు తమ వ్యతిరేకుల్ని అందర్నీ కఠినంగా శిక్షిస్తున్నారనీ ప్రచారం చేశాయి. ఫిదెల్ అవన్నీ వాస్తవాలు కాదని నిరూపించాడు. "ఆపరేషన్ ట్రూత్" ఉద్యమం ద్వారా ప్రజలకు నిజాలు తెలియజేశారు.


'చే' విదేశీయుడనే ప్రచారం చేశారు. కాని తాను ఎక్కడుంటే ఆ ప్రాంతపు పౌరుడినని జవాబిచ్చాడు.

జనవరి 9న 'చే' తల్లిదండ్రులు హవానాకి వచ్చారు. కుమారుడిని చూడగానే వారి సంతోషానికి అవధులు లేవు. 'చే' వారికి హవానా నగరమంతా చూపించాడు. తల్లికి అలైదాని పరిచయం చేశాడు. తాను ఆమెను వివాహం చేసుకోబోతున్నానని చెప్పాడు. హిల్డా గురించీ అడిగింది. హిల్డా అంగీ కారంతోనే అలైదాని పెళ్లి చేసుకుంటున్నా ననీ, హిల్డా తనతోనే ఉంటుందనీ చెప్పాడు. 'చే' తల్లి అంగీకరించింది. జనవరి 21న హిల్డా హవానాకి వచ్చింది. హిల్డాని కూడా తనతో తీసుకుని వచ్చింది. తన దగ్గర డబ్బులేదు. అతని స్నేహితులు హిల్డాకి ఒక బొమ్మకొని యిచ్చారు. హిల్డాకి మూడేళ్లు. మే లో హిల్డా 'చే'లు విడాకులు తీసుకున్నారు. జూన్ 2న 'చే' అలైదాలు వివాహం చేసుకున్నారు. హవానాలో ఉన్నా నిరాడంబరంగానే జీవితంగడుపుతున్నారు. 'చే' చట్ట ప్రకారం క్యూబా పౌరుడయ్యాడు.

# 8. విప్లవ మార్గంలో తొలి అడుగులు



అనుకున్న విధంగా క్యూబాలో వ్యవసాయ సంస్కరణలు అమలు కావడం లేదు. వ్యవసాయ భూముల్లో 46% భూ స్వాముల స్వాధీనంలోనే ఉన్నాయి. వారు ప్రజల మీద పెత్తనం చెలాయిస్తున్నారు. ఆదివాసీలు రోజు వారీ కూలీలుగా పనిచేస్తున్నారు. వారు దుర్భర పరిస్థితుల్లో జీవనాన్ని సాగిస్తున్నారు. వివిధరంగాల్లో పనిచేస్తున్న వారు సంఘాలు ఏర్పరుచు కున్నారు. వారు భూస్వాముల



భూముల్ని ఆక్రమించడం మొదలుపెట్టారు. అధ్యక్షుడిగా ఉన్న ఉరూషియా ప్రజలు అటువంటి ఆక్రమణలకి పాల్పడకూడదని ప్రకటించాడు. అలా చేసిన వారిపై చర్యలు తీసుకోమని కామిలో, రెమిరో వార్డెస్‌లను ఆదేశించాడు. కాని వారు ఆ ఆదేశాల్ని గౌరవించలేదు.

'చే' ఒక యింటరేవ్యూలో మాట్లాడుతూ భూ ఆక్రమణల్ని సమర్థించాడు. స్వాధీనం చేసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించనక్కర్లేదనీ, జాతీయ వనరులమీద ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యం ఉండకూడదనీ అన్నాడు. వ్యవసాయ సంస్కరణల చట్టంలో గరిష్ఠ భూపరిమితిని నిర్ణయించారు. మిగిలిన భూముల్ని స్వాధీనంచేసుకుని భూమిలేని రైతులకి యివ్వాలి. జాతీయాకరించిన భూముల్ని వ్యవసాయ క్షేత్రాలుగా రూపొందించారు. భూములు అమ్మదలుచుకుంటే ప్రభుత్వానికే అమ్మాలి.

ఫిదెల్‌వర్గం కమ్యూనిస్టుల్లా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ ప్రధానమంత్రి మిరోకార్తోనా రాజీనామా చేశాడు. కార్తోనా స్థానంలో ఫిదెల్ ప్రధానమంత్రి అయ్యారు. ఏప్రిల్ 9న ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాల సమా వేశం జరిగింది. సోషలిస్టు భావాలున్న చే, రావుల్, ఫిదెల్ గ్రూపు ఆ పక్షాలలో ఒకటి. ఇంకొకటి ఉరూషియా, కార్తోనాలవంటి మితవాద నాయకులున్న గ్రూపు, మూడవది క్యూబన్ జాతీయ వాదుల గ్రూపు. ఈ గ్రూపుకి కమ్యూనిస్టుల మీద అభ్యంతరాలున్నాయి. అయితే ఫిదెల్ నాయకత్వానికి ఎవరూ అడ్డుచెప్పలేదు. ఎన్ని వాదోపవాదాలున్నా సమాజాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రజాస్వామిక సంస్కృతి రావాలంటే మొదట పిల్లల పెంపకంలో శ్రద్ధ చూపాలి. కాబట్టి లాకబానాలో పిల్లల క్లబ్బుని ఏర్పాటు చేశారు. పిల్లలు విప్లవ సైనికులతో కలిసి గడుపుతారు. వారు క్యూబా విముక్తి పోరాటాన్ని గురించి తెలుసుకుంటారు.

ప్రభుత్వ సంస్కరణలు అన్ని రంగాల్లోనూ అమలు లోకి వస్తున్నాయి. అయితే వీటికి వ్యతిరేక ప్రచారాలు కూడా జరుగుతున్నాయి. 'చే' గాని, ఫిదెల్ గాని తమది కమ్యూనిస్టు ప్రభుత్వం అని ఎక్కడా చెప్పలేదు. తమది ప్రజాస్వామిక ప్రభుత్వం అనే చెబుతూంది.



తరువాత క్యాబినెట్ మంత్రి వర్గంలో మార్పులు చేస్తూ మితవాదుల్ని పదవుల నుండి తొలగించాడు ఫిదెల్. వాళ్లస్థానంలో లెఫ్ట్‌వింగ్ సభ్యులూ, రివల్యూషనరీ డైరెక్టోరియా సభ్యులూ కొందరు మంత్రులుగా నియమించబడ్డారు.

ఈ మార్పుల్ని విశ్లేషిస్తూ "ఎ రివల్యూషన్ బిగిన్స్" అనే వ్యాసం రాశాడు. 'చే' మీడియారంగంలో రెండు ప్రాజెక్టుల్ని ప్రారంభించాడు. ఒకటి న్యూస్ ఏజెన్సీ, యింకొకటి పత్రిక. అవిరామంగా పనిచేయడం వల్ల 'చే' ఆరోగ్యం దెబ్బతింది. న్యూ మోనియా, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నాడు. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమని చెప్పినా అతడు వినలేదు. బలవంతంగా అతనిని గెస్ట్‌హౌస్‌కి తీసుకుని వెళ్లారు. అలైదా, హిల్డిదా కూడా అతనితో వెళ్లారు.

1959 లో 'చే' క్యూబా తరఫున రాయబారిగా చాలా దేశాలు పర్యటించాడు. అతనితో పాటు క్యూబా ప్రతినిధి బృందం కూడా వెళ్లింది. జులై 1వ తేదీన భారత దేశం వచ్చి నెహ్రు ఇందిరా గాంధీలను కలిశాడు. వారు మమవ యిచ్చిన విందులో పాల్గొన్నాడు. 'చే' కి తాజ్‌మహల్ వెండి బొమ్మని, అలైదాకి నేత చీరను బహుకరించారు. తరువాత 'చే' జపాన్, బర్మా, థాయి లాండ్‌లు పర్యటించాడు. జపాన్ పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశమైనా, అమెరికాకి తలవంచడం అతనికి బాధకలిగించింది.

క్యూబాలో మితవాదులు, వామపక్షాలు తీవ్ర స్థాయిలో పోరాడుకుంటున్నారు. క్యూబాలో అతి వాదులైన కమ్యూనిస్టులు పెత్తనం చెలాయిస్తున్నారని అమెరికా ప్రచారం చేస్తూంది. ఫిదెల్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశాడు. రాజీనామాను ఉపసంహరించుకోమని అందరూ ఆందోళన చేశారు. వ్యతిరేకతకు ఫలితంగా అధ్యక్షుడు రాజీనామా చేశాడు. అతని స్థానంలో ఆస్వాల్డోదార్తికోస్ అధ్యక్షుడయ్యాడు. ఈ పరిణామాలు క్యూబా రాజకీయాలలో పెద్దమార్పు తెచ్చాయి. కొంతకాలానికి పరిస్థితులు చక్కబడ్డాయి.

'చే' బృందం జకార్తా, ఇండోనేషియాలకు వెళ్లింది. తరువాత సింగపూర్, హాంకాంగ్, శ్రీలంకలకు వెళ్లింది. మొత్తం మీద మూడు నెలల పాటు 'చే' అన్ని దేశాలు తిరిగి 1959, సెప్టెంబరు 19న క్యూబా చేరుకున్నాడు. ఆయాదేశాలలో ఉన్న పరిస్థితుల మీద చాలా వ్యాసాలు రాశాడు.

కొత్తగా పోలీసులుగా చేరిన వారిని ఉద్దేశించి ప్రసంగించాడు.



విప్లవ ప్రభుత్వం కారణంగా భూములు పోగొట్టుకున్న భూస్వాములు క్యూబాలో విధ్వంసానికి కుట్ర పన్నారు. 'చే' తన విదేశీ పర్యటన తరువాత దేశంలో ఉన్న అన్ని యూనివర్శిటీలకు వెళ్లి విద్యార్థులతో మంచి సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. లాస్ విల్లాస్ యూనివర్శిటీ 'చే' కి గౌరవ డాక్టరేటు యిచ్చింది. మైనారిటీ కుటుంబాలకీ, రైతు కుటుంబాలకీ చెందిన విద్యార్థులను చేర్చుకోమని అధికారుల్ని కోరాడు. విద్యార్థులు చదివే చదువుకీ, సామాజిక పరిస్థితులకీ సమన్వయం ఉండాలనీ, స్పష్టంగా చెప్పాడు.

'చే'కి చాలా బాధ్యతలున్నాయి. వీటికి తోడు నేషనల్ అగ్రేరియన్ రిఫార్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో పారిశ్రామికీకరణ విభాగానికి అధిపతి అయ్యాడు. చిలీ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు సాల్వదార్ అయెందే 'చే'ని కలిశాడు అప్పటినుండి చిలీ కమ్యూనిస్టు పార్టీకి చెందిన మేధావులు క్యూబా పునర్నిర్మాణంలో సహకరిస్తూనే ఉన్నారు.

'చే' ఆధ్వర్యంలో ఒక మేనేజిమెంట్ స్కూలు ఏర్పాటయింది. దేశంలో ఉన్న చిన్న తరహా పరిశ్రమల మధ్య సమన్వయం ఏర్పాటు చేయాలనేదే దాని లక్ష్యం. భూస్వాముల కుట్ర తెలిసిన దగ్గర నుండీ రక్షణ వ్యవహారాలను కట్టుదిట్టం చేశారు. రక్షణ శాఖకి రావుల్ కాస్ట్రోని నియమించడం అసమ్మతి వాదులకు యిష్టం లేదు. ఎందుకంటే కాస్ట్రో పక్కా కమ్యూనిస్టు ప్రభుత్వ వర్గాల మధ్య విభేదాలు వచ్చాయి.

కామిలో కెమాగ్వేనుండి సాంతాక్లారాకు విమానంలో వస్తూ ఉండగా శత్రువులు దాడి చేశారు. ఆ దాడిలో విమానం కూలిపోయి కామిలో మరణించాడు. 'చే' కి కామిలో అత్యంత సన్నిహితుడు. 'చే' చాలా కుంగిపోయాడు.

1959 నవంబరు 26 న ఎర్నెస్టో చేగెవారాకి క్యూబన్ జాతీయుడిగా సర్టిఫికేటు వచ్చింది. ఆ రోజునే అతడు క్యూబన్ నేషనల్ బ్యాంక్ ఛైర్మన్ అయ్యాడు. ఈ నియామకాన్ని గురించి ఒక కథ ఉంది. ఫిడెల్ విప్లవ నాయకులందర్నీ సమావేశపరిచి, "జాతీయ బ్యాంకు నిర్వహణ బాధ్యతని చేపట్టగలిగిన ఎకనామిస్ట్ ఎవరైనా మీలో ఉన్నారా?" అని అడిగాడు. బాగా అలసిపోయి నిద్రమత్తులో ఉన్న 'చే' కి ఎకనామిస్ట్ అనే పదం కమ్యూనిస్ట్‌గా వినిపించి చేయి పైకి లేపాడట. అతని తండ్రి డాన్ ఎర్నెస్టో కూడా "ఏమిటీ!


మా ఎర్నెస్తో క్యూబా బ్యాంక్ నిర్వహణ చేయడమా? ఫిదెల్‌కి పిచ్చెకిందా ఏం? మా వంశంలో ఓ గెవారా వ్యాపారం చేస్తూనే ఉన్నాడు, దివాళా తీస్తూనే ఉన్నాడు" అని హాస్యమాడాడట. నిజానికి ఆ బాధ్యతని తీసుకోడానికి 'చే' కూడా జంకాడు. అతనికి ఆర్థిక లావాదేవీలు తెలియవు. పైగా బ్యాంకింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

ఉద్యోగంలో చేరగానే బ్యాంకింగ్ విధానంలో సంస్కరణలు ప్రారంభించాడు. బ్యాంకింగ్ అధికారులుగా ఉన్న మాతోస్ వర్గీయులు రాజీనామా చేశారు. కాని చిలీ కమ్యూనిస్టులు 'చే' కి అండగా నిలిచారు. అనేక బాధ్యతలవల్ల 'చే' రాత్రింబగళ్ళు పని చేయడం ప్రారం భించాడు. అయినా ఏ కొంచెం అవకాశం దొరికినా హిల్డితాతో కబుర్లు చెప్పేవాడు, గ్రంథరచన కూడా చేసేవాడు. ఎంత అలసి పోయినా, అనారోగ్యంతో ఉన్నా ఎక్కువ విశ్రాంతి తీసుకునేవాడు కాదు. ఎక్కువ ఉద్యోగాలు నిర్వహిస్తున్నా కమాండరుగా ఉన్నప్పుడు తీసుకునే 440 పెసోలునే తీసుకున్నాడు. కారుకి, యింటి అద్దెకు పోను మిగిలిన డబ్బుతో కుటుంబానికి ఖర్చు చేసేవాడు. పుస్తకాలు కొనుక్కోడానికి డబ్బు చాలేది కాదు. మిత్రులూ, అతనిని అభిమానించే ప్రజలూ అతనికి పుస్తకాలు బహూకరించేవారు.




ఫిదెల్, 'చే' లు క్యూబాను అభివృద్ధి చేస్తూనే ఉన్నారు. ఇంకొక ప్రక్క క్యూబాని నాశనం చేయడానికి యు.యస్ బ్రిటన్లు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. రష్యా సహాయం తీసుకోమని కొందరు సలహాయిచ్చారు. అలా తీసుకుంటే రష్యాకి తలవంచవలసి వస్తుందనుకున్నారు ఫిదెల్, 'చే' లు. కాని కొన్నాళ్ల తరువాత సోవియెట్ కమ్యూనిస్టు పార్టీతో సంబంధం ఏర్పడింది.

ప్రపంచ దేశాల మీద ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తూంది. అప్పటికే రష్యా సోషల్ సామ్రాజ్య వాదం కూడా బలపడింది. 'చే' కి రష్యాతో సంబంధం సందేహంగానే ఉంది. రష్యాతో సంబంధం ఉండడంవల్ల క్యూబా మీద అమెరికా ఆంక్షలు తీవ్రమవుతున్నాయి. ఉదాహరణకి క్యూబాకి మూడు లక్షల ముడి చమురు తక్కువ ధరకి యివ్వడానికి రష్యా అంగీకరించింది. కాని క్యూబాలోని నూనె శుద్ధి కర్మాగారాలు అమెరికావి. ఆ ముడి చమురుని శుద్ధి చేయడానికి ఆ కంపెనీలు అంగీకరించలేదు. క్యూబా ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ స్టేషన్లను జాతీయాకరించింది. ముడి చముర్లని శుద్ధి



చేయడానికి అంగీకరించని కంపెనీలు అధిక రేటు యిచ్చి విద్యుత్తుని వాడుకోవాలి. ఈ చర్య ప్రభుత్వంలోని అసమ్మతి వాదులకు అంగీకారం కాదు. వారు మంత్రి పదవులకు రాజీనామా చేశారు.


క్యూబా ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి 'చే' రెనే డ్యూమాం అనే వ్యవసాయ రంగ నిపుణుడితో చర్చించాడు 'చే' అతడు కో – ఆపరేటివ్స్‌ని నెలకొల్పమని సలహా యిచ్చాడు. కాని 'చే' ఆ సలహాని తిరస్కరించాడు. అతని దృష్టిలో లాభాపేక్షకూ, వ్యాపార దృష్టికీ చోటులేదు.

1960, మార్చిలో క్యూబాలో ఒక సంఘటన జరిగింది. హవానా హార్బర్‌కి "లా కోబ్రే" అనే ఫ్రెంచినౌక వచ్చింది. అది ఆగిన కొద్ది సేపటికే పేలిపోయింది.దానిలో ఆయుధాలు ఉండడం వల్ల అలా జరిగిందని తెలిసింది. క్యూబా పౌరులు గాయపడలేదు కాని నౌకలో 75 మంది మరణించారు. 200 మంది గాయపడ్డారు. ఆయుధాలతో నౌక ఎందుకు వచ్చింది? క్యూబా మీద దాడి చేయడానికా అనే అనుమానం కలిగింది.



గాయపడిన వాళ్లకు చికిత్స అందించాడు. 'చే' జర్నలిస్టులను ఫోటోలు తీయవద్దని చెప్పాడు. కాని గుర్తు తెలియని శవాలకు 'చే' అంత్యక్రియలు చేసే సమయంలో అతనికి తెలియకుండా కోర్డా అనే విలేఖరి ఫోటో తీశాడు. అది చాలా కాలం తరువాత ఒక ఇటలీ పబ్లిషర్‌కి దొరికింది. అతడు దానిని పోస్టర్‌గా ముద్రించాడు. 'చే' చనిపోయిన తరువాత ఆ ఫోటోకి ప్రాచుర్యం కలిగింది. 'చే' మిలిటరీ విషయాల మీద సీరియల్‌గా వ్యాసాలు రాశాడు. అవి "గెరిల్లావార్ ఫేర్ మాన్యులీల్" అనే పుస్తకంగా వెలువడింది.

1960 అక్టోబరు నుండి క్యూబాతో ఆర్థిక లావాదేవీలను రద్దు చేసుకుంటున్నామని అమెరికా ప్రకటించింది. దానితో క్యూబాలో ఆర్థిక సంస్కరణలు వేగవంతమయ్యాయి. బ్యాంకుల్నీ, పంచదార ఫ్యాక్టరీలనూ జాతీయాకరణ చేశారు. ఆ పనిమీద 'చే' యూరప్ పర్యటనకి బయలుదేరాడు. చెకొస్లవేకియాతో రుణ ఒప్పందం కుదుర్చుకున్నాడు. క్యూబాకి అవసరమైన సహాయాన్ని అందిస్తామని రష్యా చెప్పింది. ముఖ్యంగా చక్కెరను దిగుమతి చేసుకుని, చమురు, యంత్రభాగాలు యివ్వడానికి రష్యా అంగీకరించింది. అయితే క్యూబాలో ఫ్యాక్టరీలు నిర్మించింది.




తరువాత 'చే' చైనా వెళ్లాడు. అక్కడ ఆస్తమాతో బాధపడ్డాడు. పైగా గుండె జబ్బు వచ్చింది. చైర్మన్ మావో అతనిని ఆస్పత్రిలో చేర్చాడు. క్యూబాకు తాను సహకరిస్తానని మావో చెప్పాడు. 'చే' యింకా విదేశీ పర్యటనలో ఉండగానే అలైదాకి ఆడపిల్ల పుట్టింది. పాపకు అలైదా పేరే పెట్టారు. 'చే' బృందం రెండుగా విడిపోయింది. ఒక బృందం వియత్నాం వెళ్లింది. 'చే' మరికొందరితో కలిసి ఉత్తర కొరియాకి వెళ్లాడు. ఉత్తర కొరియాతో వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. తరువాత జర్మనీకి వెళ్లి వారితో కూడా కొన్ని వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాడు.

క్యూబాలో లోహనిక్షేపాల్ని అధ్యయనం చేయడానికి రష్యా, చైనాలు తమ శాస్త్రవేత్తల్ని పంపింది. కాని అక్కడ ఉన్నవి అమెరికన్లయంత్రాలు. వాటిని ఎలా ఉపయోగించాలో వారికి తెలియలేదు. డిసెంబరుకి 'చే' బృందం క్యూబాకి చేరింది. ఆ రోజుల్లో గ్యుతిరెజ్ ఎలియా అనే సినీ దర్శకుడు సియెర్రా పోరాటాన్ని రెండు చిత్రాలుగా తీశాడు. ఆ చిత్రాలలో ఉద్యమకారుల్ని కూడా నటించేటట్లు చేశాడు.

తనకి వచ్చే సందేహాల్ని తీర్చుకోడానికి 'చే' మార్క్సిస్టు గ్రంథాల్ని చదివాడు. ఒక పత్రికలో "నోట్స్‌ఫర్ ఎ స్టడీ ఆఫ్ దక్యూబన్ రివల్యూషన్స్ ఐడియాలజీ" అనే వ్యాసం రాశాడు. ఆ వ్యాసం 'చే'ను ఒక మార్క్సిస్టుగా నిలబెట్టింది.

# 9. నిరంతర సంఘర్షణ

**1961** ఫిబ్రవరిలో క్యూబా ప్రభుత్వం పరిశ్రమల మంత్రిత్వశాఖని ఏర్పాటుచేసింది. దానికి 'చే'ని బాధ్యునిగా చేశారు. అతనికి సెక్రటరీగా మెనేజాను నియమించారు. 'చే' ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిశ్రమలకు నాలుగు విభాగాలు ఏర్పాటు చేశాడు. అవి భారీ పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు, ప్రణాళికా నిర్మాణం, నిర్మాణ రంగం. ప్రైవేటు పరిశ్రమల్ని జాతీయం చేయడానికి కూడా ప్రయత్నాలు చేశాడు.

పరిశ్రమల ద్వారా నిరుద్యోగ సమస్యని నిర్మూలించాలనుకున్నాడు 'చే'. ఫ్యాక్టరీలలో తయారైన సరుకులను ఎగుమతి చేయడానికి తగిన రవాణా సౌకర్యాలు లేవు. సాంకేతిక నిపుణులు కూడా తక్కువ మందే ఉన్నారు. ఉద్యోగులలో చాలామంది నిరక్షరాస్యులే. ఎన్ని పదవులు వచ్చినా 'చే' జీవన విధానంలో ఏ మాత్రం మార్పురాలేదు. ఇరవై నాలుగు గంటలూ శ్రమపడుతూనే ఉన్నాడు. అతనికి సరియైన పోషకాహారం అందడం లేదు. చేపలు, గుడ్లు తింటే అతనికి ఆస్తమా వస్తుంది.

క్యూబా అమెరికాల మధ్య పూర్తిగా వాణిజ్య సంబంధాలు నిలిచిపోయాయి. అమెరికా యింకా కక్ష సాధిస్తూనే ఉంది. అమెరికా ఒత్తిడి వల్ల తనకు అనుకూలంగా ఉన్న దేశాలను కూడా క్యూబాతో సంబంధం లేకుండా చేసింది. దానివల్ల ఆహార పదార్థాలకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితులను దాటడానికి ప్రభుత్వానికి సహకరించవలసిందిగా 'చే' ప్రజల్ని కోరాడు. ప్రజలు కూడా తమ సంపాదననుండి కొంత డబ్బుని విరాళంగా పంపుతున్నారు. చిన్న పిల్లలు కూడా తాము దాచు కున్న డబ్బునుండి విరాళాలు పంపు తున్నారు. 'చే' కి చిన్న పిల్లలు ఉత్తరాలు రాసేవారు. వాటిలో ఒక ఉత్తరానికి ప్రాముఖ్యత ఉంది. ఒక విద్యార్థి తాను దాచు కున్న డబ్బుని ఒక కవర్లో పెట్టి ఆ డబ్బుని విరాళంగా స్వీక రించమని 'చే' కి ఉత్తరం కూడా రాశాడు. పోస్టల్ అధికారులు డబ్బు కవర్లో పంపకూడదంటూ ఆ కవర్‌ని ఆ విద్యార్థికి తిరిగి పంపాడు. వెంటనే అతడు మనియార్డరు ద్వారా 'చే'కి పంపాడు. 'చే' అతని పట్టుదలకి మెచ్చుకుని ఉత్తరం రాశాడు.

ప్రియమైన మిత్రుడికి

నువ్వు రాసిన ఉత్తరానికి కృతజ్ఞతలు. డబ్బు విరాళంగా పంపినందుకు యింకా కృతజ్ఞతలు. నీ దేశభక్తికి సాక్ష్యంగా యీ రశీదుని పంపుతున్నాను. చక్కగా చదువుకుంటా నని హామీ యిచ్చినందుకు చాలా సంతోషం.

సగౌరవంగా

మేజర్ ఎర్నెస్తో చేగెవారా.



1961 ఏప్రిల్ లో కొత్త ప్రమాదం వచ్చింది. క్యూబా తన పెత్తనానికి లొంగడం లేదని అమెరికా ప్రత్యక్ష దాడులకు దిగింది. క్యూబా సైనికాధికారుల్ని కొంతమందిని ప్రలోభ పెట్టింది. వాళ్ల సహాయంతో దాడులు మొదలు పెట్టింది. చాలా పట్టణాలలోని సైనిక స్థావరాల మీద బాంబుదాడులు చేసింది. క్యూబా తన సైన్యంతో ప్రతిఘటించింది. ఆ పోరాటంలో 'చే' కి చెంపలో బుల్లెట్ దిగబడింది. దానిని తీయడానికి ఆపరేషన్ అవసరం అయింది. మత్తు యిస్తే ఆస్తమా ఎక్కువవుతుంది. మత్తు లేకుండానే ఆపరేషన్ చేయించుకున్నాడు 'చే'.

అమెరికా క్యూబాకు పొరుగున ఉన్న లాటిన్ అమెరికన్ దేశాల్ని కూడా తన వైపుకి తిప్పుకుంది. రెండు దేశాల సేనలు క్యూబా మీద దాడులకు దిగాయి. కాని 'చే' ఫిదెల్ నాయకత్వంలో క్యూబా సైనికులు వారిని చుట్టు ముట్టాయి. వందలాది అమెరికన్ సైనికులు మరణించారు.

పరిశ్రమల శాఖమంత్రిగా 'చే' తన బాధ్యతల్ని ఖచ్చితంగా నెరవేరుస్తున్నాడు. ప్రతి వారం సమావేశాలు ఏర్పాటు చేసి, విధుల నిర్వహణని సమీక్షిస్తాడు. ఒక నోట్‌బుక్కులో అందరి పనితీరుల సమీక్ష ఉంటుంది. దీనివల్ల పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. సాధించవలసిన లక్ష్యాల్ని గురించి ప్రణాళికలు సిద్ధం చేసేవాడు 'చే'.

క్యూబాలో ప్రభుత్వ సంస్కరణల్ని విమర్శించే గ్రూపు ఒకటి ఉంది. కొంతమంది వామపక్షీయాలు ఆ గ్రూపుని నిషేధించమని వాదించింది. కాని 'చే' అంగీకరించలేదు. వారి విమర్శనలకి తగిన సమాధానాలిద్దామన్నాడు. ఒకసారి ఆ గ్రూపు వారు వారి



సిద్ధాంత గ్రంథాన్ని ముద్రిస్తున్నారని తెలిసి క్యూబా పోలీసులు వాటిని ధ్వంసం చేశారు. 'చే'కి యీ చర్య బాధ కలిగించింది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి అన్నాడు.

ఒకసారి మేడే ఉత్సవాలలో క్యూబా విముక్తి పోరాటాల ఫలితాల గురించి ప్రజలకు తెలియాలని 'చే' ఫిదెల్‌లు నిర్ణయించుకున్నారు. ప్రజాస్వామిక సోషలిస్టు సమాజాన్ని నిర్మించడమే తమ ధ్యేయమని ప్రజలకు తమ ప్రసంగాల ద్వారా తెలియజేశారు. అందువల్ల ప్రభుత్వం లోని వామపక్షాలతోను, జాతీయవాదులతోనూ విభేధాలు కొనసాగుతూ వచ్చాయి.

ఆహార పదార్థాల ఉత్పత్తి బాగా పెరిగింది. అన్నీ సమృద్ధిగా దొరుకుతున్నాయి. ప్రజలంతా వాటిని విరివిగా వాడుతున్నారు. ఉత్పత్తులన్నీ దేశంలోనే ఖర్చయిపోతున్నాయి. ఎగుమతి చేయడానికి సరుకులు మిగలడం లేదు. అందువల్ల యితర దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు సరిగా అమలు కావడం లేదు. పశువులు వృద్ధి అయ్యాయి. పశుమాంసం కొనుక్కుని వృథా చేస్తున్నారు. పశువుల్ని చంపడం ఎక్కువయింది.

ఈ మార్పుల వల్ల ప్రభుత్వం యిబ్బందుల్లో పడింది. అయినా యిన్నాళ్లూ సరియైన తిండిలేక యిబ్బందులు పడిన ప్రజలు కడుపారాభోజనం చేస్తున్నారని 'చే' కి సంతృప్తి కలిగింది. నెమ్మదిగా ప్రజలకి దుబారా చేయవద్దని నచ్చచెప్పడానికి ప్రయత్నాలు చేశాడు. నిరుద్యోగ సమస్య నిర్మూలించడానికి కావలసిన దానికంటె ఎక్కువ మందికి ఉద్యోగాలు యివ్వడం వల్ల వాళ్లలో సోమరితనం పెరిగింది. అందువల్ల కొత్త పరిశ్రమల ఏర్పాటు చేసి అదనంగా ఉన్న ఉద్యోగులకి పని కల్పించాలనుకున్నాడు. కొత్తఫ్యాక్టరీలు కట్టడానికి చాలా యంత్రాలు తెప్పించారు. భవనాలు యింకా నిర్మాణం కాలేదు. యంత్రాలు తుప్పు




పడుతున్నాయి. ఏ పరిశ్రమలు స్థాపించాలో అవగాహన లేకుండానే యితర దేశాల నుండి రుణాలు తీసుకున్నారు.

ఈ తెలియని తనాన్ని సొమ్ము చేసుకుంటుంది రష్యా, నాసిరకం యంత్రాల్ని ఎక్కువ ధరలకు అమ్ముతూంది. క్యూబాలో తగిన సాంకేతిక నిపుణులు లేరు. అవగాహన లేనివారు పెద్ద పరిశ్రమల నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. పారిశ్రామికీకరణంలో తాము పొరపాట్లు చేశామని 'చే' అంగీకరించాడు. తమ దేశంలోని అట్టడుగు ప్రజల ఆకాంక్షలకీ, అవసరాలకి అనుగుణంగా మార్క్సిస్టు సిద్ధాంతాల్ని అన్వయించడానికి 'చే', ఫిదెల్‌లు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

1961 ఆగస్టులో ఉరుగ్వేలో జరిగిన ఇంటర్ ఎకనమిక్ అండ్ సోషేల్ కౌన్సిల్‌లో క్యూబాలోని పరిస్థితులగురించీ, లాటిన్ అమెరికాదేశాలమీద అమెరికా చేస్తూన్న పెత్తనాన్ని గురించి 'చే' ప్రసంగించాడు. తరువాత మాంతె విదియా యూనివర్శిటీలో ఏర్పాటయిన ఒక రహస్య సమావేశంలో క్యూబాలో వ్యవసాయ రంగ సంస్కరణలు – ఆర్థిక ప్రగతి గురించి ప్రసంగించాడు. ప్రభుత్వ విధానాల్ని వ్యతిరేకించే వారు యీ సమావేశాన్ని ఏర్పాటు చేసినందువల్ల పోలీసులు వారిపై కాల్పులు జరపగా ఒక ప్రొఫెసర్ చనిపోయాడు.

అర్జెంటీనా అధ్యక్షుని ఆహ్వానంమీద 'చే' అక్కడికి వెళ్లబోతూ ఉండగా, అతనిని, ఫిదెల్‌ను హత్య చేయడానికి కుట్ర జరుగుతూందని తెలిసింది. 'చే' రహస్యంగా బ్యూనస్ ఐరిస్‌కి చేరాడు. అధ్యక్షునితో సమావేశం ఎంత రహస్యంగా జరిగినా కుట్రదారులు ఆ విషయాన్ని పత్రికలవారికి చేరవేశారు. అధ్యక్షుని చర్యకు నిరసనగా విదేశాంగమంత్రి



అదాల్ఫోమ్యూగికా రాజీనామా చేశాడు. తరువాత 'చే' బ్రెజిల్ అధ్యక్షుడిని కలిశాడు. అతడు క్యూబాకు మద్దతుయిస్తున్నట్లు ప్రకటించాడు. కాబట్టి ఆర్జెంటీనా, బ్రెజిల్ అధ్యక్షులు సైనిక తిరుగుబాటుల వల్ల పదవులు కోల్పోయారు.

'చే' ఎక్కడికి వెళ్లినా నిఘా ఉంటుంది. క్యూబాకు మద్దతు యిచ్చే వారందరి మీదా అమెరికా కక్షసాధిస్తూంది. ఇంటిగ్రేటెడ్ రివల్యూషనరీ ఆర్గనైజేషన్స్ అనే కొత్త పార్టీ ఏర్పాటయింది. ఉత్పత్తి రంగ సంస్థల సమావేశం కూడా అదే రోజున జరిగింది. ఆ సమావేశం హవానాలో జరిగింది. ఆ సమావేశంలో 'చే' విప్లవ ప్రభుత్వం సాధించిన విజయాలగురించి వివరించాడు. తాము ఎదురుకున్న కష్టాల్నిగురించి కూడా ప్రజలకి తెలిపాడు. నిజమైన ప్రజాప్రభుత్వం ఎప్పుడూ ప్రజల అభిప్రాయం ప్రకారమే నడవాలని చెప్పాడు.

1962 లో హవానాలో క్యూబా విప్లవ వార్షికోత్సవం జరిగింది. క్యూబా ప్రభుత్వం తన లోటు పాట్లను సరిచేసుకుంటూ ముందుకి సాగుతూంది. వాళ్లు సాధించిన విజయాలలో చెప్పుకోదగినది అక్షరాస్యత రెండేళ్లలో 7,07,000 మంది అక్షరాస్యులయ్యారు. ఉత్పత్తి రంగంలో కూడా పరిస్థితులు మెరుగయ్యాయి. క్యూబన్లు సాంకేతికంగా శిక్షణ పొందారు.

బతిస్తా ప్రభుత్వంలో పరిశ్రమలు విదేశీయుల చేతుల్లో ఉండడం వల్ల శ్రామికుల జీతాలు వాళ్ల యిష్టం వచ్చినట్లు నిర్ణయించేవారు. శ్రామికులకు ఒక్కొక్క సంస్థలో ఒక్కొక్క విధంగా జీతాలుండేవి. దీనివల్ల ఉద్యోగ వర్గాలలో అసంతృప్తి ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్యని మంత్రివర్గ సమావేశంలో పెట్టాడు 'చే'. చివరికి వేతనాలు



తగ్గించి, వస్తువుల ధరలు కూడా యింకొంత తగ్గించాలని నిర్ణయించారు. దానివల్ల అదనంగా కరెన్సీ ముద్రించ వలసిన అవసరం ఉండదు. ప్రజల జీవన ప్రమాణ స్థాయి కూడా తగ్గదు. ఆ సమయంలోనే స్త్రీలకు కూడా పురుషులతో సమానంగా వేతనాలు యివ్వాలనుకున్నాడు.

కాస్త సమయం దొరికితే చదరంగం ఆడడం లేదా కవిత్వం చదువుకోవడం లేదా అలైదాతో సినిమాకి వెళ్లడం చేసేవాడు. సినిమా టిక్కెట్లు కొనడానికి వెళ్లినప్పుడు వాళ్లు డబ్బు తీసుకునేవారు కాదు. అయినా డబ్బిచ్చి టిక్కెట్లు కొనుక్కుని వేళ్లెవారు.

ఉత్పత్తి రంగంలో నైపుణ్యాన్ని చూపించిన కార్మికులకి ప్రోత్సాహకాలు యివ్వాలను కున్నాడు. డబ్బు రూపంలో యిస్తే వారి జీవన విధానాలలో అసమానతలు ఏర్పడతాయి. కాబట్టి వారిని సాంకేతిక శిక్షణా శిబిరాలకి పంపి ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. తిరిగి వచ్చిన తరువాత వారికి ఉన్నత స్థాయి ఉద్యోగాలు యివ్వవచ్చు. ఎల్లప్పుడూ యిటువంటి ఆలోచనలతో ఉండే 'చే' ప్రభుత్వ వర్గాల్లో పెరుగుతూన్న సంక్షోభాల్ని గుర్తించలేదు. కొంతమంది బ్యూరోక్రాట్లు ఇంటిగ్రేటెడ్ రివల్యూషనరీ ఆర్గనైజేషన్స్‌ని చేజిక్కించుకుని సియెర్రా కార్యకర్తల్ని చదువులేదని ఉద్యోగాల నుండి తొలగించారు. కమ్యూనిస్టు సభ్యులు కానివారు పనికి రానివారిగా చూస్తున్నారు. వారే కార్యవర్గంలో మూడు వంతులు స్థానాన్ని ఆక్రమించారు. వారు చేసే పనుల్ని 'చే' ఫిదెల్‌లు బహిరంగంగానే విమర్శించారు. ఆ ఆర్గనైజేషన్స్ కొత్త నాయకత్వాన్ని ప్రకటించారు. దానిలో ప్రధాన కార్యదర్శిగా ఫిదెల్, సహాయ కార్యదర్శిగా రావుల్ ఉన్నారు. బ్యూరోక్రాట్లలో ఒక్కబ్లాన్ రోకాకి తప్ప యింకెవరికీ స్థానం రాలేదు.

ఈలోగా లాటిన్ అమెరికా దేశాలకు మేలు చేస్తామని అమెరికా కొన్ని దేశాల్ని తన గుప్పిట్లో పెట్టుకుంది. ఆ కుట్రని 'చే' విమర్శించాడు.

మే 20 న అలైదాకి కొడుకుపుట్టాడు వానికి తన ప్రాణమిత్రుడైన కామిలో పేరు పెట్టాడు 'చే'.

క్యూబా మీదా, దానికి మద్దతుగా ఉన్న వారి మీదా అమెరికా దాడులు చేస్తోంది. అదే సమయంలో రష్యా నుండి ఒక వార్త వచ్చింది. క్యూబా రక్షణ కోసం తాము అణ్వస్త్రాలను యిస్తామని చెప్పింది. దీనిని అంగీకరించాలా వద్దా అని ఆలోచించి, చివరకు అంగీకరించారు. అణ్వస్త్ర ఒప్పందాన్ని కుదుర్చుకుందామని వెళ్తే అది రహస్యంగా ఉండాలని కృశ్చేవ్ అన్నాడు. 'చే' కి అలా యిష్టం లేకపోయినా అంగీకరించవలసివచ్చింది. అణ్వస్త్రాలు సమకూడాయి. ఈ విషయం తెలిసి క్యూబాపై దాడికి అమెరికా సిద్ధమయ్యింది. అంతేకాక అమెరికా టర్కీకి అణ్వస్త్రాలను యిచ్చినట్లు తెలిసింది. ఈ లోపున క్యూబా, ఆల్జీరియా విప్లవకారుల మధ్య సహకారానికి ఒప్పందం జరిగింది.

క్యూబాలో అణ్వాయుధాలు ఉన్నాయనే విషయం మీద రష్యా అమెరికాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. రష్యా విదేశాంగమంత్రి గ్రోమికో అమెరికా వెళ్లి కెన్నెడీని కలిశాడు. అయినా అణ్వాస్త్రాలున్నట్లు నిర్ధారణ అయిందని కెనెడీ టి.వి.లో ప్రకటించాడు. అందువల్ల క్యూబాకి వెళ్లే సముద్ర మార్గాల్ని దిగ్బంధనం చేస్తున్నట్లుగా కూడా ప్రకటించాడు. అమెరికా మాటల్ని లెక్కచేయబోమని రష్యా ప్రకటించింది. క్యూబా మీద యుద్ధానికి దిగుతున్నామని అమెరికా నుండి ప్రకటన వచ్చింది. క్యూబా కూడా సిద్ధమయింది. 'చే' నాయకత్వంలో సాయుధ సేనలు సంతియాగో నదీ తీరాన ఉన్న పర్వత గుహల్ని స్థావరంగా చేసుకున్నాయి.

సముద్ర మార్గం గుండా దాడులు చేస్తామని అమెరికా ప్రకటిస్తూ ఉండడం వల్ల ఫిదెల్‌కు అనుమానం కలిగింది. తమను ప్రక్కదారి పట్టించి, వైమానిక దాడులకు దిగుతుందనుకున్నాడు. క్యూబా సరిహద్దుపై వెళ్లే విమానాల్ని కూల్చివేయమని ఫిదెల్ ఆదేశించాడు. ఫిదెల్ అనుమానం నిజమయింది. క్యూబా సరిహద్దుల్లో అమెరికా విమానాలు కనపడ్డాయి. వాటిలో ఒక విమానాన్ని కూల్చివేశారు.

ఈలోగా కృశ్చేవ్ కెన్నెడీకి ఒక వర్తమానం పంపాడు. టర్కీలోని అణ్వాయుధాల్ని అమెరికా ఉపసంహరించుకుంటే క్యూబా నుండి తాము అణ్వాయుధాల్ని వెనక్కి తీసుకుంటామని ఆ వర్తమానం యొక్క సారాంశం. కెన్నెడీ దానికి అంగీకరించాడు. ఈ సంగతి ఫిదెల్‌కి తరువాత తెలిసింది. క్యూబా వ్యవహారాలలో తల దూర్చమని అమెరికా

చెప్పినందు వల్ల క్యూబా క్షేమం కోసమే ఆ ఒప్పందాన్ని అంగీకరించామని కృశ్చేవ్ ఫిదెల్‌కి చెప్పాడు. యుద్ధం తాత్కాలికంగా ఆగింది. 'చే' తిరిగి యింటికి వచ్చాడు.

క్యూబా ప్రజల కోపాన్ని చల్లార్చడానికి రష్యా ఒక ఆలోచన చేసింది. అనస్తాన్ మికోయెన్ అనే సోవియట్ సభ్యుడు క్యూబాకి వచ్చి ఫిదెల్ మొదలైన వారితో మాట్లాడాడు. రష్యన్ రాయబారి కూడా వారితో మాట్లాడాడు. తరువాత క్యూబా రష్యాల మధ్య సంబంధాలు కొంత మెరుగయ్యాయి హవానా యూనివర్శిటీలో జరిగిన సమావేశంలో అనస్తాన్ అమెరికాను తీవ్రంగా విమర్శించాడు. అది నాటకీయంగా చెప్పిన మాటగా విద్యార్థులు భావించి, రష్యా ద్వంద్వనీతిని మరోసారి నమ్మి మోసపోబోమని చెప్పారు.

యుద్ధరంగం నుండి తిరిగి వచ్చిన తరువాత 'చే' మళ్లీ తన పనుల్లో మునిగి పోయాడు. పరిశ్రమల మంత్రిత్వశాఖలో కొత్త పరిశోధనా సంస్థలు ఏర్పడ్డాయి. సాంకేతికంగా మెరుగుపడడంవల్ల ఉత్పత్తి రంగంలో అభివృద్ధి కలిగింది. దీనికి కారణం 'చే' తన తోటి ఉద్యోగులతో చాలా స్నేహపూర్వకంగా ఉండడమే. 'చే' యొక్క నిరాడంబరత్వాన్ని సహోద్యోగులందరూ మెచ్చుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో అందరితో పాటు అల్యూమినియం పళ్లెం పుచ్చుకుని క్యూలో నిలబడి భోజనం తెచ్చుకునే వాడు. స్వచ్ఛంద శ్రమదానాలలో తాను కూడా పనిచేసేవాడు. అందరూ అన్ని పనులూ చేయాలనేదే అతని కోరిక. ప్రభుత్వంలో తనకి ఎంత ప్రముఖస్థానం ఉన్నా, అవసరాలకు సరిపడే జీతాన్నే తీసుకునేవాడు. అదనంగా ఏ సౌకర్యాలను అనుభవించేవాడుకాదు. పనిమీద బయటికి వెళ్లేటప్పుడు కాఫీ తాగడానికయినా జేబులో డబ్బులుండేవి కావు. అతడు ఒక చిన్న గదిలో ఉండేవాడు. గదిలో ఏ అలంకారాలు లేవు.

శ్రామిక యూనియన్ల నాయకత్వ స్థానాలలో స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలనేవాడు. పురుషులకున్నంత సామర్థ్యం స్త్రీలకు కూడా ఉందనే వాడు. రష్యానికూడా 'చే' ఘాటుగా విమర్శించేవాడు.

అమెరికా అనేక లాటిన్ అమెరికా దేశాల ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి, 'చే' కుటుంబాన్ని యిబ్బందులకు గురిచేసింది. 1963 లో 'చే' తల్లి సెలియా ఉరుగ్వేనుండి అర్జెంటీనా వెళ్తూ ఉండగా, ఆమె కమ్యూనిస్టు సాహిత్యాన్ని సరఫరాచేస్తూందని అరెస్టు చేసి రెండు నెలలు బ్యూనస్ ఐరిస్ జైలులో పెట్టారు. ఆమె ఆరోగ్యం అక్కడే దెబ్బతింది.

పరిశ్రమల నిర్వహణలో సోవియట్ అనుసరిస్తూన్న విధానం క్యూబా సామాజిక పరిస్థితులకు సరిపడదని 'చే' అభిప్రాయం. ప్రతి పరిశ్రమని ఒక స్వతంత్ర యూనిట్‌గా ప్రకటించి ఉత్పత్తిలో పోటీకి దింపితే, ఎవరికి వారే ప్రత్యేక గుర్తింపు కోసం, ఆర్థిక



ప్రయోజనాల కోసం పోటీ పడతారు. అందువల్ల సోషలిస్టు దేశాల ఉత్పత్తి రంగానికి ప్రజాప్రయోజనాలే ప్రామాణికం కావాలే తప్ప లాభాపేక్ష కాదని 'చే' అభిప్రాయం. కేంద్రీకృత ఆర్థికవిధానం అవలంబించాలి.

1963లో అలైదాకు యింకో కుమార్తె పుట్టింది. ఆ కుమార్తెకు తన తల్లి సెలియా పేరు పెట్టాడు.

'చే' ఆల్జీరియాకు వెళ్లి ఆల్జీరియన్ విప్లవకారుడు అహ్మద్ బెన్‌బెల్లాను కలిశాడు. అక్కడే తన పాతమిత్రుడు జార్జిరికార్డోమాజెత్తీని కలిశాడు. మాజెత్తీ ఒక జర్నలిస్టు. అమెరికా, క్యూబాకి జరిగిన యుద్ధాలలో అతడు కూడా పాల్గొన్నాడు. ఆల్జీరియన్ గెరిల్లాలకు ఆయుధాలు అందించాడు. ఆల్జీరియా అధ్యక్షుడు మొరొక్కాన్ నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి క్యూబా అన్ని విధాల సహాయం చేసింది. 'చే' హవానాకి తిరిగి వచ్చిన తరువాత వియత్నాం ప్రతినిధి బృందం అతనిని కలిసింది. ప్రపంచంలో సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాటం జరపాలని వారితో చెప్పి. వియత్నాం చేస్తూన్న పోరాటాన్ని అభినందించాడు. 1964 లో జెనీవాలో జరిగిన యునైటెడ్ నేషన్స్ ట్రేడ్అండ్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్సుకి క్యూబా ప్రతినిధిగా 'చే' హాజరై ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలన్నింటికీ మూలం సామ్రాజ్య వాద దేశాల దోపిడీయేనని చెప్పాడు.

తన నాయకత్వంలోని పరిశ్రమలశాఖ అనుకున్నలక్ష్యాల్ని చాలావరకూ సాధించ గలిగింది. తానే స్వయంగా అన్నింటినీ పర్యవేక్షించేవాడు. దుబారా ఎక్కడ జరిగినా ఊరుకునే వాడు కాదు. ఒకసారి ఒక మానసిక వైద్యశాల మ్యాగజైనును 3600 కాపీలు ముద్రించింది.

ఆ సంగతి తెలియగానే 'చే'కి కోపం వచ్చింది. ఒకే సబ్జెక్టు మీద అన్ని కాపీలు అవసరమా అని మేనేజర్‌కు లేఖ రాశాడు.

ప్రభుత్వ యంత్రాంగాన్ని నియంత్రించడానికి 'చే' ఒక కొత్త పద్ధతిని ప్రవేశపెట్టాడు. మంత్రులూ, ఉద్యోగులూ తమ బాధ్యతలలోకి ప్రవేశించేముందు ఆ శాఖకి చెందిన ఫ్యాక్టరీలలో సాధారణ కార్మికులతో కలిసి పని చేయాలి. ఈ విధానం పరిశ్రమల శాఖల్లో మాత్రమే అమలులోకి వచ్చింది. మిగిలిన వారు దీనికి సిద్ధపడలేదు.

అక్టోబరు విప్లవ 47 వ వార్షికోత్సవంలో పాల్గొనడానికి రష్యా క్యూబాని ఆహ్వానించింది. మనస్పర్థలను సర్దుబాటు చేసుకోడానికే యీ ఆహ్వానం అని తెలిసినా, 'చే' ని తమ ప్రతినిధిగా పంపాడు ఫిడెల్, కాని 'చే' ఆ అంచనాల్ని తారుమారు చేశాడు. రష్యా విధానం మీద మరికొన్ని అభ్యంతరాలు లేవనెత్తాడు. అక్కడ ఉన్న ఫ్యాక్టరీలన్నీ పెట్టుబడి దారీ పరిశ్రమల్లా ఉన్నాయన్నాడు. మార్క్స్ సిద్ధాంతాన్ని రష్యా దుర్వినియోగం చేస్తోందన్న మాట.

ఆ నాటికి చైనా, రష్యాల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయి. రష్యా ప్రభుత్వానిది రివిజనిస్టు విధానం అని చైనా అంటే విప్లవ శక్తుల మధ్య చీలికలు తేవడానికి చైనా కుట్ర పన్నుతూందని రష్యా విమర్శించింది. రష్యా, క్యూబాల మధ్యశాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి ఏర్పాటయిన సమావేశంలో 'చే' చైనాకి అనుకూలంగా మాట్లాడాడు. ఇది రావుల్ కాస్ట్రోకి అసంతృప్తి కలిగించింది.

ఇన్ని సమస్యలతో సతమతమవుతున్నా ఆండీస్‌లో సాయుధ పోరాటానికి ప్రణాళిక తయారు చేస్తున్నాడు. 'చే' క్యూబన్ విప్లవాన్ని లాటిన్ అమెరికా దేశాలకు విస్తరింప జేయాలనీ, దానికి అనుసరించవలసిన విధానాలను వివరిస్తూ "టాక్టిక్స్ అండ్ స్ట్రాటజీ ఇన్‌ద లాటిన్ అమెరికన్ రివల్యూషన్" అనే వ్యాసం రాశాడు. విప్లవ పోరాటాలు విజయవంతమవు తాయని 'చే' భావన. ఆ ఉద్యమాలన్నింటికీ సహాయ పడడానికి క్యూబా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ "లిబరేషన్" అనే సంస్థని ఏర్పాటు చేసింది.

1962 సంవత్సరపు చివరలో 'చే' పెరూ విప్లవకారులతో హవానాలో సమావేశ మయ్యాడు. పెరూలో హ్యూగోబ్లాంకో నాయకత్వంలో ఒక ఉద్యమ సంస్థ పనిచేస్తోంది. దీనికి మద్దతుగా ఒక గెరిల్లా సంస్థని ఏర్పాటు చేయాలన్నాడు 'చే'. పెరూలోని గెరిల్లాలకు

సహకరించమని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ బొలీవియాను కోరాడు. 'చే' వారు అంగీకరించారు. ఈ సంస్థ సహకారంతో పెరూకి చెందిన గెరిల్లా దళం బొలీవియాలో ప్రవేశించింది.

బొలీవియాలోని ఉద్యమ సంస్థల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఈ సమస్యల వల్ల గెరిల్లా ఉద్యమానికి కొన్ని యిబ్బందులు కలిగాయి. పెరూవియన్ గెరిల్లాలు బొలీవియా గుండా పెరూలోకి ప్రవేశిస్తూ ఉండగా పెరూకి చెందిన సరిహద్దు భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. గెరిల్లాలు తిరిగి బొలీవియాకు మరలిపోయారు.

వివిధ లాటిన్ ఉద్యమ సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి 'చే' చాలా కృషి చేశాడు. మాజెత్తీ నడుపుతున్న సంస్థపేరు "పీపుల్స్ గెరిల్లా ఆర్మీ" కార్యకర్తలు "ఇమొరబా " అనే సాయుధసేనగా ఏర్పడింది. ఒక బలమైన పోరాట వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా లాటిన్ అమెరికా విముక్తి ఉద్యమం నిరాటంకంగా సాగుతుందనుకున్నారు. కాని యివన్నీ అనుకున్న లక్ష్యానికి చేరలేకపోయాయి. లాటిన్ అమెరికా ప్రభుత్వాల్ని అమెరికా లొంగదీసుకుంది. పెరూఉద్యమాన్ని సైనిక ప్రభుత్వం అణచి వేసింది. గెరిల్లా స్థావరాల్ని శత్రువులు దిగ్బంధనం చేశారు. ముఖ్యులందరూ చంపబడ్డారు. చాలామందిని జైలులో పెట్టారు. 1964వ సంవత్సరాంతానికి ఉద్యమం పూర్తిగా అణచివేయబడింది. బొలీవియా లోను, బ్రెజిల్‌లోను కూడా ఉద్యమాలు ముగిసి పోయాయి. లాటిన్ అమెరికా సంపూర్ణ విముక్తి ఉద్యమం చీలిపోయింది.

# 10. కాంగో అనుభవాలు

1964 డిసెంబరులో న్యూయార్క్‌లో జరిగిన UNO సమావేశానికి క్యూబా ప్రతినిధిగా చేగెవారా వెళ్లాడు. ఆ సమావేశంలో 'చే' అమెరికా సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా విమర్శించాడు. లాటిన్ అమెరికా దేశాల మీద పెత్తనం, వియత్నాం మొదలైన దేశాల మీద దాడులు, దక్షిణాఫ్రికాలో జాత్యహంకార విధానాలు మొదలైన దుర్మార్గాలన్నింటినీ విమర్శించాడు.

'చే' సమావేశం పూర్తియ్యాక అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూన్న దేశాలకు వెళ్లాడు. ఉద్యమాలన్నింటి మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించే అవకాశాలను గురించి ఆలోచించారు. వారందరికీ సహకారం అందిస్తామని క్యూబా ప్రభుత్వం తరఫున హామీ యిచ్చాడు. తరువాత చైనా వెళ్లి చౌ ఎన్‌లైని కలిశాడు. క్యూబాది ద్వంద్వ వైఖరి అని చౌఎన్‌లై విమర్శించాడు. 'చే' వద్ద దానికి సమాధానం లేదు.

చైనా నుండి పారిస్, టాంజానియాలకు వెళ్లాడు. క్యూబా నుండి టాంజానియాకు సహాయం అందిస్తానని చెప్పాడు. చేగెవారా పర్యటనలోని ముఖ్యమైన ఘట్టం కాంగోలోని ఉద్యమకారుల్ని కలుసుకోవడం. లుముంబా నాయకత్వంలో ప్రారంభమైన విముక్తి ఉద్యమం కొనసాగుతూనే ఉంది. అయితే తగినంత శిక్షణ లేకపోవడం వల్ల శత్రువుల్ని ప్రతిఘటించలేకపోతూంది. గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణ యివ్వడానికి నిపుణుల్ని పంపుతానని మాటయిచ్చాడు 'చే'.

1965 లో ఆల్జీరియాలో "ఆఫ్రో – ఏషియన్ సాలిడారిటీ అనే సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో 'చే' ప్రసంగించాడు. ప్రపంచంలో జరుగుతున్న జాతి విముక్తి పోరాటాలన్నింటికీ సహకరించమని సోషలిస్టు దేశాలకు 'చే' విజ్ఞప్తి చేశాడు. చిన్న దేశాలను సహాయం పేరుతో మోసగించవద్దని చెప్పాడు. పైగా సోషలిస్టు దేశాలు ఉచితంగా ఆయుధాలు అందించాలని కూడా సూచించాడు. ఈ సమావేశం జరుగుతున్నప్పుడే అలైదాకు కుమారుడు పుట్టాడు. వానికి ఎర్నెస్తో పేరు పెట్టారు.

'చే' బృందం హవానాకు తిరిగి వచ్చింది. స్వాగతం చెప్పడానికి వచ్చిన ఫిదెల్ ముఖంలో అసంతృప్తి కనిపించింది. కారణం అడిగాడు 'చే'. ఆల్జీరియాలో 'చే' ప్రసంగాన్ని విమర్శించాడు ఫిదెల్. కొత్తసమస్యల్ని సృష్టిస్తున్నావన్నాడు. 'చే' ఏమాత్రం తొట్రుపాటు పడకుండా తాను నమ్ముతున్న రాజకీయ అభిప్రాయాలనే చెప్పానన్నాడు. స్వాగత కార్యక్రమం వాగ్వివాదాలతో ముగిసింది.

'చే' ఫిదెల్‌లు ఎంత సన్నిహితులైనా రాజకీయంగా వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. దేశ భద్రతకూ, అవసరాలకులోబడి అంతర్జాతీయ విధానం ఉండాలంటాడు ఫిదెల్. పరిమితుల మధ్య యిమిడి ఉండవలసిన మంత్రిగా ఉండడం 'చే' వ్యక్తిత్వానికి సరిపడదు. ప్రస్తుతం క్యూబాలో తాను నిర్వహిస్తున్న పనుల్నిఎవరైనా చూసుకోగలరనీ, తాను యితర దేశాలలో జరుగుతూన్న సాయుధపోరాటాల్లో పాల్గొనబోతున్నాననీ ఫిదెల్‌కి చెప్పాడు. ఫిదెల్ అంగీకరించలేదు. ఉద్యమాలు ఆశాజనకంగా లేవనీ, వేచిచూడడం మంచిదనీ సలహా యిచ్చాడు ఫిదెల్. కాని 'చే' నిర్ణయం మారలేదు. విప్లవ పరిస్థితులు వాటికవే పక్వస్థితికి రావనీ, ఉద్యమకారులిచ్చే ఉత్సాహమే శక్తివంతమైన ఉద్యమంగా మారుతుందనీ 'చే' వాదించాడు. క్యూబా ఉద్యమ ప్రారంభంలోనే 'చే' ఫిదెల్‌తో ఒక ఒప్పందం చేసుకున్నాడు. క్యూబా విముక్తి పొందే వరకూ తాను బ్రతికి ఉంటే, ఆ తరువాత అర్జెంటీనాకు వెళ్లి విప్లవ ఉద్యమాన్ని నిర్మించడానికి అభ్యంతరం పెట్టకూడదని ఆ ఒప్పందం. యవ్వనంలో ఉన్నంత కాలం సాయుధపోరాటంలోనే శక్తిని ఉపయోగించాలని 'చే' కోరుకునేవాడని

'చే' చనిపోయిన తరువాత ఫిదెల్ చెప్పాడు. ఆఫీసు కాగితాలలో, తలదూర్చి కూర్చుంటే కొరగాని వారమైపోతామనేవాడని కూడా చెప్పాడు.

తాను క్యూబన్ ప్రభుత్వం నుండి తప్పుకుని చక్కెర పరిశ్రమ గురించి అధ్యయనం చేయడానికి యింకొక దేశం వెళ్తున్నానని 'చే' తన తల్లి సెలియాకి లేఖరాశాడు. ఎవరికి యివ్వవలసినవి వాళ్లకి యిచ్చివేశాడు. మిత్రులందరితోను ఫోటోలు దిగాడు. మార్చి నెలలో మంత్రిత్వశాఖ సమావేశం జరిగింది. తాను పర్యటించిన దేశాలను గురించి 'చే' ఆ సమావేశంలో మాట్లాడాడు. చివరిగా తాను తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పాడు. అంతా ఆందోళన చెందారు. తమ శాఖలో సమర్థులున్నారనీ, పనులన్నీ సక్రమంగానే జరుగుతాయనీ వారికి నచ్చచెప్పాడు.

చేగెవారా చెరకు కోసే కత్తీ, వీపుకొక సంచీతో బయలుదేరాడు. అయితే కాంగోలోని విప్లవోద్యమంలో పని చెయ్యాలనే నిర్ణయం అప్పటికే తీసుకున్నాడు. పోర్చుగీసువలసలుగా ఉన్న దేశాలలో తిరుగుబాటు ఉద్యమాలు జరుగుతూ ఉన్నాయి. అన్నింటిలోకి కాంగో ఉద్యమం విజయం సాధిస్తుందని 'చే' నమ్మకం. రివాల్తా, దెకేలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. దెకే నిర్వహిస్తున్న దళానికి చేగెవారా కమాండర్‌గాను, దెకేడిప్యూటీ కమాండర్‌గాను ఉన్నారు. మార్చి 31న ఉస్మానీ సియెన్ ఫ్యూగాస్, ఫిదెల్ యిద్దరూ అక్కడికి వచ్చారు. ఫిదెల్ 'చే' తో మాట్లాడాడు. వెళ్లేటప్పుడు దెకేతోను, మార్తినెజ్‌తోను 'చే' ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు.

క్యూబా భవన నిర్మాణశాఖమంత్రి ఉస్మానీసియెన్ ఫ్యూగాస్ ముగ్గురు వ్యక్తుల్ని విమానాశ్రయానికి తీసుకుని వచ్చాడు. వారిలో రాబర్తోసాయెజ్ పేరుతో దెకే, రికార్డో పేరుతో మార్తినెజ్, మూడవ వ్యక్తి 'చే' ఇప్పుడతని పేరు రామోన్. ముగ్గురూ టాంజానియా రాజధాని దార్ ఎస్సలామ్‌కు చేరారు. రివాల్తా వాళ్లకి స్వాగతం పలికాడు. అతడు 'చే' ని గుర్తుపట్టలేకపోయాడు. అక్కడ కొంత వరకు 'చే' స్వాహిలీ భాషని నేర్చుకున్నాడు. ముగ్గురూ ఆ భాషలోకి పేర్లు మార్చుకున్నారు. దెకే పేరు మోజా (అంటే ఒకటి అని అర్థం), మార్తినెజ్ పేరు ఎమ్‌బిలీ (అంటే రెండు), తన పేరు టటూ (అంటే మూడు) అని మార్చుకున్నారు. పడవలో వెళ్లడానికి అవకాశం లేక చిన్న మోటారు పడవని సంపాదించారు. కాంగోలోనికి బాంబా అనే గ్రామం దగ్గర తీరం చేరారు.

కొంతమంది కాంగో తిరుగుబాటు దారులు వారిని కలిశారు. స్థానికంగా ఉన్న ఆదివాసీ నాయకులు కూడా వచ్చారు కాంగో విముక్తి కోసం పోరాటం చేస్తూన్న

ఉద్యమకారుల పద్ధతులు చాలా ఆశ్చర్యం కలిగించాయి 'చే'కి వారు కొన్ని మూలికలతో చేసిన ద్రవాన్ని శరీరానికి పూసుకుంటారు. దానివల్ల తుపాకీ గుళ్లు శరీరంలో దిగవని వారి నమ్మకం. మంత్రించిన బొగ్గు పొడితో నుదుటి మీద ఏవో సంకేతాలు రాసుకుంటారు. ఈ విధానం ఎంతవరకు వాళ్లని రక్షిస్తుందో 'చే'కి అర్థంకాలేదు. వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించినా వారు పట్టించుకోలేదు ఒకవేళ 'చే' బృందం యొక్క నాస్తికత్వమే వారి ఓటమికి కారణం అని నింద కూడా వేయవచ్చు.

అయినా వారిలో ఒక వంద మందిని ఎంపిక చేసి వారికి గెరిల్లా శిక్షణ ప్రారంభించాలి. కమాండర్‌గా ఎంపిక చేసిన వ్యక్తి ఏవో కారణాలు చెబుతూ స్థావరానికి రావడం లేదు. కాంగో గెరిల్లాలందరూ ఏవో పనులలో మునిగి ఉన్నారు. రోజులు వృథా అవుతున్నాయి. ఏదో పని చేయాలని వైద్యం మొదలుపెట్టాడు 'చే'. వచ్చిన రోగులందరూ సుఖవ్యాధులతో బాధపడుతున్నవారే.

స్త్రీలు కూడా అంతే. కిగోమా అనే గ్రామం వ్యభిచార కేంద్రంగా మారింది. 'చే' ఓర్పు నశించింది. పైగా ఆయుధాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. తుపాకి ఉంటే బుల్లెట్లుండవు. వాటిని ఉపయోగించడంలో కూడా ఒక పద్ధతి అంటూలేదు. నావల్లో దిగుమతి అయిన ఆహారాన్ని తీరంలో పారేస్తున్నారు. కాబట్టి వారికి క్రమశిక్షణ నేర్పాలనుకున్నాడు 'చే' శిక్షణా తరగతులు ప్రారంభించాడు.

సంతియాగోనుండి కొంతమంది క్యూబన్లుకి బాంబా స్థావరానికి వచ్చారు. వారితో పాటు కాంగో నాయకుడు లియొనార్డ్ మితౌదీదీ కూడా వచ్చాడు. లులువాబోర్డ్ పర్వత శిఖరం మీద శిక్షణా కేంద్రం ఏర్పాటయింది. చాలామంది పర్వతం ఎక్కుతూ గాయపడ్డారు. ఎత్తులో ఆక్సిజన్ తగ్గడం వల్ల 'చే' కి ఆస్తమా ఎక్కువయింది. ఈలోగా కాంగో ఉద్యమనాయకత్వం నుండి ఆల్బర్ట్‌విల్లే పట్టణాన్ని ముట్టడించమని ఆదేశం వచ్చింది. కాని యిక్కడ దళా గాయాలతో బాధపడుతున్నారు. నాయకత్వానికీ స్థానిక నాయకులకీ మధ్య పొంతనలేదు. నాయకులు పట్టణాలలో కూర్చుని ఆదేశాలు జారీచేస్తూ ఉంటారు. 'చే'కి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆహారం, మందులు లేకపోవడం వల్ల బాగా నీరసంగా ఉన్నాడు. ఆ సమయంలో అక్కడికి ఫ్యూగాస్ వచ్చాడు. 'చే' తల్లి సెలియా ఆరోగ్యం బాగులేదనీ, ఆమె కోమాలో ఉందనీ చెప్పాడు. మే 19 న ఆమె మరణించింది.

అదే సమయంలో యింకొక చెడువార్త వచ్చింది. తన మిత్రుడైన ఆల్జీరియా అధ్యక్షుడు అహ్మద్ బెల్లాకి వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటు జరిగింది. అతడు పదవిని కోల్పోయాడు.

ఇంతలో మరో చెడువార్త వచ్చింది. సరస్సుదాటుతు మితౌదీదీ సరస్సులో మునిగి చనిపోయాడు. వరుసగా యిన్ని ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడికి సమయంకాదని చెప్పినా వారు వినలేదు. శత్రువులనుండి ఎదురుదాడి మొదలవడంతో కాంగోదళం పారిపోయింది. ఓటమి పాలయ్యారు.

ఎలాంటి అధికారిక ప్రకటనా లేకుండా చేగెవారా క్యూబానుండి వచ్చేశారు. జర్నలిస్టులు రకరకాల కథనాలు సృష్టించారు. దేశాలు పర్యటిస్తున్నాడని కొందరూ, మెక్సికోలోని ఒక పిచ్చాసుపత్రిలో చూశామని కొందరూ, 'చే'ని ఎవరో హత్యచేసి లాస్‌వేగాస్‌లోని ఒక ఫ్యాక్టరీ ఆవరణలో పాతి పెట్టారని కొందరూ ప్రచారం చేశారు. ఫిదెల్‌కీ, 'చే' కీ శత్రుత్వం ఏర్పడిందనీ అందువల్ల కాస్ట్రో అతనిని హత్య చేయించాడనీ మరోవార్త, "చే" తండ్రి తన కుమారుని శవాన్ని అప్పగించమని కోరాడనీ ఫోటోలతో సహా ప్రచురించబడ్డాయి. 'చే' తండ్రి అవన్నీ అబద్ధాలు అని చెప్పినా, ఆ వార్త బయటికి రానీయలేదు. క్యూబన్ ప్రభుత్వరహస్యాల్ని చేగెవారా పదిమిలియన్ డాలర్లకు అమెరికాకు అమ్మివేశాడనీ, అది తెలియడంతో ఆత్మహత్యచేసుకున్నాడనీ యింకొక పత్రిక ప్రచురించింది.

ఇవన్నీ క్యూబన్ ప్రజల్ని ఆందోళనకు గురిచేశాయి. కొంతమంది జర్నలిస్టులు 'చే' గురించి ఫిదెల్‌ని అడిగారు. అతడు ఆరోగ్యంగానే ఉన్నాడు. తాను కోరుకున్నప్పుడు ఆ వివరాలు వెల్లడిస్తాడని ఫిదెల్ వారికి చెప్పాడు. ప్రజలకు నిజాలేమిటో వివరంగా తెలియదు. అక్టోబర్‌లో క్యూబన్ కమ్యూనిస్ట్‌పార్టీ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఫిదెల్ మాట్లాడాడు. 'చే' ప్రస్తుతం తమతో లేక పోవడం వల్ల చాలా వదంతులు వ్యాపించాయనీ, సమయం వచ్చినప్పుడు వాస్తవాలు తెలియజేస్తామనీ చెప్పి, తనకు 'చే' రాసిన లేఖని చదివి వినిపించాడు.

ఆ ఉత్తరంలో 'చే' తాను ఫిదెల్‌ని కలుసుకున్ననాటి నుండి విప్లవ మార్గంలో చేసిన ప్రయాణం గురించీ, తాను నిర్వహించిన బాధ్యతల గురించీ, చివరకు క్యూబాకు విముక్తి వచ్చిన తరువాత తాను రాజీనామా చేశాననీ, మిగిలిన బాధ్యతల్ని స్వీకరిస్తున్నాననీ ఉంది. దానిని విన్న ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

కాంగోలో పరిస్థితుల్ని తెలుసుకోడానికి ఎమిలో అరగోసెస్‌నీ; ఆస్కార్ ఫెర్నాండెజ్ మిల్‌నీ కాంగోకి పంపాడు ఫిదెల్. అక్కడ 'చే' ప్రయత్నాలు సఫలం కావడం లేదు. ల్యువెంబా పట్టణాన్ని ముట్టడించడానికి గెరిల్లాలు కందకాలు ఏర్పాటు చేస్తున్నారు. దానికి కాంగో కార్యకర్తలు అడ్డుతగిలారు. గుంటల్లో దూరితే అరిష్టాలు కలుగుతాయని వారి విశ్వాసం. 'చే'కి ఓర్పునశించింది. ఫెర్నాండెజ్ మిల్ 'చే'తో "క్యూబన్ ప్రజల్లో బతిస్తా ప్రభుత్వం మీద తీవ్రవ్యతిరేకత ఉండడం వల్ల విప్లవం విజయవంతమయింది. కాని యిక్కడ ఎవరిలోనూ కదలిక లేదు. ఎందుకు ఆశ పడుతున్నావో నాకు అర్థంకావడం లేదు." అన్నాడు కాని 'చే' బదులుగా తనకు ఎవరి సహాయం అక్కర్లేదనీ, శక్తివంచన లేకుండా పనిచేయడం విప్లవ కారునిగా తన బాధ్యత అనీ, తన నిజాయితీని నమ్మితే చాలనీ చెప్పాడు. ప్రజలలో ఆసక్తి లేనప్పుడు ఏదేశమూ విముక్తి పొందలేదు అని ఫిదెల్‌కి ఉత్తరం రాశాడు.

కాంగో అధ్యక్షుడు మెయిస్‌షోంబో మీద సైనిక తిరుగుబాటు జరిగింది. జోసెఫ్ కసవుబూ పదవిలోకి వచ్చాడు. తిరుగుబాటు ఉద్యమాల్ని అణచివేయడానికి ప్రణాళికను వేసింది కొత్త ప్రభుత్వం. క్యూబన్ గెరిల్లాలు, 'చే' కలిసి ప్రజల్ని రెచ్చగొడుతున్నారనీ, కాంగో ప్రభుత్వం ప్రచారం మొదలుపెట్టింది. తమ అంతర్గత విషయాల్లో విదేశీయుల జోక్యం ఉండకూడదని తీర్మానం చేసింది. క్యూబన్ గెరిల్లాలను వెనక్కి పొమ్మని ఆదేశించింది. కాంగో ప్రజలు కోరితే తప్ప వెనక్కి వెళ్లమని 'చే' చెప్పాడు. కాని రాను రాను పరిస్థితులు విషమించాయి. కాంగో మీద వైమానిక దాడులు ప్రారంభమయ్యాయి. కాంగో తిరుగుబాటు సేనలు ఆత్మరక్షణ ప్రయత్నాలు మొదలు పెట్టాయి. కాంగోల గెరిల్లా నాయకుడు 'చే'తో చర్చించాడు. పోరాటం సాగించడం కష్టమనీ, తమకు సాయం చేసినందుకు కృతజ్ఞతలనీ చెప్పాడు. క్యూబన్ కార్యకర్తలు స్త్రీలనూ, పిల్లల్నీ కిగామాకి చేర్చారు. 1965 నవంబరులో కాంగో పోరాటాన్ని విరమిస్తున్నట్లుగా ఉద్యమ నాయకులు ప్రకటించారు.

కాంగో తూర్పు ప్రాంతంలో తిరుగుబాటు ఉద్యమం జరుగుతున్నదని తెలిసి 'చే' అక్కడికి బయలుదేరాడు. కొందరు క్యూబన్ గెరిల్లాలు అతని వెంటవెళ్లడానికి సిద్ధపడ్డారు. అడవి మార్గంలో 600 మైళ్లు నడిచివెళ్లారు.

ఆ సమయంలో ఫిదెల్ 'చే'కి ఉత్తరం రాశాడు. పరిస్థితులు బాగోలేనప్పుడు యింకొక తిరుగుబాటుకి సిద్ధమవడం తెలివితక్కువతనం. కాబట్టి తిరిగిరమ్మని ఆ లేఖ సారాంశం.

ఆ ఉత్తరం వచ్చిన దగ్గరనుండి క్యూబన్లు ముందుకి సాగడానికి సందేహిస్తున్నారు. ఏం చెయ్యాలో 'చే'కి పాలు పోవడం లేదు. క్యూబన్లు, కాంగోనుండి తిరిగి వెళ్లిపోయారు. చే, మార్తినెజ్ మొదలైనవారు దారుస్సలామ్‌కి చేరారు. వారు క్యూబన్ రాయబార కార్యాలయంలో రహస్యంగా విడిదిచేశారు. కాంగో అనుభవాల్ని గురించి నోట్సు తయారుచేసుకున్నాడు 'చే' అదొక వైఫల్యాల గాథగా చిత్రీకరించుకుని, తనకుతానే ఆత్మ విమర్శచేసుకున్నాడు.

అనారోగ్యంతో ఉన్న 'చే' వద్దకు రహస్యంగా అలైదాని తీసుకుని వచ్చారు. 'చే' కొంత స్తిమిత పడ్డాడు. కొన్నాళ్ల తరువాత అలైదాకు వీడ్కోలు చెప్పి టాంజానియా నుండి బయలుదేరాడు. మారువేషంతో యూరప్ చేరుకున్నాడు. అసంపూర్తిగా ఆగిపోయిన లాటిన్ అమెరికా సంపూర్ణ విముక్తి తిరిగి కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. కార్యాచరణ పెరూలో మొదలుపెట్టాలనుకున్నాడు. పెరూలోని నేషనల్ లిబరేషన్ ఆర్మీ ఉద్యమం మళ్లీప్రారంభమయింది. ఆ ఉద్యమంలో 'చే', మరికొందరు క్యూబన్లు ఉద్యమంలో పనిచేయాలనుకున్నారు. కాని కొంతమంది శత్రువులు కార్యకర్తలుగా ప్రవేశించారు. వారిని సకాలంలో గుర్తించలేకపోయారు. అందువల్ల పెరూలో ఉద్యమాన్ని వాయిదావేశారు.

1964 లోనే 'చే' బొలీవియాలోని రాడికల్ కమ్యూనిస్ట్ నాయకునితో చర్చించారు. 1965 లో బొలీవియా కమ్యూనిస్టు పార్టీ సభ్యులైన కొందరు యువకులు హవానాకి వచ్చి యూనివర్సిటీ విద్యార్థులుగా చేరారు. వాళ్లు క్యూబాలో సాయుధ శిక్షణ పొందారు. పెరూలో ఉద్యమం వాయిదా పడగానే బొలీవియాలో ఉద్యమాన్ని ప్రారంభించాలను కున్నాడు. 'చే' కాని అది సాహసమేనని ఫిదెల్ చెప్పాడు. కాని 'చే' అభిప్రాయం వేరుగా ఉంది. పరిస్థితులు అనుకూలంగా లేవని వాయిదా వేయకూడదన్నాడు. ఉద్యమం మొదలు పెడితే ప్రజలు చైతన్యవంతులవు తారంటాడు. వాళ్లని విప్లవానికి సిద్ధం చేయాలి.

బొలీవియాలో చాలా విలువైన ఖనిజ సంపద ఉంది. వాటి మీద పెత్తనం అమెరికాది. 1958 నుండి అమెరికా బొలీవియాల మధ్య "మిలిటరీ అసిస్టెన్స్ ప్రోగ్రాం" ఉంది. అంటే **U.S.** నుండి సైనిక సహాయం అందుతూ ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్ని **U.S.** సైన్యం అణచి వేస్తుంది. అన్ని వనరులున్నా బొలీవియా ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారు. కాబట్టి అక్కడ ఉన్న రైతులూ, కార్మికులూ విప్లవానికి సులభంగా సిద్ధమవుతారనుకున్నాడు 'చే', కాబట్టి ఫిదెల్ సలహాని ప్రక్కకు పెట్టి బొలీవియాలో ఉద్యమానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

# 11. మరోసారి బొలీవియాకి

బొలీవియాలో తానియా అనే మహిళా కార్యకర్త 'చే' బృందం బొలీవియాలో అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసింది.

తానియా అసలు పేరు తమారా, ఆమె తల్లిదండ్రులు జర్మనీ దేశస్తులు. వారు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు. నాజీల హింస ఎక్కువకావడంతో వారు అర్జెంటీనా వలసవెళ్లారు. తిరిగి 1952 లో జర్మనీకి వెళ్లారు. చదువుకుంటున్నప్పుడే లాటిన్ అమెరికా విప్లవోద్యమాల్ని గురించి తెలుసుకుంటూ ఉండేది. తాను కూడా ఆ ఉద్యమాలలో పాల్గొనాలనుకునేది.

క్యూబా విప్లవం విజయవంతమైనందుకు చాలా సంతోషించింది. 'చే' క్యూబన్ ప్రతినిధిగా జర్మనీకి వెళ్లినప్పుడు అతనిని కలిసింది. అతని వ్యక్తిత్వం ఆమె మీద బలమైన ముద్రవేసింది. క్యూబాకి వెళ్లి హవానాలో జర్నలిజం కోర్సు చదువుతున్నప్పుడు తరుచుగా 'చే' తో మాట్లాడుతూ ఉండేది. నికరాగువాలోని గెరిల్లా పోరాటానికి సంఘీభావంగా హవానాలో ఏర్పాటయిన ఉద్యమంలో తాను పాల్గొంది. లాటిన్ అమెరికా విముక్తి కోసం ప్రారంభించిన ఉద్యమంలో రహస్య కార్యకర్తగా పనిచేయడానికి తగిన శిక్షణ తీసుకుంది. అప్పుడు తానియాగా పేరు మార్చుకుంది. మారువేషాలతో సమాచారం సేకరించేది.

బొలీవియాకి రహస్యంగా వెళ్లి రహస్యసమాచారాన్ని సేకరించవలసిన బాధ్యతని ఆమెకు అప్పగించాడు, 'చే' లారా గ్యుతరెజ్ బాయర్ అనే మారుపేరుతో నకిలీ పాస్‌పోర్టును సంపాదించింది. బొలీవియా రాజధాని అయిన లాపాజ్‌కు చేరింది. ఉన్నతాధికారులతో పరిచయాలు సంపాదించింది. ఉద్యోగం కూడా సంపాదించింది. ఆ దేశంలో తన స్థానాన్ని స్థిరపరుచుకోడానికి మారియో మార్తినెజ్ అల్వారెజ్ అనే విద్యార్థిని వివాహం చేసుకుంది. బొలీవియా పౌరసత్వాన్ని సాధించింది.

బొలీవియా అధ్యక్షుడు జనరల్ బారియెంతో పరిచయం అయ్యాడు. ప్రభుత్వ సమాచారాన్ని సులభంగా సేకరించగలిగింది. ఆ సమాచారాన్ని క్యూబాకి చేరవేసేది. తరువాత హొసే మోన్లియాన్ అనే క్యూబా ప్రభుత్వ గూఢచారి ఆమెను కలిశాడు. వారితో సియెర్రా కార్యకర్త మార్తినెజ్ కలిశాడు. అతడు మారుపేరుతో బొలీవియాతో వ్యాపారం చేయడానికి ప్రభుత్వ అనుమతి కూడా పొందాడు. అక్కడ ఉద్యమానికి తగిన ఏర్పాట్లు సిద్ధం చేశాడు. తానియా కూడా రహస్యస్థావరాల్ని ఏర్పాటు చేసే పనిలో ఉంది.

అందరూ కలిసి బొలీవియా, అర్జెంటీనా సరిహద్దుల్లో ఒక యిల్లు సంపాదించారు. చుట్టూ దట్టమైన అడవులు. జన సంచారం తక్కువ.

---

1966 జులైలో రామోన్‌బెనితెజ్ అనే ఉరుగ్వేదేశీయుడు హవానాకి వచ్చాడు. అతడే 'చే', అతనితో పాటు ఆల్బర్టో ఫెర్నాండెజ్ మాంతెస్ దఓకా కూడా ఉన్నాడు. 'చే' నేరుగా ఆల్తోబెనీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరానికి వెళ్లాడు. ఫిదెల్ అక్కడ 'చే' ను కలిశాడు. ఉద్యమాన్ని వాయిదా వేయమని చెప్పాడు. కాని 'చే' దానికి అంగీకరించలేదు. క్యూబన్ ఉద్యమ కాలంనుండి యువతరంలో 'చే' కి గుర్తింపు ఉంది. అందువల్ల ఉద్యమానికి కార్యకర్తల్ని ఏర్పాటు చేయడం 'చే' కి కష్టమైన పనికాదు. అక్టోబరు 22 కి శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయి.

హవానాశివార్లలోని ఒక ప్రాంతంలో అలైదాను, పిల్లల్నీ మారు వేషంలో కలుసుకున్నాడు 'చే'. కాని ఆరు సంవత్సరాలు వయసున్న అలైదా తండ్రిని గుర్తు పట్టింది.

బొలీవియాలో ఉన్న మార్తినెజ్‌కి 'చే' ఒక సందేశం పంపాడు. అక్కడ ఉన్న కమ్యూనిస్టు కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరుచుకోమని చెప్పాడు. పెరూంలోని యిరవైమంది కార్యకర్తలు 'చే' బృందంతో పని చేయడానికి బొలీవియా వచ్చారు. మోంజే అనే నాయకుడు సాయుధపోరాటానికి సిద్ధపడడంలేదు. మాట్లాడితే అతడు వివాదాలకు దిగుతున్నాడు. 'చే' క్యూబానుండి రెండవసారి బయటికి వెళ్లాడు. ఫిదెల్ అతనికి విందు యిచ్చాడు. మారువేషంలో ఉన్న చేగెవారాని ఎవరూ గుర్తు పట్టలేకపోయారు. ఫిదెల్, చే లు ఫోటోదిగారు. అదే వారిద్దరూ కలిసిదిగిన ఆఖరిఫోటో.

---

1966 నవంబరులో 'చే' లాపాజ్‌లోని ఒక హొటల్లో దిగాడు. ఇదివరకటికీ, యిప్పటికీ బొలీవియాలో ఏ భేదమూ కనపడలేదు. నియంతలూ, దోపిడీలూ యథాతథంగానే ఉన్నాయి. బానిసత్వం, దారిద్ర్యంలో మగ్గుతున్న వారినందరినీ సమీకరించి, గెరిల్లా పోరాటం చేయవచ్చుననుకున్నాడు. తానియా మొదలైన వారితో ఉద్యమం నిర్మించడం గురించి చర్చించాడు. అప్పటికింకా ప్రణాళిక తయారుకాలేదు. గెరిల్లా శిక్షణ పొందివచ్చిన వారు, తమాయో, విల్లెగాస్ మొదలైనవారందరూ కెలామినా స్థావరానికి చేరుకున్నారు. అక్కడ ఒక గుడిసెలో ఉంటూ, చుట్టు పక్కల మందు పాతరలు ఏర్పాటు చేయడానికి అవకాశాలు చూస్తున్నాడు. అందరూ రైతుల వేషాలలో ఉన్నారు.

క్యూబా నుండి యింకా కొంతమంది కార్యకర్తలు రావలసి ఉంది. అయినా కాలాన్ని వృథా చేయకుండా ఒక సొరంగాన్ని తవ్వారు. ఆ సొరంగం ఆహారం, మందులు, మొదలైన నిత్యావసరాలు దాచుకోడానికి అనువుగా ఉంది. ఆయుధాలు కూడా గెరిల్లాలకు సరఫరా అవుతున్నాయి. అన్ని విషయాలూ ఎప్పటికప్పుడు 'చే' ఫిదెల్‌కు తెలియజేస్తూనే ఉన్నాడు.

కెలామినా స్థావరానికి కొత్త వ్యక్తుల రాకపోకల్ని అల్గరెనాజ్ అనే భూస్వామి చూశాడు. అతడు విషయం ఏమిటో తెలుసుకునిరమ్మని తన పనిమనుష్యుల్ని పంపాడు. వారికి ఒక కొకైన్ ఫ్యాక్టరీని పెడుతున్నామని చెప్పారు. అయితే తాను కూడా ఆ ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడతానన్నాడు. ఇక ఆ స్థావరంలో ఉండడం ప్రమాదమని యింకొక స్థావరం కోసం వెదకటం ప్రారంభించారు. ఒక కొత్త స్థావరాన్ని కనుగొన్నారు. కార్యకర్తలందరూ అక్కడికి చేరారు. డిసెంబరులో క్యూబానుండి మరికొందరు కార్యకర్తలు వచ్చి చేరారు.

పోరాటానికి మోంజే అడ్డు తగులుతున్నాడు. మిలిటరీ వ్యవహారాలన్నీ తానే చూస్తానన్నాడు 'చే'. దానితో మోంజే అహం దెబ్బతింది. కార్యకర్తలందరినీ కలుసుకుని తమ దేశ విముక్తి కోసం విదేశీయుడు నాయకుడుగా ఉండడం తనకు యిష్టం లేదనీ, తనతో తిరిగివస్తే కార్యకర్తలందరికీ చాలా సౌకర్యాలు కల్పిస్తానని ప్రలోభపెట్టాడు. కాని బొలీలియా గెరిల్లాలు అతనికి ఎదురు తిరిగారు. మొదట పట్టణాలలో పోరాటం ప్రారంభించి, తరువాత గ్రామాలలో పోరాటం చేద్దామని ప్రతిపాదించాడు మోంజే. కొంతమంది గెరిల్లాలు పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి ఉత్సాహం చూపలేదు.

స్థావరంలో శిక్షణ జరుగుతుంది. అంతారహస్యంగా ఉండాలనీ, ఎవరూ బయట పడకూడదనీ హెచ్చరించాడు. 'చే'. నిర్లక్ష్యంగా ఉండేవారితో స్వయంగా మాట్లాడాడు. క్రమశిక్షణ ముఖ్యమని చెప్పాడు. మోంజే ఒకవైపు గెరిల్లాలతో పనిచేస్తానంటూనే వ్యతిరేక ప్రచారం చేయడం ప్రారంభించాడు. ఆ విషయం తెలిసి అతని పార్టీతో సంబంధం వదులుకున్నాడు 'చే'.

---

1967 జనవరి నాటికి గెరిల్లాలకు ఆహార కొరత ఏర్పడింది. పైగా మలేరియా వ్యాపించింది. కార్యకర్తలు మానసికంగా, భౌతికంగా బాధపడుతున్నారు. అల్గరెనాజ్ భూస్వామి కొకైన్ ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడతానంటూ కొత్త స్థావరం వద్దకు కొంతమందిని వెంట బెట్టుకుని వచ్చాడు. ఆ వచ్చిన కొత్తవాళ్లలో పోలీసులున్నారని వియానా గుర్తు పట్టి కెలామినాలో ఉన్న 'చే' కి వర్తమానం పంపాడు. ఆ భూస్వామిని వదిలించు కోవడం సాధ్యపడడం లేదు.

మొయిసెస్ గెవారా తన గెరిల్లాలను ఉద్యమంలో చేర్చుతానన్నాడు. లయోలా గజ్‌మన్ అనే స్త్రీ యీ ఉద్యమంలో చేరింది. పట్టణ ప్రాంత దళంలో ఆమెను పనిచేయమని చెప్పాడు 'చే'. శిక్షణ ముగించుకున్న గెరిల్లాలు ఆ స్థావరం నుండి బయలుదేరారు. ఫిబ్రవరి నెలలో గెరిల్లాలు నాన్‌కావాచూ నదీతీరం వెంబడి సాగుతూ ఉండగా పెద్ద వర్షం వచ్చింది. తీరం అంతా బురదమయం అయిపోయింది. వారికి దారికూడా సరిగా తెలియదు. చివరికి జోర్డాన్ నది వద్దకు చేరారు. నదిలో నీరు గట్లపైకి ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. వారు ఒక చిన్న తెప్పని తయారు చేసి రెండు రోజులకు ఆ నదిని దాటగలి గారు. అక్కడి నుండి నడక ప్రారంభించారు. ఆహారం అయిపోతూంది. గెరిల్లాలు నీరసించిపోతున్నారు. శుభ్రమైన నీరు కూడాదొరకడం లేదు. ఆ మార్గంలో సైనిక శిబిరాలు ఉన్నాయని తెలిసి దారి మార్చారు.

వారు రియోగ్రాండే నదివద్దకు చేరారు. నదిపొంగి పొరలుతూంది. చిన్న తెప్ప చేసుకుని దాటారు. ఆహారం దొరకకపోవడంవల్ల కోతుల్నీ, పక్షుల్నీ వేటాడి తింటున్నారు. పైగా భారీగా వర్షాలు పడుతున్నాయి. అడవిని దాటుతూ ఉండగా ఒకరాత్రి పినారెస్ తప్పి పోయాడు. అంటే తన సహచరుల కోసం వెతుకుతూ ఓ గ్రామంలోకి వెళ్లాడు. అక్కడ సైనికులున్నారు.

ఎవరో కొత్తవారు వచ్చినట్లు వారు పసిగట్టారు. పైగా గెరిల్లా దళాల్లో అంతర్గత సమస్యలు ప్రారంభమయ్యాయి. మొయిసెస్ గెవారా ద్వారా కొంతమంది గెరిల్లా దళంలో చేరారు. వారిలో కొంతమంది నిలకడ లేనివాళ్ళున్నారు. వాళ్లు సమస్యల్ని తెచ్చి పెడుతున్నారు. వాళ్లని బహిష్కరించారు. వాళ్లు బొలీలియన్ పోలీసులకి గెరిల్లాల వివరాలన్నీ చెప్పేశారు. వెంటనే సైనికులు కాలామినాపై దాడి చేశారు. కొంతమంది బొలీవియన్ కార్యకర్తలు వారికి దొరికిపోయారు. దాడిజరిగిందని తెలిసిన వెంటనే ప్రధాన స్థావరంలో ఉన్న గెరిల్లాలు కూడా అక్కడనుండి వెళ్లిపోయారు. 'చే' బృందానికి కూడా యీ దాడి గురించి తెలిసింది. మార్చినాటికి గెరిల్లా బృందాలన్నీ ఒకచోటికి చేరుకున్నాయి. ప్రత్యక్షపోరాటానికి ప్రణాళిక తయారుచేశారు.

'చే' నాయకత్వంలోని గెరిల్లా ఉద్యమానికి "బొలీవియన్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ" అనే పేరు పెట్టారు. మొత్తం సభ్యులు 51 మంది ఉన్నారు. వారిలో క్యూబన్లు, బొలీవియన్లు, పెరూవియన్లు ఉన్నారు. మహిళాగెరిల్లా తానియా మాత్రమే. ఈ సభ్యులలో కొంతమంది చనిపోగా, ప్రస్తుతం 46 మంది మిగిలారు. వారిని పోరాటానికి సిద్ధంచేశాడు 'చే'.

నదికి రెండు వైపులనుండీ వచ్చి స్థావరాన్ని చుట్టుముట్టాలనుకున్నారు బొలీవియన్ సైనికులు. శత్రువులు దగ్గరకు రాగానే మెరుపు దాడి చేసింది గెరిల్లా బృందం. బొలీవియన్ సైనికులు యీ దాడిని ఊహించలేదు. వారిలో ఏడుగురు చనిపోయారు. ఇద్దరు బందీలుగా గెరిల్లాలకు దొరికిపోయారు. మొత్తం మీద యీ పోరాటంలో గెరిల్లాలు ఎవరూగాయ పడలేదు. అయితే కొంతమంది నిర్లక్ష్యంగా ఉండడాన్ని గమనించాడు 'చే'. అందర్నీ తీవ్రంగా హెచ్చరించాడు. మోంజే పద్ధతిలో ఎలాంటి మార్పురాలేదు.

కాలామినాలోని గెరిల్లాలు మాదకద్రవ్యాల వ్యాపారం చేస్తున్నారనుకుని అల్గారెనాజ్ వారిని పోలీసుల వద్దకు తీసుకునివెళ్లాడు. పోలీసులు అతన్ని అరెస్టుచేశారు.

బొలీవియన్ సైనికులకు ఎదురుదెబ్బ తగలగానే వారు అమెరికా సహాయాన్ని కోరారు. అమెరికా ఆయుధాల్నీ,సైనికుల్నీ వారికి సహాయంగా పంపింది. వారు గెరిల్లాల మీద నిఘా పెట్టారు. ఉద్యమానికి సంబంధించిన కొన్ని రహస్యాలు వారికి తెలిశాయి. దేశాధ్యక్షునితోను, ప్రభుత్వాధికారులతోను సన్నిహితంగా ఉండే తానియా ఒక గెరిల్లా అనే సంగతి తెలియగానే వారిలో సంచలనం కలిగింది. రహస్యాలు దొరికినందువల్ల గెరిల్లా స్థావరాల గురించి సైనికులకు తెలిసిపోయింది. ఆ ప్రాంతాలకి ప్రభుత్వం రెండు వేల మంది సైనికుల్ని పంపింది. యు.ఎస్. విమానాలు కూడా ఆయుధాలతో సాంతాక్రుజ్ చేరాయి. మిలిటరీ దళానికి గెరిల్లాల స్థావరాలు కనపడ్డాయి. కొన్ని ఫోటోలు కూడా దొరికాయి. వాటిలో చేగెవారా ఫోటోలు కూడా ఉన్నాయి.

సైన్యం చిన్న చిన్న గ్రూపులుగా విడిపోయి గెరిల్లాలను వేటాడడం మొదలుపెట్టింది. వారిలో ఒక గ్రూపుకి గెరిల్లాలు ఎదురుపడ్డారు. కాల్పులు జరిగాయి. ఒక సైనికుడు చనిపోయాడు. ముగ్గురుగాయపడ్డారు. ఆరుగురు బందీలయ్యారు ఇద్దరు గెరిల్లాలు చనిపోయారు. మేజర్ సాంచెజ్ గెరిల్లాలకు పట్టుబడ్డాడు. అయినా అతని ధైర్యసాహసాలకు 'చే' మెచ్చుకుని అతనిని విడిచిపెట్టాడు.

మళ్లీ గెరిల్లాలు ప్రయాణానికి సిద్ధమయ్యారు. అప్పటికే తానియాకి, ఒక క్యూబన్ కార్యకర్తకి తీవ్రంగా జ్వరంతో బాధపడుతున్నారు. అక్కడ గెరిల్లాలు ఆగాలనుకున్నా, యూరోపియన్ దేశాల ఉద్యమకారులసహాయం పొందడానికి ఒక ఉద్యమాన్ని నిర్మించడంలో నిమగ్నమైఉన్నాడు. 'చే'. అందువల్ల దళాన్ని రెండుగా విభజించి, ఒక దళాన్ని తానియాకు భద్రతగా ఉంచి, వెళ్లాలనుకున్నాడు. ఆ దళంలో పదిమంది సభ్యులున్నారు. మిగిలిన ముప్పయిమూడుమంది 'చే' రెండవ దళంలో ఉన్నారు. 'చే' దళం ఏప్రిల్ చివరలో తపరిల్లాస్ అనే ప్రాంతానికి చేరింది.

గెరిల్లాలను నిర్మూలించడమే కాదు. వారి మీద ప్రజల్లో వ్యతిరేకతని సృష్టించాలనుకుంది ప్రభుత్వం. ఆ విధంగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. బొలీవియా ప్రజలకి బయట ప్రపంచం గురించి గాని, రాజకీయాల గురించి గాని అంతగా తెలియదు. కొత్త వ్యక్తుల్ని చూస్తే భయపడతారు. పైగా వారి అధ్యక్షుడు ప్రజల్ని మభ్యపెట్టడంలో నిపుణుడు. ఒకవైపు అమెరికన్లకు దేశంలోని వనరుల్ని కట్టబెడుతూనే యింకోవైపు "జాతీయత" అనే పదాన్ని వాడుతూ ఉంటాడు. విద్యావంతులు అధ్యక్షుని ఎత్తుగడలు తెలుసుకున్నా, ప్రజలు గుర్తించలేదు. ఇటువంటి ప్రజల్ని గెరిల్లాలకు వ్యతిరేకంగా చెయ్యడం కష్టం కాదు. 'చే' ఓపిగ్గా రైతులతో పరిచయాలు చేసుకుని తన విధానాన్ని వారికి తెలియజేసి మార్పుతెచ్చాడు. ప్రభుత్వం ప్రజల మీద దాడులకు పూనుకుంది. ప్రజల్ని అరెస్టుచేసింది. ఆ బాధలకి తట్టుకోలేక గెరిల్లాల సమాచారాన్ని సైనికులకు యిస్తున్నారు.

ఒకసారి 'చే' బృందం అడవిలో ప్రయాణం చేస్తూఉండగా ఒక వ్యక్తి దొరికాడు. అతడు ఇంగ్లాండు జర్నలిస్టు. అతని నుండి వివరాలు సేకరించగా తాను 'చే' ఆచూకీని తెలుసుకోడానికి వచ్చినట్లుగా అంగీకరించాడు. 'చే' అతనిని విడిచిపెట్టాడు. అతడు వెళ్లిపోతూఉండగా పోలీసులు ఎదురు పడ్డారు. అతనిని బంధించి తీసుకుని వెళ్లారు.

గెరిల్లాలను అణిచివేయడానికి ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేస్తూంది. అమెరికా నుండి ఒక విమానం మందుగుండు సామాను, సాయుధ సైనికులతో బొలీవియా వచ్చింది. అమెరికన్ జనరల్ విలియం టోపే కూడా వచ్చాడు. అందరూ బలమైన వ్యూహాన్ని తయారు చేయాలనుకున్నారు. ఎందుకంటే అంత తేలిగ్గా గెరిల్లాలను అంచనా వేయకూడదని భావించింది. ఉద్యమం వెనక 'చే' పాత్రఉందని నిర్ధారణ అయింది. కాని బొలీవియా సైన్యంతో జరిగిన ఎదురు కాల్పులలో 'చే' మరణించాడనుకున్నారు.

చాలామంది బొలీవియన్ సైనికులతో మాంచెగోరెజిమెంటు తయారయింది. వారికి యు.ఎస్. అధికారులు శిక్షణయిస్తున్నారు. అమెరికా మరికొన్ని యుద్ధవిమానాల్ని కూడా పంపింది.

బ్రిటిష్ జర్నలిస్ట్‌తో పాటు యింకొక యిద్దరిని కూడా సైనికులు బంధించి వారిని చంపాలనుకున్నారు. కాని ఒక పత్రికావిలేఖరి వారిని కలుసుకుని, రహస్యంగా వారిని ఫోటోలు తీశాడు. వాటిని ప్రభుత్వం బంధించినట్లుగా తెలియజేశాడు. అందువల్ల ప్రభుత్వం వారిని చంపాలనే అభిప్రాయాన్ని మార్చుకుంది. అయినా వారిని చిత్రహింసలు పెట్టింది. కాని వారు 'చే' గురించి ఎటువంటి సమాచారాన్ని బయటపెట్టలేదు. కాని ఆ ముగ్గురిలో ఒకరు నాన్‌కవాచూవద్ద ఒక స్థావరం ఉందనీ, అక్కడ కొంతమంది క్యూబన్

గెరిల్లాలున్నారనీ చెప్పాడు. ఆ సమాచారం ప్రభుత్వానికి ముందే తెలుసు. కాబట్టి కొత్తగా ప్రయోజనం కలగలేదు. అయినా ప్రభుత్వం ఆ ముగ్గుర్నీ చిత్రహింసలకు గురిచేసింది తట్టుకోలేక 'చే' బొలీవియాలో ఉన్నాడని చెప్పారు. వారిద్దర్నీ జైలులో పెట్టారు. బ్రిటిష్ జర్నలిస్టుకి గెరిల్లాలగురించి ఏమీ తెలియదని నమ్మి అతనిని విడిచిపెట్టారు.

# 12. బొలీవియా యుద్ధం

1967, మే 1వ తేదీ హవానాలో మేడే ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ వేడుకలకు క్యూబా ప్రభుత్వం ఒక విశిష్టవ్యక్తిని ఆహ్వానించింది. ఆ వ్యక్తి ఎవరోకాదు 'చే' కుమార్తె అలైదా. ఆమె రాగానే ప్రజలందరూ హర్షధ్వానాలు చేశారు. అదే రోజున బొలీవియాలో కూడా మేడే ఉత్సవాలు జరిగాయి. అక్కడ కూడా ఒక విశేషం జరిగింది. మేజర్ సాంచెజ్‌ని గెరిల్లాలు విడిచి పెట్టినప్పుడు 'చే' అతనికి ఒక కాగితం యిచ్చి దానిని ప్రతిక ద్వారా ప్రకటన చేయించమన్నాడు. అతడు దానిని పత్రికకు యిచ్చాడు. మేడే ఉత్సవానికి హాజరయిన వారంతా ఆ పత్రికను కొని చదివారు. ఆ విషయం తెలిసి సైనికాధికారులు ఆ పత్రికలను స్వాధీనం చేసుకుని దాని సంపాదకుని అరెస్టుచేశారు.

అప్పటికే గెరిల్లా ఉద్యమం కార్మికుల్లోను, విద్యార్థులలోను ఉత్సాహాన్ని కలగజేసింది. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం చాలామందిని. అరెస్టు చేసింది. అటువంటి సమయంలో 'చే' యిచ్చిన పిలుపు ప్రభుత్వానికి ఆందోళన కలిగించింది.

'చే' బృందం స్థావరం ఉన్న ప్రాంతాన్ని చేరుతూన్న సమయంలో బొలీవియన్ సైనికులు ఎదురుపడ్డారు. వారి మధ్య కాల్పులు జరిగాయి. బొలీవియన్ సైనికులలో ముగ్గురు చనిపోయారు. ఆరుగురుదొరికారు. మిగిలిన వారు పారిపోయారు. చనిపోయిన వారిలో ఒక లెఫ్టినెంట్ కూడా ఉన్నాడు. అతని జేబులో ఒక ఉత్తరం దొరికింది. అది అతని భార్య రాసింది. అందులో తమగదిలో అలంకరించడానికి ఒక గెరిల్లా పుర్రెని పట్టుకురమ్మని ఉంది. గెరిల్లాలు బందీలను చంపబోగా వారు సాధారణ ఉద్యోగులే కాబట్టి వారిని విడిచిపెట్టమని చెప్పాడు.

'చే' బృందం తన స్థావరానికి వెళ్లే మార్గాన్ని గుర్తు పట్టలేకపోయింది. ఆహారం, నిద్రా లేక పోవడం వల్ల నీరసించిపోయింది. పైగా అక్కడి ప్రజలతో సాన్నిహిత్యం కూడా లేదు. కాని కొందరు రైతులు బొలీవియన్ సేనలు ఆ పరిసరాల్లో ఉన్నాయని గెరిల్లాలకు

సమాచారం అందించారు. సైన్యం ప్రజలమీద దాడి చేసిన ఆనవాళ్ళు అక్కడ కనపడు తున్నాయి. 'చే' కి వాటిని చూసి దుఃఖమూ, కోపమూ కూడా వచ్చాయి. 'చే' బ్రతికి ఉన్నాడనే నిర్ధారణకు ప్రభుత్వం వచ్చింది కాని కొంతమంది అధికారులు ఆ విషయాన్ని నమ్మలేదు. అందువల్ల వాస్తవాన్ని తెలుసుకోడానికి ఏరియల్ సర్వే ప్రారంభించింది.

మార్గమధ్యంలో ఒక రైతు కుటుంబం కనిపించింది. వాళ్లదగ్గర ఒక పందిని కొనుక్కుని అక్కడే వండుకుని తిన్నారు. కాని అది అరగక అందరికీ వాంతులు మొదలయ్యాయి. 'చే' పరిస్థితి యింకా దారుణంగా ఉంది. అంతకు ముందు నుండే అతడు ఆస్తమాతో బాధపడుతున్నాడు. మొత్తం మీద అక్కడ నుండి పిరిరెందా సరస్సువద్దకు చేరారు. అక్కడ కోలుకునే వరకూ విశ్రాంతి తీసుకోవాలనుకున్నారు. అంతలో పై నుండి బాంబుల వర్షం కురిసింది. పైన యుద్ధ విమానాలు తిరుగుతున్నాయి. అందరూ పరుగెత్తి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. 'చే' స్పృహతప్పిపడిపోయాడు. మిగిలినవారు అతనిని మోసుకుంటూ నడిచారు. ఒక గంటవరకూ అతనికి స్పృహరాలేదు. స్పృహరాగానే నడిచి ఒక వాగువద్దకు చేరాడు. అక్కడ స్నానం చేసి, బట్టలు ఉతుక్కుని మళ్లీ బయలుదేరాడు.

మే 16 న 'చే' బృందానికి రేడియో ద్వారా హవానానుండి ఒక రిపోర్టు అందింది. దానిలో క్యూబా నుండి సహాయం అందే అవకాశాలు లేవని అర్థమయింది. అదే సమయంలో వియాన్నా పోలీసుల నుండి తప్పించుకున్నాడనే వార్త తెలిసింది. అతడు అర్బన్ కార్యకర్తల్ని కలుసుకుని వారికి పరిస్థితులు తెలియజేస్తే వారినుండి సహాయం అందుతుందనుకున్నాడు 'చే'. కాని అది బొలీవియన్ పోలీసులు యిచ్చిన తప్పుడు ప్రకటన. దానిలో నిజం లేదు. కాలామినా మీద జరిగిన దాడిలో వియానాను పోలీసులు పట్టుకున్నారు. అతని కాలిలో బుల్లెట్ దిగితే ఆపరేషన్ చేయించి అతనిని విచారించారు. ఎంత చిత్రహింసలు పెట్టినా అతడు ఉద్యమం యొక్క రహస్యాలను చెప్పలేదు అతని చేతుల్ని విరిచేసి అడవిలో పడవేశారు. అతడు ప్రాణాలతో ఉన్నాడో లేదో గెరిల్లాలకు తెలియలేదు.

'చే' గెవారా దళం తరెందా అనే పట్టణానికి చేరింది. ఆహార పదార్థాలు కొనుక్కుని వెళ్తూఉండగా సైనికులు ఎదురు పడి కాల్పులు జరిపారు. గెరిల్లాలు ప్రతిఘటించారు. ముగ్గురు సైనికుల్ని కాల్చి తప్పించుకున్నారు. బొలీవియన్ సైనికులు గాలింపు చర్యలు చేపట్టడం వల్ల గెరిల్లాలకు ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి.

జూన్ నెల మొదటివారం నుండి 'చే' దళానికి ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. రియోగ్రాందే ప్రాంతంలో దళం మకాం వేసింది. ఆ స్థావరాన్ని సైనికులు చుట్టుముట్టి కాల్పులు జరిపారు. గెరిల్లాలు కాల్పులు తిరిగి చేయడంతో ఒక సైనికుడు చనిపోయాడు. మిగిలినవారు పారిపోయారు. తరువాత దళం రోజితా నదివైపు నడవసాగింది.

రేడియో ద్వారా ఫిదెల్ పంపుతున్న వార్తలు గెరిల్లాలకు అందుతున్నాయి కాని, గెరిల్లాలనుండి ఫిదెల్‌కి వార్తలందే అవకాశం లేదు. గెరిల్లాలను చాలా మందిని చంపామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తూంది. 'చే' చనిపోయాడని ప్రచారం జరుగుతూనే ఉంది. ఉద్యమం మీద అణచివేత పెరుగుతూన్నకొద్దీ, గెరిల్లాల మీద ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వామపక్షాల సానుభూతికూడా పెరుగుతూంది. కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న కార్మికోద్యమనాయకుడు హువాన్ లెచిన్ సాయుధ పోరాటానికి సిద్ధమవుతున్నాడు. మితవాదియైన విక్తోర్ పాజ్ ఎస్తెన్సోరా కూడా సాయుధ పోరాటానికి సిద్ధమవుతున్నాడు. ఈ వార్తలు గెరిల్లాలకు చేరాయి.

'చే'కి కొత్త ఉత్సాహం కలిగింది. కాని తరచుగా ఆస్తమారావడం, పేగుల్లో ఇన్‌ఫెక్షన్‌తో కడుపునొప్పి రావడం మొదలైన వాటివల్ల 'చే' ఆరోగ్యం బాగా దెబ్బతింది.

అదిజూన్ 24వ తేదీ. బొలీవియా ప్రజలు సెయింట్ ఆన్ పండుగ జరుపుకుంటు న్నారు. అంతలో రేడియోలో ఒకదుర్వార్త బొలీవియాలో సమ్మెచేస్తున్న గని కార్మికులమీద సైనికులు కాల్పులు జరిపి 87 మందిని చంపేశారు. ప్రభుత్వం నియంతృత్వానికి వ్యతిరేకంగా వాళ్లు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. దాంతో ప్రభుత్వం యిటువంటి చర్యకు దిగింది. అదేరోజు గనికార్మికులందరూ గెరిల్లా ఉద్యమానికి ఒక రోజు జీతాన్ని యివ్వడానికి నిశ్చయించుకున్నారు. అంతలో హఠాత్తుగా సైనికులు కాల్పులు జరిపారు. ఈ చర్య బొలీవియా చరిత్రలో ఒక విషాద ఘట్టంగా నిలిచిపోయింది.

ఈ వార్తవిని 'చే' కోపంతో, బాధతో కదిలిపోయాడు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి ఎటువంటి అవకాశమూలేదు. నిస్సహాయుడిగా ఉండిపోయాడు. గెరిల్లాలు గని కార్మికుల్ని రెచ్చగొట్టారని ప్రభుత్వం ప్రచారం చేసింది. అందువల్ల కాల్పులు జరపవలసి వచ్చిందని ప్రభుత్వం చెప్పింది.

అసలే అనారోగ్యంతో ఉన్న 'చే'ని యీవార్త యింకా కుంగదీసింది. చాలావరకు గెరిల్లా స్థావరాల్ని సైనికులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఆహారం, వైద్యం కూడా 'చే' కు అందలేదు. గెరిల్లాలు ఒక స్థానిక శిబిరం మీద దాడిచేశారు. సైనికులు చాలా

ఎక్కువ మంది ఉన్నారు. ఆయుధాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. శత్రువుల ఎదురు కాల్పులలో విల్లెగాస్‌కి, కొయెల్లోకు బుల్లెట్లు తగిలాయి. వారిని మోసుకునిపోయి ఒక గదిలోకి తీసుకుని వెళ్లి ఆపరేషన్‌చేశారు. కాని ఆపరేషన్ చేస్తూ ఉండగానే కొయెల్లో చనిపోయాడు.

'చే' దళం మళ్లీ రాత్రి ప్రయాణం సాగించింది. దారిలో కొంతమంది రైతులు ఎదురుపడ్డారు. అయితే వారు నిజమైన రైతులు కారు. వారివద్ద ఆయుధాలున్నాయి. గెరిల్లాలు వారిని బంధించారు. ప్రభుత్వం రైతులకు ఆయుధాలిచ్చి గెరిల్లాల మీదకు పంపుతున్నారని అర్థమయింది. అయినా 'చే' వాళ్లని విడిచి పెట్టమన్నాడు. ప్రభుత్వం ప్రజల్ని లొంగదీసుకుంటున్నారనే విషయం తెలుస్తూనే ఉంది. అయినా ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూనే ఉన్నాడు 'చే'. అనారోగ్యంతో ఉన్న వాళ్లకి వైద్యం చేస్తూనే ఉన్నాడు.

జూన్ నెలాఖరుకి 'చే' దళంలో 24 మంది మాత్రమే ఉన్నారు. సైనికులతో జరిగే పోరాటాలలో ప్రతీ సారీ గెరిల్లానే గెలుస్తూ ఉండడం వల్లనే 'చే' ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించగలిగాడు. లాపాజ్‌తో సంబంధాలు ఏర్పరుచుకుని ఒక వందమంది కార్యకర్తల్ని సంపాదించగలిగితే విజయం సాధించగలమని అతని నమ్మకం. బొలీవియా సైనికులకు క్రమశిక్షణ, నిబద్ధత లేవు. అందువల్ల వాళ్లని గెలవడం చాలా తేలిక అని 'చే' ఉద్దేశం. అయితే రైతులు సైనికులకు ఇన్‌ఫార్మర్లుగా మారడం అతనికి బాధకలిగించింది.

ఆ సమయంలో కొంతమంది బొలీవియా విద్యార్థులు గెరిల్లా దళంలో చేరాలని హవానాలో శిక్షణ పొందుతున్నట్లు తెలిసింది. 'చే' కి ఆశ కలిగింది. ఈ లోగా బొలీవియాలోనే ఉన్నాడనీ, త్వరలో పట్టుకుంటామనీ ప్రభుత్వం ప్రకటించింది. కాని కొంతమంది అధికారులకి 'చే' బ్రతికి ఉన్నాడనే నమ్మకం కలగలేదు.

జులై 6న గెరిల్లా దళాలు సమైపాతా పట్టణాన్ని ఆక్రమించుకోవాలని ప్రణాళిక సిద్ధం చేశాయి. దగ్గరగా ఉన్న ప్రజల సహకారంతో ఏర్పాట్లు చేసుకున్నాయి. ఒక మిలిటరీ ట్రక్కుడ్రైవరు గెరిల్లాలను పట్టణ శివార్లలో విడిచి పెట్టాడు. అది మిలిటరీ ట్రక్కు కావడం వల్ల సైనికులకు అనుమానం రాలేదు. అప్పుడే కరంటు పోవడంతో గెరిల్లాలు మెరుపుదాడి చేశారు. బొలీవియన్ సైనికులకు ఏమి చేయాలో పాలుపోలేదు. గెరిల్లాలు సైనికులందర్నీ బంధించారు. ఈ వార్త దేశమంతటా తెలిసిపోయింది. పత్రికలన్నీ గెరిల్లాల ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ కథనాలు ప్రచురించాయి. వెంటనే ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. ఎర్నెస్తో గెవారాని ప్రాణాలతోగాని, శవాన్ని గాని అప్పగించిన వారికి 50 మిలియన్ పెసోలు బహుమతి యిస్తామన్నది. ఆ ప్రకటన.

ప్రకటన వెలువడిన వెంటనే గెరిల్లాలు అప్రమత్తమయ్యారు. డబ్బుకి ఆశపడి ఎవరైనా తమను పట్టించ వచ్చునని ప్రజల్ని కలవడం మాని వేశారు. 'చే'కి ఆస్తమా ఎక్కువయింది. అడ్రినలీన్ తప్పయింక ఏమందూలేదు. దానినే ఇంజక్షన్‌గా తీసుకుంటున్నాడు. గెరిల్లాలను నిర్మూలించడానికి "ఆపరేషన్ సింథియా" అనే ప్రణాళికని తయారు చేసింది ప్రభుత్వం. గెరిల్లాలు రియోగ్రాండే, నాన్‌కవాచూ నదుల మధ్య ప్రాంతాలలోనే తిరుగుతున్నారని ప్రభుత్వానికి సమాచారం అందింది. ఆ ప్రదేశాన్ని రెండు వైపులా చుట్టుముట్టాలనేదే "ఆపరేషన్ సింథియా". కొచబాంబా అనే ప్రదేశంలోని వ్యవసాయ కూలీల యూనియన్లన్నీ కలిసి "క్రిస్టియన్ ఇన్ స్పిరేషన్" అనే రాజకీయ పార్టీగా ఏర్పడింది. ఆ పార్టీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది.

1967 జులై 26 న 'చే' దళంలో ఉన్న గెరిల్లాను క్యూబా విప్లవానికి ప్రారంభ సూచికగా "మన్కాదా ముట్టడి" వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఆ సందర్భంగా ఆధిపత్య రాజకీయాలకు విరుద్ధంగా క్యూబన్ విప్లవం ఉద్యమించిందన్నాడు. అదే సమయంలో బొలీవియన్ సైన్యాలు హెలికాప్టర్ల ద్వారా గెరిల్లాలున్న చోటికి చేరుకున్నారు. గెరిల్లాలకిగాని 'చే'కి గాని ఆ విషయం తెలియదు. కాని ఆ సమయానికి తనకు ఎదురుగా ఉన్న కొండమీద కొందరు సైనికులుండడం చూశాడు 'చే'. తమ దళాన్ని హెచ్చరిస్తూ ఉండగానే సైనికులు కాల్పులు జరిపారు. గెరిల్లాలు వెంటనే తేరుకుని కాల్పులు జరిపి కొంతమంది సైనికుల్ని గాయపరిచారు. వెంటనే పర్వతాల దిగువకు పరుగెత్తారు. రాత్రంతా అక్కడే తలదాచుకున్నారు. తెల్లవారుతూ ఉండగా శత్రువులు దగ్గరకు వస్తూ ఉండడం చూసి కాల్పులు జరిపి కొందరు శత్రువుల్ని గాయపరిచారు. అయినా శత్రుసైనికులు చాలామంది ఉన్నారు. వారి వద్ద ఆయుధాలు కూడా చాలా ఉన్నాయి. అందువల్ల కాల్పులు జరుపుతూనే నాన్‌కావాచూ నదిని దాటాలని ప్రయత్నిస్తున్నారు.

ఇదివరకు అడవిలో గెరిల్లాలకు కొన్ని గుర్రాలు దొరికాయి. వాటిని మచ్చికచేసు కున్నారు. హడావిడిగా గుర్రం మీద నది దాటే ప్రయత్నంలో 'చే' ఎక్కిన గుర్రం జారిపడింది. 'చే' కాలికి దెబ్బతగిలింది. అతని చుట్టూ గెరిల్లాలు వలయంగా నిలబడి శత్రువులతో పోరాడుతున్నారు. ఈ దృశ్యం చూడగానే అలా రక్షించబడుతున్న వ్యక్తి 'చే' అయి ఉంటాడని సైనికులకు అనుమానం కలిగింది. "దొరికాడు" అంటూ కేకలు పెట్టారు. రావుల్ క్విస్పాయా అనే గెరిల్లా నోటి గుండా బుల్లెట్ దూసుకునిపోవడంతో అక్కడి కక్కడే

మరణించాడు. తమాయో, పాచోలు విజృంభించి, శత్రుసైనికుల్ని నది దాటనీయకుండా అడ్డుకున్నారు. వారిద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. వారికి 'చే' చికిత్స చేశాడు. తమాయోకి గాయాలు బలంగా తగలడంతో ప్రాణాలు విడిచాడు.

శత్రువులలో ముగ్గురు చనిపోగా అయిదుగురు గాయపడ్డారు. అప్పుడే హవానాతో సంబంధాలకు ఉపయోగపడుతున్న ట్రాన్స్‌మీటర్ ఉన్న పరికరంపోయింది. అంటే బయటి ప్రపంచంతో సంబంధాలుండవన్న మాట ఇవేకాక, కిట్టు బ్యాగులు కూడా పోయాయి. వాటిలో కొన్ని మందులూ 'చే' రాసుకున్న నోటు బుక్సు కూడా పోయాయి. ఇన్ని నష్టాలు ఎదురైనా శత్రువుల్ని తప్పించుకుంటూ వెనుతిరిగారు.

ఆ సమయంలో ఆశ్చర్యకరమైన వార్త రేడియోద్వారా వినబడింది. బొలీవియాలోని మూడు ప్రధానవామపక్ష పార్టీలు గెరిల్లాలకు మద్దతు ప్రకటించాయి. బొలీవియాలోని పరిస్థితులు దిగజారుతున్నాయి. అమెరికా పెట్టుబడిదారులు అన్ని రంగాలను ఆక్రమిస్తున్నారు. ఒంగానియా సేనలు బొలీవియాను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇవన్నీ చూశాక వామ పక్షపార్టీలకు గెరిల్లాలపోరాటం మీద గౌరవం పెరిగింది. సాయుధ పోరాటంలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు.

ఈ సమయంలో ఏం చెయ్యాలో గెరిల్లాలకు పాలుపోవడం లేదు. 'చే' ఆరోగ్య పరిస్థితి రాను రాను విషమిస్తుంది. ఒక రోజు గుర్రం మీద వెళ్తూ క్రిందపడిపోయాడు. బాగా గాయాలయ్యి జ్వరం వచ్చింది.

బొలీవియాలోని పరిస్థితిని గురించి **C.I.A.** అమెరికా అధ్యక్షుడు జాన్సన్‌కి ఒక నివేదిక పంపింది. దానిలో బొలీవియాకు సైనిక బలం ఉన్నా తగిన శిక్షణ లేదనీ, గెరిల్లాలకు సాయుధ శిక్షణ ఉందనీ, వారిముందు బొలీవియా సైనికులు తీసికట్టు అని ఉంది. ఇంకొక తేడా ఏమంటే గెరిల్లాలు ప్రజలతో సాన్నిహిత్యాలు పెంచుకుంటూంటే బొలీవియా ప్రభుత్వం ప్రజల్ని బెదిరించి, హింసిస్తూంది కాబట్టి ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను ఎదురుకోవలసి వస్తుంది.

గెరిల్లాలు అడవుల గుండా ప్రయాణం సాగిస్తున్నారు. ఆహారం లేకపోవడంతో తమ వాహనాలైన గుర్రాల్నే చంపి తింటున్నారు. 'చే' ఆరోగ్యం విషమిస్తుంది. తమ పాత స్థావరంలో దాచుకున్న మందులు తేవడానికి 'చే' వారిస్తున్నా వినకుండా ఒక బృందం బయలుదేరింది. ముందుగా బయలుదేరిన చింగోలో, తాపియాలు సైనికులకు దొరికి పోయారు. సైనికులు చిత్రహింసలుపెట్టే సరికి గెరిల్లాలు వస్తువులున్న గుహల్ని

చూపించారు. అక్కడ ఉన్న ఆయుధాలు, మందులు సైనికులవశమయ్యాయి. వీటన్నింటిని బట్టి 'చే' బొలీవియాలోనే ఉన్నాడని వాళ్లకి అర్థమయింది.

మరికొందరు మందులకోసం స్థావరాలకు వెళ్లే సరికి వాటిని శత్రువులు ఆక్రమించుకుని ఉన్నారు. అందువల్ల మందులు తేకుండానే వాళ్లు తిరిగి వెళ్లారు. తిరిగి వచ్చినందుకు 'చే' సంతోషించాడు. గెరిల్లాలు మళ్లీ రోజితా నదీతీరం వద్ద ఉన్న అడవుల గుండా ప్రయాణం సాగించారు. ఆహారం లేదు. జంతువుల్ని వేటాడుదామంటే శత్రువులు గాలిస్తూ ఉండడంవల్ల తుపాకి పేల్చడానికి కూడా అవకాశం లేదు. తాగడానికి నీరు కూడా దొరకడంలేదు. చివరికి ఒక లోయలో నీరు దొరికితే త్రాగి ప్రాణాలు నిలుపుకున్నారు. ఆగస్టునెల అంతా యిలా కష్టంగానే గడిచింది. అందరూ కుంగిపోయారు.

గెరిల్లాలకు హొనోరాతో రోజాస్ అనే అతడు పరిచయం అయ్యాడు. అతడు ఆహారపదార్థాల్ని అందించడం, సైనికులకదలికలను తెలియజేస్తూ ఉండడం చేసేవాడు. సైనికాధికారులు యీ విషయం పసికట్టి అతనిని లోబరుచుకున్నారు. ఆగష్టు చివరి వారంలో జో ఆకిన్ గెరిల్లా దళం రోజాస్‌ని కలిసి అతని సహాయం కోరింది. అతడు అంగీకరించి, రియోగ్రాందే తీరానికి రమ్మన్నాడు. వెంటనే యీ వార్త సైనికాధికారులకి తెలియజేశాడు. సైనికులు అంతకుముందే అతని యింట్లో దాక్కుని ఉన్నారు.

మర్నాడు జో ఆకిన్‌దళం అక్కడికి వచ్చింది. రోజాస్ వాళ్లని ఎంతో సాదరంగా ఆహ్వానించాడు. అంతే కాక 'చే' గెవారా దళంతో తనయింట్లో జో ఆకిన్ దళం ఉందనీ అక్కడ వారిని కలుసుకోవచ్చుననీ వారిని కూడా తన యింటికి ఆహ్వానించాడు. జో ఆక్సిన్‌దళాన్ని నదిదాటి వెళ్లమనీ, అక్కడ 'చే' దళం ఎదురుచూస్తూందనీ చెప్పి వెళ్లిపోయాడు.

ఓ ఆకిన్‌దళం నదిని దాటడానికి సిద్ధమయింది ఇంతలో వాళ్లమీద కాల్పులు జరిగాయి. ఇది ఊహించని స్థితి. అయినా ఇజ్యాయెల్ రేయస్ ఎదురుకాల్పులు జరిపి, ఒక శత్రుసైనికుని చంపాడు. ఈలోగా శత్రువుల బుల్లెట్లు తానియా వీపు గుండా దూసుకునిపోయాయి. ఆమెను రక్షించడానికి వెళ్లిన ఫ్రెడ్డీ మైమూరాకూడా బుల్లెట్ తగిలి చనిపోయాడు. జోసే కాస్తిల్లో లొంగిపోతే అతనిని ఇంటరాగేట్ చేశారు.

రోజాస్ యిచ్చిన తప్పుడు సమాచారం ప్రకారం 'చే' దళం సాయంకాలానికి అతని యింటికి చేరింది. 'చే' దళం యిక రాదనుకుని శత్రుసైనికులు అంతకు ముందే వెళ్లిపోయారు. 'చే' దళం వచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు. వారు జో ఆకిన్ దళం కోసం

ఎదురుచూస్తూఉన్నారు. తెల్లవారింది. మరునాడు సైనికాధికారులు జో ఆకిన్‌దళాన్ని నిర్మూలించామని రేడియో ద్వారా ప్రకటించారు. 'చే' ఆ ప్రకటనని నమ్మలేదు. అయినా వివరాలతో వాళ్లు ప్రకటిస్తూ ఉండడంతో నమ్మక తప్పలేదు. వెంటనే అక్కడ ఉండడం మంచిది కాదని 'చే' దళం శత్రువులనుండి తప్పించుకుంటూ రియోగ్రాందేనదీ తీరానికి చేరింది. నదిని దాటుతూ ఉండగా సామాన్లు నీటిలో పడిపోయాయి. అయినా చాలా రోజులనుండి స్నానం చేయలేదు కాబట్టి తనివి తీరా స్నానాలు చేశారు. ఒకరోజున ఓ లోపంతోజా 'చే' తో సైనికులు కొందరు పొదలమాటున దాగున్నారని చెప్పాడు. వెతికితే ఎవరూ కనపడలేదు.

కాస్త్రిల్లోని విచారణ చేసిన సందర్భంగా 'చే' బ్రతికే ఉన్నాడనే విషయం సైనికాధికారులకు తెలిసింది. ఇగ్నేషియా పేరుతో పనిచేస్తున్న లయోలాగజ్‌మన్‌ని అరెస్టుచేశారు. పోలీసులు ఆమెను పట్టుకోడానికి ప్రయత్నించగానే ఎత్తైన భవనం నుండి దూకింది. గాయపడిన ఆమెను అరెస్టుచేసి, చిత్రహింసలు పెట్టారు. దీనికి నిరసనగా విద్యార్థులు, మేథావులూ ఆందోళన చేశారు. ఇవన్నీ రేడియో ద్వారా 'చే'కి చేరుతూనే ఉన్నాయి.

గెరిల్లాలు ఆల్తోసెకో పట్టణానికి చేరారు. గ్రామస్తుల్ని సమావేశపరిచి తమకు సహాయం చేయమని కోరారు. కాని గెరిల్లాలు పట్టణాన్ని విడిచివెళ్లిన వెంటనే సైనికులు ఆ గ్రామం మీద దాడిచేశారు. ఈ విధంగా ప్రమాదాల మధ్య గెరిల్లాల ప్రయాణం సాగుతూంది. సెప్టెంబరు చివరలో 'చే' కి కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. అయినా అతడు ప్రజలతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకుంటూ ఉన్నాడు. తరువాత 'చే' దళం లాహిగ్యూరా గ్రామానికి వచ్చారు. అక్కడ టెలిఫోన్ ఆపరేటర్ యింటికి వెళ్లింది. ఆపరేటర్ భార్య వారికి భోజనం పెట్టింది. అంతలో ఆపరేటర్‌కి ఒక ఉత్తరం వచ్చింది. అందులో గెరిల్లాలు వస్తే తెలియజేయమని ఉంది.

గ్రామం నుండి వెళ్తూ ఉండగా గాలిందో అనే సైనికాధికారి కాల్పులుజరిపాడు. శత్రువులనుండి తప్పించుకునే క్రమంలో దళంలో కొంతమంది తప్పిపోయారు. అయినా మిగిలిన వారు తప్పించుకున్నారు. అన్ని ప్రక్కలా సైనికులు ఉండడంతో బయట పడడం కష్టమనుకున్నాడు 'చే'. ఎవరైనా పోరాటం నుండి వెళ్లిపోదలుచుకుంటే వెళ్లిపొమ్మన్నాడు. కాని ఎవరూ వెళ్లడానికి యిష్టపడలేదు. చివరివరకు పోరాడతామన్నారు.

# 13. విప్లవమే శాశ్వతం !

అక్టోబరు 8వ తేదికి గెరిల్లాలు "యూరో" అనే లోయలోకివచ్చింది. మరణించిన వాళ్లూ, తప్పిపోయిన వాళ్లూపోగా 17మంది మిగిలారు. అతిజాగ్రత్తగా శత్రువులకంట పడకుండా అక్కడ విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ కూడా సైనికులు కాపలా కాస్తూ ఉండడం చూశారు. అయితే అంత యిరుకైన లోయలో గెరిల్లాలుంటారని సైనికులు ఊహించలేదు. అక్కడ యింకొక ప్రమాదం వచ్చింది. గెరిల్లాలు లోయలోకి వస్తూ ఉండగా ఒక రైతుచూసి సైనికాధికారులకు చెప్పాడు. వెంటనే సైన్యం లోయలోకి బయలుదేరింది. వారివద్ద ఆధునిక ఆయుధాలున్నాయి. ప్రక్కనున్న యింకొక లోయలోకి గెరిల్లాలు పారిపోతారనే అనుమానంతో సైన్యం రెండులోయలకు మధ్యకాపలా కాసింది.

అనీసితో రెయినాగా అనే గెరిల్లా అక్కడ సెంట్రీగా ఉన్నాడు. కొండమీద ఉన్న సైనికులు అతనిని చూసి కాల్పులు జరిపారు. తలలో నుండి బుల్లెట్ దూసుకునిపోయి అనీసితో మరణించాడు. మిగిలిన గెరిల్లాలు కాల్పులు జరపడంతో నలుగురుసైనికులు చనిపోయారు. అంతేకాక శత్రువులు లోయలోకి రాకుండా ఆపుతున్నారు. స్థావరాన్ని లక్ష్యం చేసుకుని శత్రువులు దాడి చేయడంతో అక్కడనుండి తప్పించు కోడానికి గెరిల్లాలు ప్రయత్నిస్తున్నారు.

అంతలో ఒక బుల్లెట్ 'చే' గెవారా కుడి పిక్కలో దిగబడింది. తలమీదున్న బెరెట్‌గుండా ఒక బుల్లెట్ దూసుకుపోయి రంధ్రం పడింది. అతడు తప్పించుకోడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

1967 అక్టోబరు 8వ తేదీన బొలీవియన్ సైనికులు తమ ఎదురుగా ఉన్న గెరిల్లాను చూస్తూ నిలబడిపోయారు. అంతదగ్గరగా వారు ఒక గెరిల్లా యోధుడిని చూడలేదు. వారు చూసింది విల్లీని. అతడి భుజం మీద యింకొక గెరిల్లా ఉన్నాడు అతడు దగ్గుతో ఆయాసపడుతున్నాడు. అతని చేతులు తుపాకిని పట్టుకుని ఉన్నాయి. అతడే అమెరికా సైన్యాలుగావిస్తూన్న 'చే' అని వారికి తెలియదు. 'చే' స్పృహతప్పిపోయే స్థితిలో ఉన్నాడు. 'చే' ని మోసుకుంటూ అతడు కొండ ఎక్కాడు. సైనికుల్ని చూడగానే వాళ్లపై గురిపెట్టడానికి సిద్ధమయ్యాడు.

సైనికులు వాళ్లదగ్గర ఉన్నతుపాకులు తీసుకుని లొంగిపొమ్మన్నారు. అప్పుడు సిమోన్ క్యూబా, "మర్యాదగామాట్లాడు. ఈయన కమాండర్ చేగెవారా" అన్నాడు. సైనికులు భయపడి ప్రక్కకి తప్పుకుని మర్యాదగా తుపాకులు యిచ్చేశారు. అంతలో కమాండర్ గారీ ప్రాదో అక్కడికి వచ్చాడు. 'చే'ని బంధించిన సన్నివేశాన్ని సైనికాధికారులు రకరకాలుగా ప్రచారం చేసుకున్నారు. ఆ దాడిలో పాల్గొనడమే వారికి గొప్ప అనిపించింది. తనకు దొరికింది కమాండర్ చేగెవారా యేనని నిర్ధారణ కావడంతో ప్రాదో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

కొంతసేపయ్యాక ప్రాదో లెఫ్ట్‌నెంట్ తోతీ అగ్వివేరాతో మాట్లాడాడు. 'చే' ని పట్టుకున్నామని చెప్పినా ఉన్నతాధికారులు చాలాసేపటి వరకు నమ్మలేదు. సాయంత్రం కల్నల్ ఆంద్రేస్ సెలిచ్ హెలికాప్టర్‌లో బయలుదేరాడు. హెలికాప్టర్ మీదకి లోయలోయింకా పోరాడుతూన్న గెరిల్లాలు కాల్పులు జరిపారు. అలా కాల్పులు జరుపుతూ అల్కారాన్ మొదలైన వారు లోయ ఎగువభాగానికి చేరారు. వాళ్లకి 'చే' పట్టుబడిన సంగతి తెలియదు. వారు లోయ అడుగుభాగాన ఉన్న గుహలోకి తప్పించుకున్నారు.

'చే' ని లాహిగ్యూరాకు తీసుకుని రమ్మని ప్రాదోకి ఆదేశాలు వచ్చాయి. సాయుధ సైనికులపహారా మధ్య ప్రయాణం మొదలయింది. ప్రాదో 'చే' కి ఖరీదైన సిగరెట్టు యివ్వబోతే తిరస్కరించి, ఒక సైనికునివద్ద నున్న ఆస్తోరియా సిగరెట్ తీసుకున్నాడు. దారిలో కొంతమంది గాయపడిన బొలీవియన్ సైనికులు కనపడితే వారికి వైద్యం చేసిగాని కదలనని చెప్పాడు. చివరికి ప్రాదో అంగీకరించాడు.

లాహి గ్యూరాకు చేరే సరికి రాత్రి 7.30 అయింది మరణించిన వారినీ, బందీలనూ గ్రామంలోని ఒక స్కూలు వద్దకు తీసుకునివచ్చారు. శవాలతో పాటు సిమోన్ క్యూబాని ఒక గదిలోను, 'చే' ని యింకొకగది లోను ఉంచారు. 'చే' కి కట్లు విప్పి, నొప్పితగ్గడానికి ఆస్పిరిన్ యిచ్చారు. ఆస్తమా ఎక్కువవుతుందని అతడు దానిని తీసుకోలేదు. తరువాత 'చే' వద్దనున్న బ్యాగ్‌ని తనిఖీ చేశారు.

సెలిచ్ బందీలను ఏం చెయ్యమంటారని ఫోన్‌చేశాడు. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చే వరకూ ఏమీ చేయవద్దని జవాబు వచ్చింది.

సెలిచ్ 'చే' దగ్గరకు వెళ్లి, "నీకు క్షవరం చేయిస్తే బాగుంటుందికదా" అని అతని గెడ్డం మీద చెయ్యివేశాడు. అతని ముఖం మీద యీడ్చికొట్టాడు 'చే'. సెలిచ్ వెనక్కి

పడబోయి నిలదొక్కుకున్నాడు. తనకు సహకరించి సమాధానాలు చెప్పకపోతే చంపేస్తానన్నాడు సెలిచ్. లోయలో ఉన్న గెరిల్లాలు ఏ క్షణంలో దాడిచేస్తారో అనే భయంతోనే ఉన్నారు సైనికాధికారులు.

ఆ రాత్రి శాతర్నో అనే సైనికాధికారి లాపాజ్ లోని జనరల్స్‌కి టెలిగ్రాం యిచ్చాడు. "గుడీవెనింగ్. 500 ను పట్టుకున్నామని మీకు తెలియజేశాం. 600,700 లలో ఏది అమలుచేయమంటారో తెలియజేయండి" 500 అంటే 'చే' గెవారా. 600 అంటే ప్రాణాలతో విడిచి పెట్టడం. 700 అంటే మరణశిక్ష. "తప్పని సరిగా 600 నే అమలు చేయండి. బయటికి తెలియనీయకండి" అనే సమాధానం వచ్చింది.

కాని అందరు అధికారులూ యీ విషయం గురించి చర్చించారు. రాత్రి 11.30 కు "ఫెర్నాండోకు 700 అమలు చెయ్యమని అధ్యక్షుడు ఆదేశించారు" అని టెలిగ్రాం వచ్చింది.

తనను వీళ్లు హత్యచేయబోతున్నారని 'చే' కు తెలుసా? తన భార్యా పిల్లల గురించి ఆ క్షణంలో అతని ఆలోచనలేమిటి? ఈ ప్రశ్నలకు జవాబు లేదు. ఆ రోజు అతడు డైరీ రాయలేదు.

ఆ రాత్రి స్కూలు గదిలో నేలమీద పడుకున్నాడు 'చే'. ఇద్దరు ఆ గదికి కాపలా ఉన్నారు. గుతిరెజ్ అనే సైనికాధికారి గదిలోకి వచ్చి 'చే' ని జుట్టుపట్టుకుని పైకి ఎత్తి ముఖం మీద ఉమ్మేశాడు. వెంటనే 'చే' అతని మీద తిరిగి ఉమ్మేసి, బలంగా తన్నాడు. ఆ దెబ్బ ఎక్కడ తగిలిందోకాని అతడు ఎగిరి దూరాన పడ్డాడు. ఇద్దరు సైనికాధికారులు గదిలోకి వచ్చి 'చే'ని ఆపారు.

కొంతసేపటికి ఒక వైద్యుడు వచ్చి 'చే' గాయాన్ని కడిగివెళ్లాడు. లాహిగ్యూరాలోని టెలిఫోన్ ఆపరేటర్ భార్యకు బందీలుగా ఉన్నవారికి భోజనం పెట్టమని ఆదేశాలు వచ్చాయి. 'చే'కి భోజనం పెట్టవద్దని గ్యుతిరెజ్ అడ్డుకున్నాడు. 'చే'కి పెట్టకపోతే ఎవరికీ పెట్టనంది ఆమె. ఆమె యిచ్చిన గిన్నెడు బటానీ సూపే 'చే' చివరి భోజనం.

తరువాత లెఫ్టినెంట్ తోతీ అగ్వివేరా 'చే' గదిలోకి వచ్చాడు. "నువ్వు డాక్టరువటకదా?" అని అడిగాడు. "డెంటిస్టుని కూడా. ఇక్కడ చాలా మంది పళ్లని పీకేశా" అన్నాడు వ్యంగంగా. అంతమంది సాయుధసైనికుల మధ్య ఉన్నా భయం లేకుండా ఉన్నాడు 'చే'. అంతేకాదు అతనిని చూసి వాళ్లే భయపడుతున్నారు. మరికొందరు అధికారులు గదిలోకి వచ్చి, "గాడిద శాశ్వతంగా బతుకుతుందంటావా?" అని 'చే'ని వెటకారంగా అడిగాడు. "లేదు మీరు మీ యజమానులు వొణికిచస్తారే – ఆ విప్లవమేశాశ్వతమైనది" అన్నాడు.

ఆ గదిలో యిద్దరు సాధారణ సైనికుల్ని ఉంచి, అధికారులు వెళ్లిపోయారు. వారిద్దరూ గెరిల్లా సానుభూతిపరులు. 'చే'ని విడిపిద్దామనుకున్నారు కాని సాధ్యంకాలేదు. అర్థరాత్రి తరువాత హెలికాప్టర్‌లో కల్నల్‌సెంతినో, శాతర్నోలు వచ్చారు. గదినుండి 'చేని బయటకి తీసుకునివచ్చారు. రోడ్రిగ్వెజ్ చేతో ఫోటో దిగాడు. తరువాత 'చే' గదిలోకి పోయి ఒంటరిగా కూర్చున్నాడు. అక్కడ బోర్డుమీద కొన్ని పదాలు చూశాడు. వాటిలో తప్పులున్నాయి. వెంటనే టీచర్ ని పిలిపించి తప్పులెందుకు రాశారని అడిగాడు. సరిచేయాలి. అది మీ విధి అని చెప్పాడు.

తీవ్రంగా గాయపడినప్పటికీ తన రైఫిల్‌కి ఉన్న బారల్ ధ్వంసమయ్యేవరకూ పోరాడాడు 'చే' పిస్టల్ లో బుల్లెట్లు లేకపోవడం వల్లనే అతనిని పట్టుకోగలిగారు. కాని అధికారులు పిస్టల్‌లో బుల్లెట్లు ఉండగానే పట్టుకున్నామని గొప్పలు చెప్పుకున్నారు.

అక్టోబరు 9వ తేదీ మధ్యాహ్నం అయొరొాయో అనే సైనికాధికారి వచ్చాడు. చే గెవారాను ఎవరు చంపుతారో చెప్పండి అన్నాడు. మారియో తెరాన్ అనే వ్యక్తి ముందుకి వచ్చాడు. గెరిల్లాల చేతులో మారియో పేర్లు గలవారు ముగ్గురు చనిపోయారు. కాబట్టి యీ మారియో వాళ్ల ఆత్మశాంతికోసం 'చే'ని చంపుతానన్నాడు. మధ్యాహ్నం ఒంటిగంటకు మారియో 'చే' గదిలోకి వచ్చాడు. అతని చేతిలో రైఫిల్ ఉంది. ప్రక్కగదిలోకి వెళ్లి అక్కడ బందీలుగా ఉన్న చాంగ్‌ని, సిమోన్ క్యూబాను కాల్చి చంపాడు. తరువాత 'చే' గదిలోకి వచ్చాడు. 'చే' గోడకు వీపు ఆనించి కూర్చున్నాడు. "ఎందుకు అంత అవస్థపడతావు? నన్ను చంపడానికి వచ్చావని తెలుసు" అన్నాడు. అతడు గురిపెట్టి కాల్చబోతూఉండగా "చంపరా, పిరికిపందా! ఓ మనిషిని చంపబోతున్నావు. అంతేకదా!" అన్నాడు 'చే'. మారియో ఒక అడుగు వెనక్కి వేసి కళ్లు మూసుకుని రైఫిల్‌ని పేల్చాడు. 'చే' కాలిలోకి బుల్లెట్ తగలడంతో క్రింద పడిపోయాడు. మారియో ధైర్యం తెచ్చుకుని 'చే' చేతిలోకీ భుజంలోకీ, గుండెలోకీ మూడు బుల్లెట్లు పేల్చాడు. తరువాత ప్రివేత్ కాబ్రెరో అనే అధికారి కూడా వచ్చి 'చే' శరీరం మీద ధైర్యంగా ఓ బుల్లెట్లు పేల్చాడు.

అక్టోబరు 8 నే 'చే'ని చంపామని అధికారులు ప్రకటించారు. కాని అక్టోబరు 9 న 'చే' ని చంపారన్న సంగతి ప్రపంచానికి తెలియడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

కెప్టెన్‌ప్రాదో 'చే'ని సజీవంగా తీసుకుని వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుని వచ్చాడు. కాని అతడు వచ్చేసరికే 'చే'ని చంపేశారు.

అతని మృతదేహాన్ని హెలికాప్టరులో తీసుకుని వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. 'చే' మరణవార్త వినగానే గ్రామస్తులందరూ స్కూలువద్దకు చేరారు. 'చే'ని చంపినందుకు

అధికారుల్ని తిట్టిపోశారు. హెలికాప్టర్‌కి ఉన్న నిచ్చెనల్లో ఒకదానికి 'చే' శరీరాన్ని తాళ్లతో కట్టారు. వ్రేలాడుతున్న మృతదేహంతో హెలికాప్టరు బయలుదేరింది.

1967 అక్టోబరు 10 న హెడ్‌క్వార్టర్స్‌లో అధికారులు విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లాహిగ్యూరా దగ్గర ఉన్న ఒక అడవిలో జరిగిన ఎదురు కాల్పుల్లో చేగెవారా చనిపోయాడని ప్రకటించారు. అంతలో 'చే' శరీరాన్ని తీసుకుని వస్తున్న హెలికాప్టర్ వచ్చింది. ఒక ప్రభుత్వ ఆసుపత్రికి దేహాన్ని తరలించి, దానిని విలేఖరులకు చూపించారు. అక్కడికి మరికొంత మంది అధికారులు వచ్చారు. వాళ్ల ముఖాల్లో విజయగర్వానికి బదులు భయం కనపడింది. ఎందుకంటే ప్రభుత్వాన్ని ఎదిరించితే గతియింతేనని చెబుదామనుకుంటే ప్రజలు యింకోవిధంగా స్పందించారు.

'చే' మృతదేహాన్ని చూసిన వారు అతడు ఏసుక్రీస్తులా కనిపించాడన్నారు. ఏసు పునరుత్థానం చెందినట్లుగా అతడు కూడా బ్రతకాలని ప్రజలందరూ కోరుకున్నారు.

ఎదురుకాల్పుల్లో మరణించాక 'చే'ని తీసుకొచ్చామని కొందరు అధికారులంటే, బ్రతికి ఉండగానే తీసుకొచ్చామని మరికొందరన్నారు. చివరికి 'చే'ని బంధించి తెచ్చి చంపినట్లుగా నిర్ధారణయింది. అయితే 'చే' శరీరాన్ని దహనం చేయాలనుకున్నారు. తలని, చేతుల్ని వేరు చేసి గుర్తింపు కోసం ఉంచి, మిగిలిన భాగాన్ని దహనం చేయాలని కొందరంటే, ఒక్క చేతుల్ని మాత్రమే దాచి మిగిలిన శరీరాన్ని దహనం చేయమని మరికొందరన్నారు. మిగిలిన గెరిల్లాల శరీరాల్ని కూడా దహనం చేయమని ఆదేశాలు వచ్చాయి.

ఆ గ్రామంలో దహన వాటికలు లేవు. కాబట్టి మిగిలిన శరీరాల్ని పూడ్చిపెట్టాలనుకున్నారు. వాటిలో 'చే' శరీరం కూడా ఉంది. వాటిని ఒక భవనం కోసం తవ్విన పునాదులలో పూడ్చి పెట్టారు. 'చే' శరీరాన్ని ఎవరో అపహరించారని ప్రచారం మొదలు పెట్టారు. 'చే' మరణించాడన్న వార్త ఫోటోలతో సహా పత్రికలలో చూసినా క్యూబా ప్రభుత్వానికీ, ప్రజలకీ నమ్మకం కలగలేదు. ఇదివరకు అటువంటి అబద్ధపు ప్రచారాలు వచ్చాయి. చివరకు ఫిదెల్‌కి సరియైన సమాచారం అందింది. నిరాయుధుణ్ణి చేసి 'చే' ని చంపారని తెలుసుకున్నాడు.

'చే' తమ్ముడు రాబర్టో కొందరు జర్నలిస్టులతో కలిసి తన సోదరుని శరీరాన్ని అప్పగించమని అధికారుల్ని డిమాండ్ చేశారు. వారు పొంతనలేని సమాధానాలు యిచ్చారు. కొన్ని పత్రికల ద్వారా 'చే'ని చంపిన విధానం వెల్లడయింది. మిగిలిన వారి శరీరాలు ఏమయ్యాయో తెలుసుకోడానికి ప్రయత్నించినా, ఆ ప్రయత్నం విఫలమయింది.

'చే' హత్య జరిగినప్పుడు సైనికాధికారిగా ఉన్న వర్గస్ సెలినస్ రిటైరయ్యాడు. 1995 లో అతడు 'చే' శరీరం, మిగిలిన వారి శరీరాల్ని ఎక్కడ పూడ్చి పెట్టారో తెలియజేశాడు. ఆ వార్తతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం మొదలయింది. బొలీవియన్ ప్రభుత్వానికి దిక్కుతోచలేదు.

1995 లోనే క్యూబాకు చెందిన ఫోరెన్సిక్ నిపుణులు, భూగర్భశాస్త్రజ్ఞులు తవ్వకాలు జరిపారు వారికి చేగెవారా, అతని అనుచరుల అస్థిపంజరాలు దొరికాయి. వాటిని క్యూబాకు తీసుకుని వెళ్లి సమాధిచేసి, వాటిమీద జ్ఞాపక చిహ్నాలు నిర్మించారు.

# 14. జ్ఞాపకాలు

'చే' చనిపోయిన తరువాత 15 సంవత్సరాల పాటు కొన్ని సంఘటనలు జరిగాయి. అతని మరణానికి కారకులైన వారిలో చాలామంది అసహజమైన మరణాలకు గురి అయ్యారు. కొందరు ప్రమాదాలలో చనిపోయారు. మరికొందరు మిగిలిన గెరిల్లాల చేతుల్లో చనిపోయారు. ఇంకా కొంతమంది ఆర్థిక యిబ్బందులవల్ల మానసిక వేదనతో మరణించారు. ఈ సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలయ్యాయి. 'చే' దయ్యంగా మారి శత్రువులమీద పగతీర్చుకుంటున్నాడన్నారు. క్యూబన్ ప్రభుత్వమే యీ హత్యలు చేయించిందని కొందరన్నారు.



జో ఆకిన్ దళాన్ని పట్టించిన రోజాస్‌ను గెరిల్లాలు చంపారు. బారి యెంతోస్ ప్రయాణం చేస్తున్న హెలికాప్టర్‌లో అకస్మాత్తుగా మంటలు పుట్టి కూలిపోగా అతడు మరణించాడు. సైనిక తిరుగుబాటు జరిగి ఒవాందో తన పదవిని కోల్పోయాడు. లెఫ్టినెంట్ హుయెర్తా కారు ప్రమాదంలో మరణించాడు. సెలిచ్ కూడా సైనిక తిరుగు బాటులో చనిపోయాడు. చేగెవారా చేతులు నరికిన రాబర్తోని మహిళాగెరిల్లా అతని ఆఫీసులోనే కాల్చివేసింది.

CIA ఏజెంట్ ఫెలిక్స్ రోద్రి గ్వెజ్‌కు ఆస్తమా వచ్చింది. ఏ చికిత్సకూ తగ్గలేదు. బహుశా 'చే' అతనికి శాపం యిచ్చి ఉంటాడని అందరి నమ్మకం. బారియెంతోస్ తరువాత



అధ్యక్షుడైన మేజర్ హువాన్ అయెరోయా దేశ బహిష్కరణకు గురిఅయ్యాడు. జెంతినోని 1976 లో  ప్యారిస్‌లో ఎవరో కాల్చి చంపారు. 1981 లో సంతాక్రుజ్‌లో జరిగిన ఒక ఘర్షణలో 'చే' ను బంధించిన ప్రాదోను హత్యచేశారు. ఆంతోనియో అర్ట్యుదాస్ అనే సైనికాధికారిని కూడా ఏళ్లతరబడి జైలులో పెట్టారు. కొంతమంది అధికారులు 'చే' ఆత్మతమవెంట పడుతూందన్న భ్రమతో పిచ్చాసుపత్రికి చేరారు.

ఈ మరణాలన్నింటికీ సామాజిక రాజకీయ కారణాలు కనపడుతూనే ఉన్నాయి. కాకతాళీయంగా జరిగిన యీ సంఘటనల్ని ఆధారంగా చేసుకుని చాలా మూఢనమ్మకాలు చెలరేగాయి. తనను చంపిన వారందరి మీదా 'చే' ఆత్మ ప్రతీకారం తీర్చు కుంటుందనే కథలు వ్యాపించాయి. ఈ ప్రమాదం నుండి బయట పడాలంటే మూడుసార్లు "మా తండ్రీ" అనీ, మూడుసార్లు "మేరీమాతకుజయం కలుగుగాక" అని పలకాలని పుకార్లు పుట్టాయి. సుమూరు 15 సంవత్సరాలపాటు బొలీవియాను 'చే' ఆత్మ వెంటాడుతూనే ఉంది.

చేగెవారా రాసుకున్న డైరీలకు అతడు చనిపోయిన తరువాత ప్రాముఖ్యం పెరిగింది. 1967 అక్టోబరు 10 న లాపాజ్‌లోని ఒక హొటల్లో బొలీవియాసైనికాధికారులు విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో 'చే' డైరీలు వారికి చూపించారు.

అక్టోబరు 16 న బొలీవియన్ సైన్యం తాము 'చే' డైరీలను మార్కెట్టులోకి విడుదల చేస్తున్నామని ప్రకటించింది. దాని ద్వారా గెరిల్లాల దుర్మార్గాలు ప్రజలకు తెలుస్తాయని చెప్పింది. ఈ డైరీల పేజీలు బొలీవియన్ ప్రభుత్వమూ, CIA లు కలిసి నకిలీ డైరీలు తయారు చేశారనీ వాటిని అమ్మడానికే హంగామా చేస్తున్నారనీ క్యూబన్ మేధావులు విశ్లేషించారు.



1968లో కథమరో మలుపు తిరిగింది. చిలీలోని సంతియాగో పట్టణంలో ఉన్న క్యూబన్ ప్రెస్ ఏజెన్సీ నుండి “ప్రెన్సాలాతినా”కి ఒక వ్యక్తి వచ్చాడు. తాను ‘చే’ డైరీలను క్యూబాకి చేర్చే పనిమీద వచ్చాననీ, తనను ఆంతోనియో ఆర్గ్యుదాస్ పంపాడనీ పరిచయం చేసుకున్నాడు.



1968లో బొలీవియన్ డైరి ముద్రణ ప్రారంభమయింది. స్పానిష్ భాషలో 'చే' రాసిన డైరీకి క్యూబన్ అనువాదం చేశారు. అది అన్ని పుస్తకాల షాపులకు చేరింది. ప్రజలకు ఉచితంగా వాటిని పంపిణీ చేశారు. మిగిలిన భాషల్లోకి అనువాదాలు కూడా చేశారు. తూర్పు యూరప్‌లో యీ పుస్తకాన్ని ప్రచురించలేదు. సోషలిజానికి, 'చే' యొక్క విప్లవ మార్గానికీ తీవ్రమైన విభేదాలుండడమే దీనికి కారణం. కొన్ని డైరీలలో మార్పులు జరిగాయి. 'చే' రాసిన అసలు డైరీలను క్యూబాకి చేర్చిన వ్యక్తి ఆర్గ్యుదాస్ అని తేలింది. ఈ పనిచేసినందుకు అతని మీద విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అతడు చిలీకి పారిపోయాడు. అతడు తిరిగి లాపాజ్‌కి రాగానే అరెస్టుచేసి జెయిలులో పెట్టారు. చివరకు ఏదోనేరం ఆపాదించి అతనిని కాల్చి చంపారు.



బ్రతికినంతకాలం 'చే' ఎటువంటి ఆస్తులు కూడ బెట్టుకోలేదు. కాని అతని మరణానంతరం అతనికి చెందిన ప్రతి వస్తువు విలువైనదిగా మారిపోయింది. కా బైగ్యువాన్ పట్టణంలో 'చే' పేరున ఒక మ్యూజియం ఏర్పాటు చేశారు. అతని తాలూకు ప్రతి వస్తువునీ క్యూబా ప్రభుత్వం సేకరించింది. క్యూబాలో ఎక్కడికి వెళ్లినా 'చే' జ్ఞాపకాలే గుర్తుకి వస్తాయి. వాటిని పూజనీయ వస్తువులుగా క్యూబన్ ప్రజలు భావిస్తారు. ఎందుకంటే క్యూబా విప్లవ చరిత్రలో ప్రజల సంస్కృతిలో 'చే' వేసిన ముద్ర చెరిగిపోయేదికాదు.



సియెర్రా ప్రాంతపు ప్రజలు అతని వస్తువుల్ని ప్రాణప్రదంగా దాచుకుంటారు. రక్తంతో తడిసిన అతని చిరుగుల దుస్తుల్నీ, వెంట్రుకల్నీ పవిత్ర చిహ్నాలుగా దాచుకున్నారు. 'చే' మృతదేహపు ఫోటోల్ని ఇంటింటా పెట్టుకున్నారు. అతని స్నేహితులూ, సహచరులూ అతనిని మరిచి పోలేక పోతున్నారు. సోషలిజానికి అచ్చమైన ఆచరణ "చే" జీవితం. 'చే' రచనలు చదివి అతనికి అభిమానులుగా మారిన వాళ్లు ప్రపంచవ్యాప్తంగా చాలామంది ఉన్నారు.


క్యూబన్ విప్లవోద్యమంలో కార్యకర్తగా చేరి, హత్యకు గురయ్యేవరకూ అమెరికన్ సామ్రాజ్య వాదంమీద రాజీలేని పోరాటాన్ని సాగించిన విప్లవ కారుడు 'చే'. అతని డైరీలలో అతిశయోక్తులు లేవు. తన స్వప్నాలనూ, నిరాశలనూ, భయాల్నీ రాసుకునేవాడు. తన బలహీనతలమీదా, తొందరపాటు మీద విమర్శలు చేసుకునేవాడు.

వ్యక్తిగత – రాజకీయ జీవితాల మధ్య వైరుధ్యం ఉండకూడదనీ –

చావంటే భయం లేకపోవడమూ జీవితం ప్రేమ లేకపోవడం ఒకటి కాదనీ –

విప్లవం ఒక నిరంతర ప్రవాహమే తప్ప ఒక సాయుధచర్యా, విజయోత్సవమూ కావనీ చెప్పినందుకు 'చే'ని ప్రేమించాలి.

# బయోగ్రఫీ సిరీస్





## విక్టరీ పబ్లిషర్స్

డోర్.నెం. 29-2-34,
రామమందిరం వీధి, ఏలూరు రోడ్డు,
విజయవాడ - 520 002.

డోర్.నెం. 2-4-1085, ప్లాట్ నెం. 3,
సాయిలక్ష్మీ నికేతన్, రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
నింబోలిఅడ్డ, హైదరాబాదు - 500027.
సెల్ : 9848122879

V P B S 0 0 5